గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



అక్టోబర్ 3న హైదరాబాద్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు.

సంపుటి 08, సంచిక: 285 | సోమవారం | 15-09-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## 'డ్రగ్స్ తయారీ' పాఠశాల 'మేధా' సీజ్

మరో స్కూల్‌కు విద్యార్థులు-ఆందోళనలో తల్లిదండ్రులు





ప్రజాపక్షం/ హైదరాబాద్

స్కూల్ మాటున డ్రగ్స్ తయారు చేస్తున్న సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్ పల్లిలోని మేధా ప్రైవేట్ పాఠశాలను పోలీసులు సీజ్ చేశారు. అందులో చదువుతున్న స్కూల్ పిల్లలకు ప్రత్యామ్నాయంగా మరో స్కూల్‌కు మార్చాలని విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. మరోపక్క స్కూల్‌లో డ్రగ్స్ తయారీ బయటపడడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ డ్రగ్స్ తయారీపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ మేరకు మేధా స్కూల్ అనుమతులను విద్యాశాఖ రద్దు చేసింది. బాలానగర్

తరువాయి 2లో

## అసోంలో భూప్రకంపనలు

- రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదు
- ఉదల్గురి, సోనిత్‌పూర్, తముల్‌పూర్, నల్బారి జిల్లాల్లో కంపించిన భూమి



**గువహటి :** దేశంలోని ఈశాన్య ప్రాంతంలో ఆదివారం 5.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని అధికారులు తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించినట్లు నివేదికలు రాలేదని వారు తెలిపారు. సాయంత్రం 4.41 గంటలకు భూకంపం రాగా, ఉదల్గురి జిల్లాలో 5 కి.మీ. లోతున భూకంప కేంద్రం ఉందని అధికారులు తెలిపారు. అసోం ముఖ్యమంత్రి హిమంత ఎక్స్‌లో పోస్టు చేస్తూ భూకంపం ఉదల్గురి సమీపంలో ఉందని, ఇప్పటివరకు ఎటువంటి పెద్ద నష్టం లేదా ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు రాలేదన్నారు. తాము పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. అసోంలోని ఉదల్గురి, సోనిత్‌పూర్, తముల్‌పూర్, నల్బారి, అనేక ఇతర జిల్లాల

తరువాయి 2లో

సెప్టెంబర్ 17న తెలంగాణ

## విలీన దినోత్సవంగా జరపాలి

- సిఎంకు సిపిఐ విజ్ఞప్తి
- రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజా పరిపాలన దినోత్సవంగా కాకుండా, తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో అధికారికంగా వేడుకలను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డికి కూనంనేని సాంబశివరావు బహిరంగ లేఖ రాశారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ (తెలంగాణ సింహభాగంగా ఉన్న) హైదరాబాద్ సంస్థానానికి రాకపోగా, అప్పటికే హైదరాబాద్ సంస్థానంలో నైజాం రాచరిక పాలన, భూస్వాములు, రజాకార్ల ఆగడాలు పరాకాష్ఠకు చేరడంతో 1947 సెప్టెంబర్ 11న ఆంధ్రమహాసభ తరపున రావి నారాయణ రెడ్డి, ఎఐటియుసి తరపున మఖ్దూం మొహియొద్దీన్, కమ్యూనిస్టు పార్టీ తరపున బద్దం ఎల్లారెడ్డి ముగ్గురు కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని లేఖలో మరోసారి గుర్తుచేశారు. ఆ పిలుపుతో ప్రజలంతా ఏకమై తిరుబాటు చేశారని, నాటి ఈమహత్తర పోరాటంలో కమ్యూనిస్టుల వీరోచిత పాత్రతో పాటు, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కూడా భాగస్వామిగా ఉందన్నారు. ఆ పోరాటం పతాకస్థాయికి చేరుకున్న ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న పోలీసు చర్య పేరుతో హైదరాబాద్‌లోకి భారత సైన్యం ప్రవేశించగానే నిజాం లొంగిపోవడం, అదే రోజు

తరువాయి 2లో

## మహానగరంలో జడివాన




- సాయంత్రంవేళ భయానక వాతావరణం
- భారీ వర్షంతో చెరువులను తలపించిన రహదారులు
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్
- ఇక్కట్లకు గురైన లోతట్టుప్రాంత ప్రజలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో వర్షం బీభత్సం సృష్టించింది. మహానగరంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షం ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. వర్షానికి నగరంలో రహదారులు జలమయ్యాయి. వర్షం నీటి వరదతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో వరదనీటితో వాహనాల రకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోని నీరు చేరడంలో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. దీంతో జిహెచ్ఎంసి, హైడ్రా యంత్రాంగం రంగంలోకి దిగ సహాయక చర్యలు చేపట్టాయి. ఈదురుగా గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. గచ్చిబౌలిలో కుండపోత వర్షంతో నగరంలో ఎక్కడ చూసినా రహదారులు వరదీ నీటితో వాగులు, చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. భారీగా కురుస్తున్న వర్షానికి రోడ్లతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోండా మార్కెట్, క్లాక్ టవర్, ఎంజీ రోడ్డు, బేగంపేట్, రసూల్ పుర, బోయిన్ పల్లి, తిరుమల గిరి, మారేడు పల్లి, అడ్డగుట్ట, మెట్టు గూడ,

తరువాయి 2లో



## ఎన్నికలపై ఇసి ఆత్మపరిశీలన

- ఎస్ఐఆర్ నిర్వహించిన విధానం సరిగా లేదు
- రాహుల్‌పై విమర్శలకు బదులు ఆయన వ్యాఖ్యలపై దర్యాప్తు చేయాలి
- కేంద్ర ఎన్నికల సంఘం తీరును వ్యతిరేకించిన మాజీ సిఇసి ఖురేషీ

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరును మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్. వై. ఖురేషీ వ్యతిరేకించారు. ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న రాహుల్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడానికి బదులు.. ఇసి వాటిపై దర్యాప్తునకు ఆదేశించి ఉండాల్సిందని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత స్థానంలో ఉన్న రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలు, చేసిన ఆరోపణలపై

తరువాయి 2లో

## బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలు



జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో గెలుపుకోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి

సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిల్లో తీసుకెళ్లాలి

కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని, ఇందుకు పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. త్వరలోనే

తరువాయి 2లో

## బెగ్గర్స్ హోమ్స్‌ను సంస్కరించండి

- యాచకుల గౌరవప్రద జీవనహక్కును కాపాడక పోవడం రాజ్యాంగ ఉల్లంఘనే
- పోషకాహారం, పరిశుభ్రత, నెలనెలా వైద్య పరీక్షలు
- మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** యాచకులకోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సంరక్షణ కేంద్రాల (బెగ్గర్స్ హోమ్స్)నిర్వహణకు సుప్రీంకోర్టు అనేక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ యాచక సంరక్షణ కేంద్రాలలో గౌరవప్రదమైన జీవన పరిస్థితులు ఉండాలని తెలిపింది. ఆహార నాణ్యత, పోషకాహారం, పరిశుభ్రత, వైద్యపరీక్షలతో నిత్యం సక్రమ నిర్వహణకు తగిన ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలని జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మార్గదర్శకాల్లో తెలిపింది. ఎప్పటికప్పుడు నాణ్యతా ప్రమాణాలను, నిర్వహణను తనిఖీ చేయాలని కోరింది. పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపిస్తే వారిని బెగ్గర్స్ హోమ్స్‌లో నిర్బంధించకుండా పిల్లల సంక్షేమ సంస్థలకు తరలించాలని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి కొన్ని నమూనా మార్గదర్శకాలను మూడునెలల వ్యవధిలో రూపొందించాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖకు ఆదేశించింది. బెగ్గర్స్ హోమ్స్‌లో చేర్చుకునేముందుగా ప్రతివ్యక్తికీ అర్హుడైన మెడికల్ ఆఫీసర్‌తో వైద్యపరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, తర్వాత 24 గంటల్లో వారికి ఆశ్రయం ఇవ్వాలని, యాచకులందరికీ నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. కూటికి నోచుకోని నిరుపేదలకు యాచక సంరక్షణ కేంద్రాలలో గౌరవప్రదంగా జీవించే మౌలిక హక్కు కాపాడటంలో విఫలమైతే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని హెచ్చరించింది. బెగ్గర్స్ హోమ్స్ నిర్వహణ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాల బాధ్యతేననడంలో ఎలాంటి సందేహం లేదని పేర్కొంది. ఉత్తరఢిల్లీ జిల్లాలోని లాంపూర్‌లో ఉన్న బెగ్గర్స్ హోమ్‌లో తాగునీరు కలుషితం కావడం, వంట వండేందుకు ఉపయోగించే మంచినీరు కలుషితం కావడం, వాటిల్లో బాక్టీరియాలు చేరి యాచకులకు కలరా, గ్యాస్ట్రో సమస్యలు రావడంతో ఈ ఘటనలపై కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కేంద్రాలలో సామర్థ్యానికి మించి ఎక్కువమందిని ఒకేచోట ఉంచకూడదని పేర్కొంది. ఈ కేంద్రాలలో వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, యాచకులలో వివిధ రకాల నైపుణ్యాలు

తరువాయి 12లో

## ప్రజాపోరాటాలు బలోపేతం




- సమస్యలపై సిపిఐ ఎల్లప్పుడూ గళం వినిపిస్తోంది
- వెనుకబడిన వర్గాల తరపున ఉద్యమాల్లో మరింత బలంగా ముందుకెళ్లాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్
- ఢిల్లీ సిపిఐ కార్యదర్శిగా దినేశ్‌చంద్ర వర్షిణే తిరిగి ఎన్నిక



**న్యూఢిల్లీ:** సిపిఐ ఢిల్లీ కార్యదర్శిగా ప్రొఫెసర్ దినేశ్ చంద్ర వర్షినే తిరిగి ఎన్నికయ్యారు. సిపిఐ 26వ ఢిల్లీ రాష్ట్ర మహాసభ దేశ రాజధానిలోని ఎఐటియుసి కేంద్ర కార్యాలయంలోని సురవరం సుధాకర రెడ్డి నగర్ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా వర్షినే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలను సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రారంభించారు. ప్రజల తరపున పోరాటాల బలోపేతానికి ఆమె పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై సిపిఐ ఎల్లప్పుడు గళం వినిపిస్తుందని అన్నారు. 100 ఏళ్ల పోరాట చరిత్రగల పార్టీ సిపిఐ ఒక్కటేనని చెప్పారు. కార్మికులు శ్రామికులు, వెనుకబడిన వర్గాల తరపున పోరాటాల్లో సిపిఐ మరింత బలంగా ముందుకు వెళ్లాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నిరంకుశ పాలనపై ప్రతిఘటన అవసరమన్నారు. ప్రజలు, కార్మికులు, రైతుల వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకించాలని... లౌకివాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. మహాసభలకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణతో పాటు సీనియర్ నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత సీనియర్ నాయకుడు ప్రొఫెసర్ యజ్ఞదత్ శర్మ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరుల స్థూపం వద్ద నాయకులు నివాళులర్పించారు. సిపిఐ ఢిల్లీ కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు ప్రొఫెసర్ దినేశ్ చంద్ర వర్షినే సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా... సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, మృతులకు నివాళులర్పించింది. ప్రొఫెసర్ దినేశ్ తిరిగి ఎన్నికైనందుకు నాయకులు, సహచరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



100 ఏళ్ళు దాటిన వృద్ధులు

## జపాన్ రికార్డు

ఆరోగ్యంగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్యలో 55 ఏళ్లుగా ప్రథమస్థానంలోనే

**టోక్యో:** నూరేళ్ళ వయసుదాటిన తర్వాత కూడా ఆరోగ్యంగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్యలో రికార్డు సృష్టించిన జపాన్ దేశం వరుసగా 55వ సంవత్సరంలో కూడా ఆ రికార్డును కొనసాగించింది. ఈ సెప్టెంబరునెల నాటికి జపాన్‌లో 100 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా ఆరోగ్యంగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్య 1,00,000 దాటిపోయిందని ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. వీరిలో 88 శాతం మంది మహిళలే ఉన్నారని జపాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. 87,784 మహిళలు, 11,979 మంది పురుషులు 100 సంత్సరాకంటే ఎక్కువకాలంగా జీవితం గడుపుతున్నారని జపాన్ ఆరోగ్యమంత్రిటకమారో ఫుకొకా ఒక ప్రకటనలో తెలియజేస్తూ వారందరికీ అభినందనలు తెలియజేశారు. 1981లో జపాన్‌లో

తరువాయి 2లో

## పోటాపోటీ ర్యాలీలు

- లండన్‌లో ఉద్రిక్తత
- ఘర్షణల్లో 26 మంది పోలీసులకు గాయాలు



**లండన్:** సెంట్రల్ లండన్‌లో శనివారం 1,50,000 మంది మితవాదులు "యునైట్ ద కింగ్డమ్" పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. వలస ప్రజలకు వ్యతిరేకంగా, ఫాసిజాన్ని సమర్థిస్తూ బ్రిటన్ చరిత్రలో మునుపు ఎన్నడూలేని రీతిలో ఈ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ప్రతిఘటిస్తూ, ఫాసిజం ఆలోచనాదృక్పథాన్ని తిరస్కరిస్తూ ప్రగతిశీలవాదులు మరో పోటీ ర్యాలీ నిర్వహించారు. మితవాద ర్యాలీలో పాల్గొన్న ప్రదర్శకులు పోలీసు ఆంక్షలు ఉల్లంఘించి పోటీ ర్యాలీలో ప్రదర్శకులమీదకు దూసుకువెళ్ళేందుకు ప్రయత్నం చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఉద్రిక్తతలను చల్లార్చేందుకు దాదాపు 1000 మంది బ్రిటన్ పోలీసులను ఈ ప్రాంతంలో మోహరించారు. పోలీసులు, పచ్చిమితవాద ప్రదర్శకులమధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో 26 మంది పోలీసులు గాయపడ్డారు. ఇష్టానుసారంగా ప్రవర్తించిన 25 మంది ప్రదర్శకులను పోలీసులు ఎంపిక చేసి అరెస్టుచేశారు. వారిపై

తరువాయి 12లో

## పత్తి రైతు మెడపై సుంకం రద్దు కత్తి



పడిపోనున్న ధర

భవిష్యత్తులో పంట సాగుపై నీలి నీడలు

ప్రజాపక్షం/ ఖమ్మం



కేంద్ర ప్రభుత్వం అమెరికా ఆంక్షలకు తలొగ్గి పత్తి దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయడంతో పత్తి రైతు మెడపై కత్తి పెట్టినట్లయింది. ఇప్పటికే సహకరించని ప్రకృతి, పట్టించుకోని పాలకుల నడుమ పత్తి రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అతివృష్టి, అనావృష్టి దిగుబడిపై ప్రభావం చూపుతుండగా గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారు. ఈ నేపథ్యంలో దిగుమతి సుంకం రద్దుతో పత్తి ధర మరింత పతనమయ్యే పరిస్థితి నెలకొన్నది. గతంలో అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై భారత ప్రభుత్వం 11 శాతం దిగుమతి సుంకాన్ని విధించేది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్

తరువాయి 12లో

## దారుణం

అనారోగ్య కుమారుడిని చంపేసి మూసీలో పడేసిన తండ్రి

కుటుంబ కలహాలతో భార్య గొంతుకోసిన భర్త

హైదరాబాద్‌లో వేర్వేరు చోట్ల ఘటనలు

ప్రజాపక్షం /హైదరాబాద్


మూడేళ్ల తన కుమారుడు తరచూ అనారోగ్యానికి గురికావడం.. చాలీచాలని సంపాదనతో కుటుంబం గడవడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో కుమారుడి ఆరోగ్యం నయం చేసుకోలేక పోయాడు ఆ తండ్రి. ఆసుపత్రులకు డబ్బు కట్టే స్థోమత లేక అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడిని చంపేసి మూసీ నదిలో పడేసిన విషాదకర సంఘటన హైదరాబాద్‌లో

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారోకు 27 ఏళ్ళ జైలుశిక్ష




**బ్రసిలియా :** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సెనారో (70)కు ఆ దేశ సుప్రీంకోర్టు 27 సంవత్సరాల మూడు నెలలు జైలుశిక్ష విధించింది. దేశంలో ఎన్నికల వ్యవస్థను కుప్పకూల్చేందుకు సైనిక కుట్రచేశారన్న ఆరోపణలపై కేసు విచారణ తర్వాత కోర్టు ఈ తీర్పు చెప్పింది. 2019 నుండి 2023 వరకూ ఆయన బ్రెజిల్ అధ్యక్షుడుగా పనిచేశారు. ఆయనకు జైలుశిక్ష విధించడాన్ని ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఇది ఉద్దేశపూర్వక రాజకీయ కక్షసాధింపు కుట్రగా ఆయన పేర్కొన్నారు. 2022 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత కూడా అధికారం నిలబెట్టుకునేందుకు ఆయన కుట్రకు పాల్పడ్డారన్న అభియోగం కోర్టులో రుజువైంది.



## గాజాసిటీ వదిలి వెళ్ళిపోయిన మూడు లక్షలమంది పాలస్తీనియన్లు

**గాజా:** గాజాసిటీలో ఐడిఎఫ్ దాడులు, హెచ్చరికల నేపథ్యంలో మూడు లక్షల మంది ప్రజలు ప్రాణభయంతో సామాన్లు సర్దుకుని దక్షిణ ప్రాంతానికి తరలివెళ్ళిపోయారు. ఇజ్రాయెల్ సైనికదళం ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. ఇప్పటికే గాజా సిటీలో 40 శాతం భూభాగం ఇజ్రాయెల్ సైన్యం చేతుల్లోకి వచ్చింది. శరణార్థ శిబిరాలుగా మారిన స్కూలు భవనాలు, తాత్కాలిక డేరాలపై కూడా ఇజ్రాయెల్ సైన్యం గగనతల దాడులు చేయడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు. తాజాగా ఆదివారం చేసిన దాడుల్లో 48 మంది మరణించారు. స్కూలు భవనాలను ధ్వంసం చేశారు. మహిళలు కన్నీళ్ళతో ఆర్తనాదాలు చేస్తున్నారు. తమకు తలదాచుకోవడానికి సురక్షిత ప్రాంతం ఎక్కడ ఉందో చెప్పాలని వారు ప్రశ్నిస్తున్నారు. శనివారం ఐడిఎఫ్ చేసిన గగనతల దాడుల్లో 10 నివాసిత భవనాలు ధ్వంసమయ్యాయి. అన్నీ రెడ్‌జోన్‌లే ఉన్నాయని, తాము తలదాచుకోవడానికి తగిన ప్రదేశం ఎక్కడుందో చెప్పాలని బిడ్డలను పోగొట్టుకున్న పాలస్తినా మహిళలు ప్రశ్నిస్తున్నారు. కాగా బార్సిలోనా నుండి గతనెల 31న బయలుదేరిన ''ఫ్లోటిల్లా'' నౌకలు ట్యునీషియా రేవులో విశ్రాంతి తర్వాత గాజాకు తుది ప్రయాణం ప్రారంభించాయి. దాదాపు యాభై నౌకల్లో ఆహారం, మానవ సహాయం గాజా ప్రజలకు సరఫరా చేసేందుకు గ్రెటా థన్‌బర్గ్ నాయకత్వంలో వెళుతున్నాయి.



**వెస్ట్రన్‌వాల్ సందర్శించిన రుబియో**

గాజాలో ఇజ్రాయెల్ దాడులు ఉధృతమైన తరుణంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆదివారంనాడు జెరూసలెంలోని పవిత్రమైన వెస్ట్రన్‌వాల్‌ను సందర్శించారు. ఆయన వెంట ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ, ఇజ్రాయెల్‌లో అమెరికా దౌత్యవేత్త మైక్ హక్కబీ ఉన్నారు. మొదటిసారి రుబియో అధికారికంగా ఇజ్రాయెల్‌లో పర్యటించారు. పురాతన వెస్ట్రన్ వాల్‌కు ప్రకృతిసహజసిద్ధంగా పడిన బీటలను పరిశీలించారు. ఆ తర్వాత అక్కడ వారంతా ప్రార్థనలు చేశారు.

## బందీల విడుదలకు నెతన్యాహూ ఒక్కడే ఆటంకం

### టెల్‌అవీవ్‌లో వేలాదిమంది భారీ ప్రదర్శన

**టెల్‌అవీవ్:** బందీల విడుదలకు, శాంతి ఒప్పంద సాధనకు ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఒక్కడే పెద్ద ఆటంకంగా నిలబడ్డారని ఇజ్రాయెల్ ప్రజలు పెద్ద ఎత్తున విమర్శించారు. టెల్‌అవీవ్‌లో వేలాదిమందితో జరిగిన భారీ ప్రదర్శన (వీక్లీ ర్యాలీ)లో, దోహాలో గడచిన మంగళవారం హమాస్ అగ్రనాయకత్వ సమావేశం జరుపుతున్న భవంతిపై ఐడిఎఫ్ చేసిన దాడులను వ్యతిరేకిస్తూ ప్రదర్శకులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బందీల విడుదలకు నెతన్యాహూ ఒక్కడే ఆటంకంగా మారాడని ప్రదర్శకులు నినాదాలు చేశారు. బందీల కుటుంబీకులు, గల్లంతైనవారి కుటుంబాల ఉమ్మడి వేదిక ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టింగ్ కూడా చేసింది. టెల్‌అవీవ్‌లోని హోస్టేజెస్ స్క్వేర్ వద్ద ప్రదర్శకులను ఉద్దేశించి వేదిక నాయకులతోపాటు హమాస్ చెర నుండి గతంలో బయటపడి ఇజ్రాయెలీ ప్రజలు కూడా ప్రసంగించారు. ఆమె భర్త డేవిడ్ ఇప్పటికీ ఇంకా హమాస్ వద్ద బందీగానే ఉన్నారు. భర్తను పోగొట్టుకుని వైధవ్యం అనుభవించడానికి తాను సిద్ధంగా లేనని ఆమె అన్నారు. ప్రతి సెకనూ తీవ్ర జాప్యానికి, ప్రాణాంతకమైన ప్రమాదానికి దారి తీస్తుందని వారు హెచ్చరించారు. హమాస్ చెరనుండి బయటపడిన మాజీ బందీ షరోన్ అలోనీ క్యునియో ర్యాలీలో ప్రసంగిస్తూ, హమాస్ వద్ద బందీలుగా ఉన్న 48 మందిని విడుదల చేయడంలో నెతన్యాహూ తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. బందీల విడుదలకు కుదిరిన తాత్కాలిక ఒప్పందాన్ని తిరస్కరించి ఆయన అనుసరిస్తున్న వైఖరి ప్రమాదకరంగా మారిందని, బందీల ప్రాణాలు అపాయంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.



**ఆక్లాండ్‌లో 50 వేలమంది పాలస్తినా సంఘీభావ ర్యాలీ**

న్యూజిలాండ్ అతిపెద్ద నగరం ఆక్లాండ్‌లో 50 వేలాదిమంది ప్రజలు పాలస్తినా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై కఠినమైన ఆంక్షలు విధించాలని సెంటర్–రైట్ న్యూజిలాండ్ ప్రభుత్వ పాలకులను ప్రదర్శకులు డిమాండ్ చేశారు. గాజా నుండి సైన్యం వెనక్కు వెళ్ళిపోవాలని, ప్రజలకు తగినంత ఆహార సరఫరా చేసేందుకు ఐక్యరాజ్యసమితి సంస్థలను అనుమతించాలని నినాదాలు చేశారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత న్యూజిలాండ్‌లో ఇంతభారీ ప్రదర్శన జరగడం ఇదే మొదటిసారి. గతనెల ఆగస్టులో సిడ్నీలో ప్రఖ్యాతమైన హార్బర్ బ్రిడ్జిని స్తంభింపజేసి వేలాదిమంది భారీ ప్రదర్శనను స్ఫూర్తిగా తీసుకుని పాలస్తినా సంఘీభావ 'ఆయోటెరోవా సమూహం'' సంస్థ ఈ ప్రదర్శన జరిపింది.

## ఆరునెలల్లో.. నేపాల్ ప్రజలకు అధికార బదిలీ



**ఖాట్మండు:** ఆరునెలలలోనే ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి అధికారం బదలాయిస్తానని నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి చెప్పారు. ఆదివారం ఉదయం ఆమె ఖాట్మండులో అధికార బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆమె జనరేషన్ జెడ్ ఉద్యమంలో మరణించిన 72 మందికి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు నష్టపరిహారం అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మృతుల్లో 59 మంది ప్రదర్శకులు, 10 నివాసితులు, మరో ముగ్గురు పోలీసులు ఉన్నారు. ఒత్తిడికి తలొగ్గి అనివార్యంగా ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకున్నాననీ, ఆరు నెలల్లో అధికారం బదలాయిస్తానని, ఈ పదవిలో కొనసాగే ఉద్దేశం తనకు లేదని చెప్పారు. మార్చి ఐదో తేదీన పార్లమెంటు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు శనివారంనాడే ఆమె ప్రకటించారు. జనరేషన్ జెడ్ ఆలోచనాదృక్పథానికి, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు తన కర్తవ్యాలను నిర్వర్తిస్తానని చెప్పారు. ఈ విధంగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం ఎంతో అవమానకరంగా ఉందనీ, ఇలా చేస్తే ఇక మనల్ని నేపాలీయులను ఎలా అంటారని ఆమె ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణ, పాలన, ధ్వంసమైన ప్రభుత్వ భవనాల పునరుద్ధరణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, తదుపరి ఎన్నికల నిర్వహణ వంటి అనేక సవాళ్ళు ఆమెకోసం ఎదురుచూస్తున్నాయి.

**అమెరికా, చైనా సహా దలైలామా అభినందన**

నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న సుశీల కర్కిని పలు దేశాల నాయకులు అభినందించారు. అమెరికా, చైనా, బ్రిటన్, జపాన్, పాకిస్థాన్ తదితర దేశాలు ఆమెకు అభినందన సందేశాలు పంపారు. టిబెటన్ బౌద్ధమత గురువు దలైలామా ఆమెకు అభినందనలు తెలియజేశారు. నేపాల్‌కు టిబెట్ ప్రజలకు మధ్య సుదీర్ఘమైన అనుబంధం ఉందని, 1959 నుండి ఎంతోమంది టిబెటన్ శరణార్థులకు నేపాల్ ఆశ్రయం ఇచ్చిందని ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నేపాల్‌లో అధికార బదలాయింపు కార్యక్రమం ఎంతో ప్రశాంతంగా ముగియడంపట్ల అమెరికా ప్రభుత్వం హర్షం ప్రకటించింది. అదేవిధంగా చైనా ప్రభుత్వం కూడా నేపాల్ కొత్త ప్రధానమంత్రికి అభినందనలు తెలియజేసింది. శాంతి, సహజీవనం సహా పంచశీల సూత్రాలను ప్రతిపాదించింది. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాస్ షరీఫ్ కూడా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రిటన్ దౌత్యకార్యాలయం, జపాన్ ప్రభుత్వం, బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక నాయకుడు, మహ్మద్ యూనుస్ కూడా అభినందన సందేశాలు పంపారు.


## ఇజ్రాయెల్–పాలస్తినా మనుగడకు జనరల్ అసెంబ్లీ మెజార్టీ తీర్మానం



**న్యూయార్క్:** మధ్యప్రాచ్యంలో దశాబ్దాలుగా ఇజ్రాయెల్–పాలస్తినా మధ్య ఘర్షణ నివారించేందుకు జరుగుతున్న సన్నాహాల్లో భాగంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ రెండు దేశాల ఇరుగుపొరుగు మనుగడను అంగీకరిస్తూ కాలానుగుణమైన, దశలవారీ పరిష్కారానికి మెజారిటీ ఓటు ద్వారా ఆమోదం తెలియజేసింది. హమాస్ ఉగ్రవాద సంస్థ లేని పాలస్తినా రాజ్యం మనుగడ సాగించాలని తీర్మానించింది. హమాస్, ఇజ్రాయెల్ పరస్పర దాడులను ఖండించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి ఏడు పేజీల తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానంలో అటు హమాస్‌ను, ఇటుఇజ్రాయెల్ చర్యలను ఐక్యరాజ్యసమితి ఖండించింది.మొదటిసారి ఐక్యరాజ్యసమితి అధికారికంగా హమాస్ ఉగ్రవాదాన్ని, దుష్కృత్యాలను ఖండించింది. వారు తక్షణం ఆయుధాలు స్వాధీనం చేయాలని కోరింది. గల్ఫ్, అరబ్ దేశాలు ఈ తీర్మానానికి మద్దతు తెలియజేశాయి. అదేవిధంగా 2023 అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ ఏకపక్ష కాల్పుల దాడిని జనరల్ అసెంబ్లీ ఖండించింది. హమాస్ ఆనాడు చేసిన దాడిలో 1200 మంది మరణించగా, మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. కొంతమంది విడుదలకాగా, ఇంకా వారివద్ద 20 మంది మాత్రమే సజీవులు ఉన్నారు. అగాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న దారుణమారణ కాండను కూడా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీవ్రంగా ఖండించింది. ఉద్దేశపూర్వక ఆకలిచావులను వ్యతిరేకించింది. జులైలో సౌదీ అరేబియా, ఫ్రాన్స్‌దేశాల చొరవతో జరిగిన ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సదస్సు ఫలితంగా ఈ ఏడు పేజీల తీర్మానం శుక్రవారంనాడు వెలువడింది. ఐక్యరాజ్యసమితి వార్షికోత్సవాల సందర్భంగా ఈనెల 22వ తేదీన ఉన్నతస్థాయి సమావేశం న్యూయార్క్‌లో జరుగుతుంది. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, బెల్జియం దేశాలు ఈనెల చివరలో జరిగే సమావేశంలో పాలస్తినాకు లాంఛనంగా గుర్తింపు ఇవ్వనున్నాయి. దీనికి ముందుగా జనరల్ అసెంబ్లీలో 142 దేశాలు పాలస్తినాకు అనుకూలంగా ఓటు వేయగా, పది దేశాలు వ్యతిరేకించాయి. మరో 12 దేశాలు తీర్మానానికి దూరంగా ఉండిపోయాయి. ఇక ఇజ్రాయెల్, అమెరికా దేశాలు ఈ సమావేశాన్ని బహిష్కరించాయి.

## తెలంగాణను వెడ్డింగ్ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

**సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెళ్లి వేడుకలు జరిపించేందుకు ప్రపంచంలో ప్రముఖ గమ్యస్థానంగా తెలంగాణను చూపించడం ధ్యేయంగాప్రభుత్వం పని చేస్తుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని అక్షయ కన్వెన్షన్‌లో పర్యాటక శాఖ సహకారంతో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టిసిఇఐ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నాల్గవ సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ లో మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో పెళ్లిళ్ల పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందని, అందులో తెలంగాణ రాష్ట్రం కీలకపాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ప్రపంచం మొత్తం భారతదేశాన్ని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా చూస్తోందని, అలాంటి సమయంలో తెలంగాణను ప్రపంచ పటంలో వివాహ వేడుకల హబ్ నిలపాలన్నదే మా సంకల్పమని పేర్కొన్నారు.వివిధ థీమ్స్, బడ్జెట్లకు అనుగుణంగా పెళ్లిళ్లను జరిపేందుకు అద్భుతమైన వేదికగా తెలంగాణ రాష్ట్రం ఉందని అన్నారు. పురాతన కోటలు, రాజమహాళ్లు, దట్టమైన అడవులు, నదులు సరస్సులు, కొండలు, ఆధునిక విలాసవంతమైన హోటళ్లు — తెలంగాణలోని ఈ సంపద ప్రపంచ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మార్చగల ఎన్నో అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, వెడ్డింగ్ ప్లానర్లు తెలంగాణను కేవలం ఒక రాష్ట్రంగా కాకుండా, ఒక జీవించే సంస్కృతిగా కొత్త దృష్టితో చూసి, దీనిని భారతదేశంలోనే కాక, అంతర్జాతీయంగా పరిచయం చేయాలి అని ఆయన పిలుపునిచ్చారు. పెళ్లి అనేది కేవలం రెండు మనసుల కలయిక మా త్రమే కాకుండా, రెండు కుటుంబాలు, రెండు సంస్కృతుల మిళితమని, అపూర్వమైన తెలంగాణలో ఉన్న పర్యాటక ప్రదేశాల్లో పెళ్లి వేడుకలు పూర్తి చేసుకోవాలని, మధుర స్మృతులను పదిలపరచుకోవాలని కాబోయే వధూవరులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గమ్యస్థానాల గురించి వివరాలను ప్రచారంలోకి తీసుకువచ్చి వివాహ వేడుకలను ఎందుకు తెలంగాణ లో చేసుకోవాలో తెలిపేలా ప్రణాళికలు రూపొందిస్తామ ని చెప్పా రు. రాష్ట్రంలోని అద్భుతమైన వెడ్డింగ్ డెస్టినేషన్‌ల ను పరిశ్రమకు ప్రత్యక్షంగా పరిచయం చేసేందుకు ప్రత్యే క పర్యటనలు ఏర్పాటు చేస్తామని, లైసెన్సులు, అనుమతులు, లాజిస్టిక్స్ , వివాహాల నిర్వహణకు అవసరమైన అ నుమతులు వేగంగా మంజూరు చేస్తామని, ప్రైవేట్‌పబ్లిక్ భాగస్వామ్యం తో ఈ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కొత్త విధానాలు సిద్ధం చేస్తున్నామని, మీరు ఆలోచించండి, మేము అమలు చేస్తాం' అనే నినాదంతో పర్యాటక శాఖ ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, టిసిఇఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా, తదితరులు పాల్గొన్నారు.

## బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ డివిజన్ల ఇన్‌చార్జ్‌లతో సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సిఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి, వివిధ డివిజన్లకు ఇన్‌చార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు వెన్నెల, శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, స్థానిక రాజకీయపరిస్థితులు, ప్రభావిత అంశాలు, రాజకీయ ప్రత్యార్థులు, కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తదితర అంశాలపైన సిఎం సమీక్షించారు. ఉప ఎన్నిక గెలుపు, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసాను స్థానికు ప్రజలకు కల్పించాలన్నారు. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసిసి చూసుకుంటుందని, పార్టీ గెలుపు కోసం పని చేయాల్సిన గురుతర బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు తాను సమాచారాన్ని తీసుకుంటానని,జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని సిఎం సూచించారు.

## జడివాన (మొదటి పేజీ తరువాయి)

సీతాఫల్ మండి, ముషీరాబాద్, రాంనగర్, తార్నాక, ఎల్.బి.నగర్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, కాచిగూడ, కుషాయిగూడ, కాప్రా, కీసర, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌తో పాటు తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. హైదరాబాద్ సిటీలో కురిసిన భారీ వర్షానికి రోడ్లు వరద కాలువలుగా మారిపోయాయి. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 నుంచి, విరించి సిగ్నల్ వైపు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గంట పాటు అడుగు కూడా వాహనాలు కదలకపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్ మండలంలో 33.4 మిల్లీ మీటర్లుగా అధిక వర్షం పడింది. మండలాల వారీగా కుత్బుల్లాపూర్‌లో 21.5, మేడ్చల్‌లో 21.1, కీసరలో 20, శామీర్‌పేటలో 19.8, ఆల్వాల్‌లో 13.6, దుండిగల్‌లో 13.4, మల్కాజిగిరిలో 11.8, కూకట్‌పల్లిలో 11, బాలానగర్‌లో 11.3, కాప్రాలో 10.2, బాచుపల్లిలో 9.1, మూడుచింతలపల్లిలో 7.7, ఉప్పల్‌లో 5.3, మేడిపల్లిలో 3.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది.

**తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు..**

తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయన్నారు. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు పడే సూచట్లున్నాయని చెప్పారు.

## అసోంలో భూప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

నివాసితులు ఈ ప్రకంపనలను ప్రత్యక్షంగా చవిచూశారు. భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు ఒక్కసారిగా గువహటిలోని తమ నివాసాల నుండి బయటకు పరుగులు తీశారు. మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతాల్లో కూడా భూ ప్రకంపనలు వచ్చాయి. అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో నివాసితులు భయంతో ఇళ్ళు, దుకాణాల నుండి బయటకు పరుగులు తీశారు. రాష్ట్రం నుండి ఇప్పటివరకు ఆస్తి నష్టం లేదా ప్రాణనష్టం జరిగినట్లు ఎటువంటి నివేదికలు రాలేదని రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి డాని సులు చెప్పారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఈశాన్య రాష్ట్రాలు అధిక భూకంప జోన్‌లోకి వస్తాయి. ఈ ప్రాంతంలో తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. మరోవైపు ఆదివారం ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు సమాచారం.

## మేధా స్కూల్ సీజ్

(మొదటి పేజీ తరువాయి)

మండల విద్యాధికారి హరీశ్ చంద్ర ఆదేశాలతో ఈ స్కూల్ ను ఆదివారం సీజ్ చేశారు. ఈ స్కూల్ లో ప్రస్తుతం 130 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిని ఇతర స్కూల్ లో చేర్పించేందుకు విద్యాసాఖ అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పాఠశాల భవనంలో ఉదయం పూట పాఠశాల కొనసాగుతుండగా మరో రెండు గదుల్లో అల్ప్రాజోలం తయారీ నిర్వహిస్తున్నట్లు ఈగల్ బృందం దాడుల్లో బయటపడింది. రెండేళ్ల క్రితం నుంచి పాఠశాలను జయప్రకాశ్ గౌడ్ నిర్వహిస్తుండగా ఈ స్కూల్‌ను అడ్డం పెట్టుకుని మత్తు పదార్థాల తయారీ చేపట్టినట్లు తాజా దాడుల్లో బట్టబయలైంది. స్కూల్ అనుమతులు రద్దు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇక్కడి విద్యార్థులను ఇతర స్కూళ్లలో చేర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా కొత్త పాఠశాలలు అన్ని విధాలుగా తమకు అనుకూలంగా ఉంటాయా లేదా అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. కొత్త స్కూళ్లు ప్రస్తుతం ఉన్న స్కూల్ తో పోలిస్తే దగ్గరే ఉంటుందా లేదా దూరం వెళ్లాల్సి వస్తుందా? అక్కడి ఫీజులు ప్రస్తుత స్కూల్ ఫీజులపై రకరకాల ఆందోళనలు నెలకొన్నాయి. శ్రీమేధా స్కూల్ డైరెక్టర్ మహబూబ్‌నగర్‌కు చెందిన డైరెక్టర్ జయప్రకాష్‌గౌడ్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. జయప్రకాష్‌గౌడ్‌కు మహబూబ్‌నగర్, జడ్చర్లలో కూడా స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో కూడా ఏమైనా అసాంఘీక కార్యక్రమాలు సాగిస్తున్నాడా అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అరెస్టు అయిన నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కూకట్‌పల్లి కల్లుకాంపౌండ్‌లో ఇటీవల కల్తీకల్లుతో సుమారు పది మంది వరకు చనిపోయారు. ఈ సంఘటనలో కూడా జయ ప్రకాష్ గౌడ్ సరఫరా చేసిన అల్ప్రాజోలం కారణమై ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో మరింతలోతుగా దర్యాప్తు చేసేందుకు ప్రకాష్‌గౌడ్‌ను విచారించాలని పోలీసులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం పోలీసు కస్టడీ కోరుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. సుమారు 15 రోజుల పాటు విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. స్కూల్‌లో ఎప్పటి నుంచి ఈ డ్రగ్స్ దందా నడుస్తుంది.. ? ఇక్కడ తయారైన డ్రగ్స్‌ను ఏఏ ప్రాంతాలకు సరఫరా చేశారు..? ఎంద డబ్బు సంపాదించారు..? ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేశాడా ఈ దందా వెనుక మరెవరి హస్తం ఉందనే కోణంలో జయప్రకాష్‌గౌడ్‌ను విచారిస్తామని పోలీసులు చెబుతున్నారు.

## దినోత్సవంగా జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైందన్నారు. మహోత్తర పోరాటం ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని, తమకు కూడ తెలుసని, అయితే మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సెప్టెంబర్ 17ను గత ఏడాది తెలంగాణ ప్రజాపరిపాలన దినంగా నిర్వహించగ, ఈ ఏడాది కూడా అదే పేరుతో నిర్వహించనున్నట్లు తెలిసిందన్నారు. అయితే ప్రజాపాలన దినం పేరుతో ఉత్సవాలను నిర్వహించడం వల్ల నాటి చారిత్రాత్మక పోరాటాన్ని ఏ మాత్రం ప్రతిబింబించడం లేదని, అందుకే సెప్టెంబర్ 17ను ''తెలంగాణ విలీన దినోత్సవం''గా నిర్వహించడం సముచితంగా ఉంటుందని భావిస్తున్నామని, ఇందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఈ లేఖ ద్వారా మనవి చేస్తున్నానని కూనంనేని పేర్కొన్నారు. అదే విధంగా సిపిఐ పలు ప్రతిపాదనలను లేఖ ద్వారా సిఎం ముందు పెడుతున్నామన్నారు.

**ప్రభుత్వానికి సిపిఐ ప్రతిపాదనలు**

- ☞ సెప్టెంబర్ 17ను ప్రజా పరిపాలన దినోత్సవంగా కాకుండా, తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో నిర్వహించాలి
- ☞ నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలి.
- ☞ అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటుచేసి అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, పోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలి.
- ☞ హైదరాబాద్‌లో నాటి పోరాట సేనానులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.
- ☞ తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలి.
- ☞ నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచేవిధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు నామకరణం చేయాలి.
- ☞ పలు సభలలో ముఖ్యమంత్రిగా నాటి కమ్యూనిస్టు పార్టీ, నాయకులు చేసిన వీరోచిత పాత్రను శ్లాఘించడం, అలాగే వీరనారి చాకలి అయిలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టినందుకు కమ్యూనిస్టు పార్టీ తరుపున ప్రత్యేకించి అభినందనలు తెలియజేస్తున్నాం. చరిత్రపై సంపూర్ణ అవగాహన ఉన్న వారిగా పై ప్రతిపానలను కూడా సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాం.

## ఇసి ఆత్మపరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

క్షుణ్ణంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ఇసికి ఉందని చెప్పారు. బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)ను నిర్వహించిన విధానాన్ని కూడా మాజీ ఎన్నికల కమిషనర్ తప్పుబట్టారు. సరైన విధంగా విధులు నిర్వహించకపోవడం వల్ల ఎన్నికల కమిషన్ (ఇసి)పై విమర్శలు వస్తుంటే మాజీ కమిషనర్ గానే కాకుండా భారత పౌరుడిగానూ తాను తీవ్ర వేదనకు గురవుతానని ఖురేషీ అన్నారు. ఎన్నికల విషయంలో ఏం చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం అనే విషయాలను ఇసి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మన నిర్ణయాలను ప్రభావితం చేసే అన్ని శక్తులు, ఒత్తిళ్లను ఎదుర్కొనే విధంగా అధికారులు ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజల, ప్రతిపక్షాల విశ్వాసాన్ని గెలుచుకునేలా ఉండాలని ఆయన అన్నారు. ప్రతిపక్షాలతో మాట్లాడితేనే చాలా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. తాను ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో కూడా ప్రతిపక్షాలు తనను కలవడానికి వస్తే తప్పకుండా వారి వాదనలు వినేవాడినని చెప్పారు. ఎన్నికల సమయంలో తీసుకువస్తున్న కొత్త ఓటర్ల జాబితాలో కూడా ఎటువంటి తప్పులు లేవని మీరు అఫిడవిట్ ఇవ్వగలరా అని ఎన్నికల కమిషన్‌ను ఖురేషీ ప్రశ్నించారు. ఒకవేళ అందులో తప్పులు ఉన్నాయని తేలితే ఎన్నికల అధికారులు సైతం శిక్ష అనుభవించాల్సి వస్తుందని..దానికి మీరు సిద్ధమేనా అని ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఖురేషీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ.. రాజకీయ పార్టీలతో తాము క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని..ఇంత నిర్మాణాత్మక పద్ధతిలో మరెక్కడా సమావేశాలు జరగవని పేర్కొంది.

## జపాన్ రికార్డు (మొదటి పేజీ తరువాయి)

వంద సంవత్సరాలు వయసుదాటినవారి సంఖ్య కేవలం 1000 మాత్రమే ఉండగా, 1998 నాటికి ఈ సంఖ్య 10,000 దాటిపోయింది. సుదీర్ఘకాలం జీవించే ప్రజలసంఖ్య జపాన్‌లో చాలా ఎక్కువ. ఐతే కొన్ని అధ్యయనాలు ఈ వాదనతో విభేదిస్తున్నాయి. జపాన్ ప్రజలు ఆహార నియమాలు పాటించడంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారు. అక్కడ జీవన విలువలు, జీవన కాలం ఎక్కువగా ఉండగా, జననాలసంఖ్య నానాటికీ గణనీయంగా పడిపోతున్నది. జపాన్‌లో 114 ఏళ్ళు వయసుగల షిగెకో కగవాను అత్యంత వృద్ధురాలైన ఆరోగ్యవంతురాలైన మహిళగా గుర్తించారు. ఆమె నారా సిటీ శివారు ప్రాంతంలోని యమటోరియామా ప్రాంతంలో నివసిస్తున్నారు. కోస్తా నగరం ఇతవాలోని 111 ఏళ్ళు వయసుగల కియోటక ముజినోను అందరికంటే వృద్ధుడుగా గుర్తించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు : సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంజనీరింగ్ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు అందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్లు తమ వంతు పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఇంజనీర్లరందరికీ ముఖ్యమంత్రి 'ఇంజనీర్స్ డే' సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న, మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన 'సెప్టెంబర్ 15ను' పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామని సిఎం గుర్తు చేసుకున్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరుగా, దార్శనికుడిగా, విద్యాప్రదాతగా, నిపుణునిగా, పారిశ్రామిక ప్రగతి చోదకునిగా ప్రత్యేకతను చాటారని అన్నారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాలలో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. మూసీ వరదల నుంచి హైదరాబాద్ నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు, ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

# అధికారం లేకున్నా ప్రజల కోసం పోరాడేది వామపక్షాలే



### కమ్యూనిస్టు అమరుల త్యాగఫలితమే నేటి తెలంగాణ
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** అధికారం లేకున్నా పేదల పక్షాన నిలబడి పోరాటం చేసేది కమ్యూనిస్టులే అని కొత్తగూడెం ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ దివంగత నేత కుమ్మరి భీమయ్య 21 వర్ధంతిలో సభలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటి స్వాతంత్రోద్యమం నుండి నేటి కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ పేదల పక్షాన నిలబడుతున్న పార్టీ సిపిఐ చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం నిరంతరంగా, నిస్వార్థంగా కృషి చేస్తున్న తమ పార్టీపై ప్రజల్లో అభిమానం తగ్గలేదన్నారు. జాతి వైరుధ్యంలో భావాలున్నప్పటికీ మనుసుల్లో ఉన్న మానవత్వమే నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని గుర్తు చేశారు. ప్రజల్లో ఓ విప్లవం సృష్టించాలంటే ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని, వారిలో ప్రేరణ కలిగించే వ్యక్తిత్వం కలిగి ఉండాలని అన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలను ఉత్తేజితులను చేసిన రావి నారాయణ రెడ్డి, బద్దం బాల్‌రెడ్డి, ఎఐటియుసి నాయకులు మక్దూం మోహినొద్దిన్ లాంటి మహనీయుల పిలుపుతో వేలాదిమంది సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. సెప్టెంబర్ 11న మూడు వందల మంది రైతులు ప్రాణాలు విడిచిన ఆ సంఘటనతో నిజాం రాజు తన సామ్రాజ్యాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన సందర్భంగా అప్పటి నుండి సాయుధ రైతాంగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలున్నంత వరకు కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. మిగతా పార్టీల లాగా మెరుపు తీగ లాగ వచ్చి కనుమరుగు అయ్యే పార్టీ సిపిఐ కాదన్నారు. ఈ క్రమంలో రైతాంగ పోరాటంలో కుమ్మరి భూమయ్య పాల్గొనక పోయినప్పటికీ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో జగదేవ్‌పూర్ మండలంలో సిపిఐ పార్టీని బలోపేతం చేయడంతో పాటు నాలుగు దశాబ్దాల కాలంగా గ్రామ ప్రథమ పౌరుడుగా ఉన్నత వర్గాలను ఎదిరించి నిలబడిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాల కోసం నేటితరం యువకులు పేదల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. అలాగే కమ్యూనిస్టు బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమావేశానికి ముందు భీమయ్య స్మారక స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానందరెడ్డి, రిటైర్డ్ జడ్జీ జయ సూర్య, సిపిఐ పార్టీ నాయకులు, అభిమానులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులే

### సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ అజీజ్ పాషా

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ చౌరస్తాలో డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులే అని నొక్కి చెప్పారు. నిజాం క్రూరత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో రజాకార్ల గుండెల్లో దడ పుట్టించింది కమ్యూనిస్టు పార్టీ అని ఆయన గుర్తు చేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు రవీంద్ర చారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలోనూ సాయుధ పోరాటంలోనూ ఏమాత్రం పాత్రలేని మతోన్మాదులు విమోచన దినోత్సవం అని ప్రగల్బాలు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. నిజాంకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడి ప్రాణాలు అర్పించిన కమ్యూనిస్టు యోధులను అమరవీరులను విస్మరిస్తూ మతోన్మాద పార్టీలు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహించారు. ఈ సందర్భంగా ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలు తెలిసేలా సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. మన్సూరాబాద్ డివిజన్ కార్యదర్శి మాట్లాడుతూ కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాన్ని నేటితరంవిద్యార్థులకు తెలియజేయాలని తెలంగాణ సాయిధ పోరాటం ద్వారా 3000 గ్రామాలకు విముక్తి కలిగించి పది లక్షల ఎకరాలను పేదలకు పంచిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, ఏఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్, ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హయత్ నగర్ మండల సహాయ కార్యదర్శిలు మర్రి శోభన్, కర్నే సుజాత, ఎఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు శాఖ కార్యదర్శులు, సరిత, గూని శోభ, అరుణ్, పారిజాత, అర్.సౌజన్య, శ్రీను, యమునా, పి.అనితతో పాటు ప్రజానాట్య మండలి నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, శాఖ కార్యదర్శిలు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిఓ 1195ను సవరించాలి




### ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాల పెరుగుదల తరుగుదలను ప్రభావితం చేసే జిఓ నెంబర్ 1195ను వెంటనే సవరించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఆదివారం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న డిపిఎం యూనిట్ ఉద్యోగుల సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసింహ మాట్లాడుతూ ఉద్యోగులతో కనీసం సంప్రదించకుండా జిఓ నెంబర్ 1195ను ఏ విధంగా తెస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 1195లో ప్రభుత్వం వివరించిన జీతభత్యాల గణాంకాలు చూస్తే అవి కేవలం బేసిక్ పే గానే పరిగణించాల్సి వస్తుందన్నారు. 18 సంవత్సరాల నుండి 8 సంవత్సరాల వరకు అనుభవం ఉన్న ఉద్యోగుల అనుభవాన్ని కూడా లెక్క వేయాల్సి ఉందన్నారు. అనుభవాన్ని పరిగణలోకి తీసుకోకుండా వేతనాలను ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. జీవో నెంబర్ 1195లో నిర్ణయించిన జీతాలకు సంబంధించి ఎఐటియూసిగా ఎవరి జీతాన్ని తగ్గించాలని తాము అడగడం లేదని కానీ ప్రభుత్వం తగ్గించిన జీతాల విషయంపై త్వరలో పోరాటం చేయనున్నామన్నారు. చాలా క్యాడర్లకు బేసిక్ పేను కూడా తగ్గించారని, కొందరికి రూ.3 వేల నుండి రూ. 30 వేల వరకు జీతం తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా పనిచేస్తున్న ఉద్యోగులకు అనుభవాన్ని బట్టి జీతాన్ని పెంచుతారని, కానీ తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ నందు పనిచేస్తున్న డిపిఎంయు ఉద్యోగులకు మాత్రం జీతాలు తగ్గించారని ఆయన ఆందోళన చెందారు. తక్షణమే ఈ జిఓను సవరించాలని, లేకపోతే ఎఐటియుసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డిపిఓలు, డిఎఎంలు, డిడిఎంలు, డి క్యూఎఎంలు, విసిసిఎంలు, అకౌంటెంట్స్, సైకాలజిస్ట్లు , డీఈవోలు, సోషల్ వర్కర్లు, డీసీఎంలు, డిపిపిఎంలు, టిబిహెచ్‌వి ఉద్యోగులు, ఫ్యామిలీ ప్లానింగ్ కౌన్సిలర్లు, మెకానికులతో పాటు సపోర్టింగ్ ఇంజనీరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :**

తెలంగాణ రాష్ట్ర డిపిఎం యూనిట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సమితిని ఎన్నుకుంది. డిపిఎం యూనిట్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉప్పునూరు సిద్ధార్థ, ప్రధాన కార్యదర్శిగాతండా నరసింహులు ఎన్నికైయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎండి రుక్మొద్దీన్, ఉపాధ్యక్షులుగా చెన్నూరి ఉమా మహేశ్వరి, తరుకొండ సాగర్, సహాయ కార్యదర్శులుగా మామిడి సైదులు, ఇటికాల పరశురాం, నామా రఘురాం, సకర్ప శ్రీకాంత్, కోశాధికారిగా చలువ గాని నాగరాజులతో పాటు మరో 21 మందిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకుంది.

# 17 నుంచి 'పోషణ మాసం'

### చిన్నారులు, మహిళల్లో పోషకాహారం పట్ల చైతన్యం
### విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు మంత్రి సీతక్క లేఖలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు 'తెలంగాణ పోషణ మాసం' మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. చిన్నారులు, మహిళల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికీ పోషణ సందేశం చేరవేసేందుకు కార్యచరణను సిద్ధం చేసింది. పోషణ మాసం మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క లేఖలు రాశారు. ప్రతి ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రోత్సాహించాలన్నారు. కుటుంబ ఆరోగ్యానికి పోషకాహారం మొదటి అడుగు అని, ప్రతి ఇంట్లో పోషణపై చైతన్యం కల్పించడమే ఈ మాసం ప్రధాన ఉద్దేశమని మంత్రి సీతక్క రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతి ఐసిడిఎస్ ప్రాజెక్టుకు రూ.30వేలు, ప్రతి జిల్లాకు రూ.50వేల నిధులను విడుదల చేశామన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోషణపై చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు, ఆరోగ్య పరీక్షల క్యాంపులు నిర్వహించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించేందుకు, అలాగే చక్కెర, ఉప్పు, నూనె వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోషణ మిషన్‌లో పురుషుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా కుటుంబాల్లో పోషకాహారంపై సమగ్ర అవగాహన కలిగించాలన్నదే ఈ కార్యక్ర మ ఉద్దేశమని సీతక్క తెలిపారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో గ్రామీణ స్థాయిలో ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించి, ఆత్మ నిర్భరతను పెంచే కార్యక్రమాలు కూడా ఇందులో భాగంగా నిర్వహించనున్నామన్నారు. టెక్నాలజీ వినియోగంతో గ్రామస్థాయిలోనూ పోషణ డేటాను సేకరించి, వాటిపై క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలంతా చురుకైన పాత్ర వహించాలని విజ్ఞప్తి చేశారు. పోషిత, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో 'పోషణ మాసం' కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.

# బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే నాలుగు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరించారని ఆరోపించారు. ఈ నాలుగు బొగ్గు బ్లాకులను కాపాడేందుకు కెసిఆర్, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ప్రయత్నించిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకుడు పుట్టమధు, టిజిబికెఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కలిసి బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొన్నారని, సింగరేణి సంస్థను కాపాడాలనే చిత్తశుద్ధి ఆ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్ సింగరేణికి ఏం చేయలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. సింగరేణి సంస్థలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ఎంఎల్‌ఎల ఆధిపత్యం పెరిగిందని ఆరోపించారు. సింగరేణి సిఎండి కాంగ్రెస్ చెప్పుచేతల్లో పని చేస్తున్నారని, ఆ సంస్థ మనుగడ ప్రమాదంలో పడిందని ఆరోపించారు. సింగరేణి మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం, గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘం సింగరేణి కార్మికుల్లో భరోసా నింపాలని, నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు అప్పగించాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. టిజిబికెఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలకు అనుగుణంగా కొప్పుల ఈశ్వర్‌ను తమ సంఘానికి గౌరవాధ్యక్షునిగా ఎన్నుకున్నామని, అంతకుముందు అనేకమంది తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి గౌరవాధ్యక్షులుగా పని చేశారని అన్నారు.

# 'ఎస్‌ఎల్‌బిసి' కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించరా?

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్‌ఎల్‌బిసి) సొరంగం కూలి, ఎనిమిది మంది కార్మికులు చనిపోయి రెండు వందల రోజులు దాటినప్పటికీ, ఆరు మృతదేహాలను ఇప్పటికీ వెలికి తీయలేదని, బాధిత కుటుంబాలకు ఎటువంటి పరిహారాన్ని చెల్లించలేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యలకే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపించి, హంగామా సృష్టించిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఎస్‌ఎల్‌బిసి ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఎందుకు ఒక్క బృందాన్ని కూడా పంపించలేదని కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి బడే భాయ్ ఎందుకు తెలంగాణలోని కాంగ్రెస్ చోటే భాయ్‌ని కాపాడుతున్నారని, ఇది ఎలాంటి అపవిత్ర బంధం?' అని కెటిఆర్ అన్నారు. బిఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే ఆ ఆరు కుటుంబాలకు న్యాయం చేస్తామని, ప్రాణాలను బలిగొన్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగం కూలిపోవడానికి గల కారణాలకు తాము సమాధానాలు రాబడతామన్నారు.

## అధికార భాషగా హిందీ..
# దేశ సమగ్రతకు గట్టి పునాది




### హిందీ దివాస్ కార్యక్రమంలో పలువురు వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికార భాషగా హిందీ ఈదేశ సమగ్రతకు బలమైన పునాదిగా నిలిచిందని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధరక్ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్, తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హిందీ దివాస్ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ ఛైర్మన్ రాజేశ్ కుమార్ అగర్వాల్, తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎన్‌ఎస్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, గౌరవ అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారు హార్కర్ వేణుగోపాల్ రావు, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, రాష్ట్ర ప్రణాళిక కమిషన్ చైర్మన్ డాక్టర్ చిన్నా రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతు రావు, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, తాహెర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కొందరూ తమ స్వార్థ రాజకీయాల కోసం కులాలు, మతాల పేరిట ఈ దేశాన్ని విచ్ఛినం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాజకీయాలు అనేది పదవుల కోసం మాత్రమే అసరమని, కానీ కొందరూ ఒక్కసారి గద్దెనెక్కిన తమ పదవులను కాపాడుకోవడానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇది దేశ భవిష్యత్‌కు మంచిది కాదు అని పేర్కొన్నారు.1949లో భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికార భాషగా ప్రకటించిందని గుర్తు చేశారు. గ్లోబలైజేషన్ ప్రభావంతో ఇంగ్లీష్ ప్రాధాన్యం పెరిగినా, హిందీ తన స్థానాన్ని కోల్పోలేదని పేర్కొన్నారు. తెలంగాణ లౌకికవాదానికి పెట్టింది పేరని.. ఇక్కడ భాష, ప్రాంతం అన్న భేదమే లేదని, అందరూ కలిసి మెలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భాషాలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులమన్నారు. పరస్పరం గౌరవించుకుంటు కలిసి మెలిసి జీవించాలని, మార్వాడీలపై దాడులు సరికాదని ఆయన పేర్కొన్నారు. హార్కర్ వేణుగోపాల్ రావు, విశ్వనాథన్, వి.హనుమంతరావు, చిన్నారెడ్డిలు మాట్లాడుతూ భాషలు, మాండలికాలకు వారధి హిందీ భాషే నని అన్నారు. అనేక భాషాలకు నిలయమైన మన దేశంలో అత్యధిక జనాభా మాట్లాడేది హిందీభాషా కావడంతోనే ఆనాడే దేశ అధికారిక భాషగా గుర్తించబడిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్ ఈకార్యక్రమంలో ప్రదిప్ సురానా, లక్ష్మి నారాయణ రాఠీ, సిఎ మురళి మనోహర్ పలోడ్, బీమ్ అగర్వాల్, మహావీర్ అగర్వాల్, మధు సూదన్ సన్ తూలియా, సురేశ్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

**పలువురికి అవార్డులు :**

హిందీ దివాస్ సందర్భంగా పలువురికి అవార్డులను ప్రధానం చేశారు. హిందీ మిలాప్ ఎడిటర్ వినయ్ వీర్ అవార్డును కవి, జర్నలిస్టు అర్వింద్ యాదవ్‌కు ప్రధానం చేశారు.అదేవిధంగా సీనియర్ జర్నలిస్టు సదాశివ శర్మ అవార్డును మిడ్‌నైట్ రిపోర్టర్ డాక్టర్ చైతన్యసింగ్‌కు, విద్యారణ్య హరి బెలికే అవార్డును హిందీ కవి మీనా లలిత్ ముతాకు అందజేశారు.

## ప్రైవేట్ కళాశాలల బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15 నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలు చేస్తున్న నిరవధిక బంద్‌కి ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు తెలిపారు. ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదలపై నిర్లక్ష్యం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందన్న అనుమానం కల్గుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి 21 నెలలు గడుస్తున్న ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలనివారు డిమాండ్ చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఫీజు బకాయిల విడుదల చేయకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు అప్పులు చేసి మరి ఫీజులు కట్టే పరిస్థితి వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలకు, మంత్రులు హెలికాప్టర్లో తిరగడానికి, పక్క రాష్ట్రాల్లో పత్రిక ప్రకటనలు ఇవ్వడానికి ఉన్న నిధులు విద్యార్థుల ఉన్నత చదువులకు ఆసరాగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధులు ఇవ్వకుండా నేడు కళాశాలలు బంద్ చేసే పరిస్థితి ప్రభుత్వమే తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కళాశాలల యాజమాన్యాలతో చర్చ లు జరిపి బంద్ విరమింపజేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిపుల బకాయిలు విడుదల చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# బకాయిలను చెల్లించాలి

### బిసిహక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాం లోనూ, ప్రస్తుత ప్రభుత్వ హయాం లోనూ కోట్లాది రూపాయల ఫీజులు కాలేజీలకు ప్రభుత్వం బకాయి పడటం వల్ల అటు యాజమాన్యాలు ఇటు విద్యార్థిని విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 4 ఏళ్లుగా సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో కాలేజీలు మూతపడే పరిస్థితి నెలకొన్నదన్నారు. ఇదే జరిగితే బోధన రుసుం, స్కాలర్‌షిపుల పెండింగ్ కారణంగా సుమారు 15 లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమైయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఈనెల 15 నుంచి రాష్ట్రంలో అన్ని ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్యా కాలేజీలు 17 నుంచి డిగ్రీ ఇంజనీరింగ్ కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించారని ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. తెలంగాణలో నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఫీజులను మాత్రం విడుదల చేయకుండా అన్యాయం చేశారని దీంతో నిరుపేద కులాలైన బిసిలు చదువు దూరమైతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిగా కూడా కొనసాగుతున్న సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే ఫీజు బకాయి విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కళాశాల యాజమాన్యాలకు సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# తక్షణమే విడుదల చేయాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందిచకపోతే విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ' పోరుబాట' అంటూ పిడిఎస్‌యు రూపొందించిన పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో హరీష్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ఫీజురియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొద్దునిద్రను నటించడం సిగ్గుచేటని అన్నారు. ఫ్యూచర్ సిటీకి రూ.20వేల కోట్ల టెండర్లు, ఒక వైపు కాళేశ్వరం కూలిందంటూనే మల్లన్న సాగర్ నుంచి మూసిలో గోదావరి నీళ్లు పోసేందుకు రూ .7వేల కోట్ల టెండర్లు, జిహెచ్‌ఎంసిలో హై లెవెల్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు నిర్మించేందుకు మరో రూ.7వేల కోట్ల టెండర్లు, ఫ్యూచర్ సిటీలో ఆరు లైన్ల రోడ్డు కోసం రూ.5 వేల కోట్ల టెండర్లు, హెచ్‌ఎండిఎలో రూ.10,000 కోట్ల టెండర్లు, ఆర్ అండ్ బిలో రూ.16 వేల కోట్ల టెండర్లు, రూ.25 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు, ఇలా మొత్తంగా రెండున్నర లక్షల కోట్ల రూపాయలకు టెండర్లు ఆహ్వానిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ లేదా?, విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పట్ల ఆలోచన లేదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## 372 మందికి కంటిచూపు



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కృష్ణమాచారి వదిన గోదాదేవి(84)ఆదివారం మృతి చెందారు. అదేవిధంగా విటి కాలనీ ప్రాంతానికి చెందిన మురారి శెట్టి అనసూర్యమ్మ మరణించారు ఆమె నేత్రాలను సేకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమాచారి మాట్లాడుతూ సమాజంలో కార్నియల్ అందత్వంతో బాధపడుతున్న వారు లక్షలలో ఉన్నారని కానీ నేత్రదానాలు చేయించే వారి సంఖ్య తక్కువ సంఖ్యలో ఉన్నదని తెలిపారు. ఇప్పటివరకు 6 పార్థివ దేహదానాలను 186 నేత్ర దానాల ద్వారా 372 కార్నియా అను కంటిపొరలను సేకరించి, 372 మంది కార్నియా అంధులకు కంటిచూపును అందించగలిగామని తెలిపారు.

## భువనగిరి పట్టణంలో చాలా సమస్యలు పరిష్కరించాం



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి పట్టణంలో చాలా సమస్యలు పరిష్కరించడం జరిగిందని గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఆవేస్ చిస్తీ, పొత్నాక్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ మాజీ చెర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్ అన్నారు. భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఇప్పటివరకు సుమారు పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ చేయలేని పనులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేసి చూపిస్తున్నట్లు వారు చెప్పారు. జగదేవ్పూర్ చౌరస్తా రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, వెంకటేష్, బెండ శ్రీకాంత్, గుర్రాల శ్రీను, పిట్టల బాలరాజు, ప్రకాష్ సాయి పాల్గొన్నారు.




## సంస్మరణ సభ జయప్రదం చేయండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కోదాడ పట్టణంలోని కాశీనాథం ఫంక్షన్ హాల్లో ఈనెల 16న నిర్వహించనున్న సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంతాపసభకు పార్టీశ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయం ధర్మబిక్షం భవన్లో నిర్వహించిన కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి, యువజన రైతు కార్మిక పౌర హక్కుల నాయకుడిగా ఎన్నో బాధ్యతలు జాతీయ స్థాయిలో నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభకు అధిక సంఖ్యలో పాల్గొనలని కోరారు. ఈ సంతాప సభకు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు పెంద్ర కృష్ణ, నాయకులు వాడపల్లి వెంకన్న, గురుస్వామి పాల్గొన్నారు.

## డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ బుద్ధవనం సందర్శన



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ లోని బుద్ధ వనాన్ని ఆదివారము తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సంజయ్ కామినేని సందర్శించారు. ముందుగా ఆయన నాగార్జునసాగర్ ప్రధాన డ్యామును, ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్తూప వనాలను సందర్శించి మహాస్థూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే వీడియోని వీక్షించారు. అనంతరం మహాస్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు. బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర వీరిని బుద్ధ వనం కండువాలతో సత్కరించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలను, చారిత్రక వివరాలను తెలియజేశారు. వీరితోపాటు సీనియర్ ఆడిట్ ఆఫీసర్ బ్రీజేష్ కుమార్, నాగార్జునసాగర్ డ్యాం డివిజన్ కార్యాలయ సూపరిండెంట్ దుర్గాప్రసాద్, ఎస్పిఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉన్నత స్థానాలకు ఎదగాలి




ప్రజాపక్షం/ నలగొండ టౌన్: విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందాలని నల్లగొండ డిఎస్పి కొలను శివరాంరెడ్డి సూచించారు. పట్టణంలోని ఎన్ ఆర్ఎస్ గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన ఫ్రషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పోరాటం చేస్తేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఇంటర్మీడియట్ దశ జీవితాలను మార్చివేస్తుందని ఆలోచనను గమనించి విద్యార్థులు కష్టపడాలని అన్నారు. ఈ దశలో వేసే అడిగు రేపు భవిష్యత్తుకు పునాది అవుతుందని సమాజానికి మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వివిధ విభాగాలలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల,పాఠశాల జోనల్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ సతీష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ మనోజ్ రెడ్డి, ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపల్ రూప, డీన్ కిషోర్ పాల్గొన్నారు.

## సనాతన ధర్మం ప్రపంచ దేశాలకు ఆదర్శం

### మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సనాతన ధర్మం ప్రపంచ దేశాలకు ఆదర్శమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వన్షన్ హాల్లో సనాతన ధర్మ పరిరక్షణ ఆలయన్స్ కమిటి ఆధ్వర్యంలో దేవాదాయ ధర్మాదాయ అధ్యాత్మిక సంఘాల ఐక్యత, స్వామీజీలు, పీఠాధిపతులు, గురూజీలతో సనాతన ధర్మంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నో ఏండ్లుగా సనాతన ధర్మం విరాజిల్లుతుందని కొనియాడారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన వివిధ స్వామిజీలు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాషాయానికి విలువ పెరుగుతుందన్నారు. మహాకుంభమేళాలో 15 కోట్ల మంది హిందువులు పాల్గొన్నారని గుర్తు చేశారు. హిందువులలో ఉన్న అనైక్యత కారణంగా సనాతన ధర్మం సన్నగిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ బీరెల్లి చంద్రారెడ్డి, మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు, సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: బాల్య వివాహాలను అరికట్టడం మనందరి బాధ్యత అని అశ్రీత సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎం. శోభారాణి అన్నారు.జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో అశ్రీత సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలన కొరకు ప్రపంచ సమాఖ్య చేపటిన కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ హనుమాన్ టెంపుల్, హైదరాబాద్ రోడ్ లోని మసీద్,ఆర్టిసి కాలనిలోని చర్చిలలో,మత పెద్దలతో సంతకాల సేకరణ,ప్రతిజ్ఞ చేయించారు.బాల్య వివాహాలు వల్ల వచ్చే నస్టాల గురించి వారి సందేశాలు తీసుకోవడం వారి సమావేశాలలో దీనిపై అవగాహన కల్పించాలని అక్కడ వచ్చిన భక్తులకు సూచించారు. సంస్థ కార్యకర్తలు బందారు రమేష్, ధనమ్మ, ఝాన్సీ, కవిత, చిన్నరాయుడు, జెరిపోతుల యాదయ్య, వివిధ ఆలయాల అర్చకులు, చర్చి ఫాదర్స్ పాల్గొన్నారు.

## సాయుధ పోరాటం గురించి మాట్లాడే హక్కు బిజెపికి, ఆర్ఎస్ఎస్‌కు లేదు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి



ప్రజాపక్షం/చింతపల్లి : నైజాంను తరిమికొట్టి, ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని, సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి, ఆర్ఎస్‌స్‌కు లేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని ఘడియగౌరారం గ్రామంలో సాయుధ పోరాట యోధులు, దేవరకొండ తాలుక కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతలలో ఒకరయిన మాజీ ఎంఎల్ఏ ఉజ్జిని నారాయణరావు స్మారక స్థూపానికి ఆ పార్టీ శ్రేణులు ఆదివారం పూల మాలలు వేసి, నివాళులు అర్పించి, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా నరసింహారెడ్డి, మునుగోడు మాజీ ఎంఎల్ఏ ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ సాయుధ పోరాటాన్ని హిందు, ముస్లింల మధ్య జరిగిన సంఘర్షణగా చిత్రీకరించి, వక్రీకరించి సాయుధ పోరాటాన్ని హైజాక్ చేయడానికి బిజెపి కుట్ర పన్నుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూస్వాములు అరచకాలు, ఆగడాలు సహించలేని సాధారణ ప్రజలు ఆయుధాలు చేతబట్టి భూస్వాముల మెడలువంచి వేల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టులు నేలకొరిగారన్నారు. ఇంతటిసాహసం, అమరత్వంతో కూడిన సాయుధ పోరాట చరిత్రను బిజెపి హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించి భవిష్యత్తు తరాలకు తప్పుడు చరిత్రను అందిస్తే తెలంగాణ ప్రజలు సహించరని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం నిరంకుశ అంతం కోసం సాగిన సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎవడి మైనొద్దిన్, పలు మండలాల కార్యదర్శులు బొడ్డుపల్లి వెంకటరమణ, పోలె వెంకటయ్య, దేప సుదర్శన్‌రెడ్డి, శ్రీరామదాసు కనకాచారి, ఉప్పునుంతల వెంకటయ్య, బొల్లె శైలేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి, బిఆర్ఎస్‌నాయకుడు, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, శ్రీరాములు, శ్రీశైలం, లక్ష్మయ్య, శంషొద్దిన్, బుచ్చయ్య, నర్సింహ్మ, వెంకటయ్య పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడితేనే రాజకీయ నాయకుడిగా గుర్తింపు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/మునుగోడు: కమ్యూనిస్టులు నిరంతరం పేద ప్రజల పక్షాన ఉంటు పోరాడితేనే నాయకుడిగా గుర్తింపు లభిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం కార్యకర్తలకు సూచించారు. 77వ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొరటికల్ గ్రామంలో అమరులైన మునుగోటి అంజయ్య,మిర్యాల లింగయ్య స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ గ్రామ సిపిఐ నాయకులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలోఎంఎల్‌సి నెల్లికంటి సత్యంకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంలో కొరటికల్ గ్రామం నుండి కమ్యూనిస్టు నాయకులు పాల్గొనడం గొప్ప విషయమని కొనియాడారు. గ్రామ అభివృద్ధి కోసం, పార్టీ కార్యకర్తల కోసం నిరంతరం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. అనంతరం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం,బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులు సిరిగి చలపతి,మండల సహాయ కార్యదర్శి మందుల పాండు, ఈదులకంటి కైలాస్,వనం వెంకన్న,ఉప్పునూతల రమేష్, మునుగోటి దయాకర్, తిరుమల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నుంచి సిపిఐలో చేరిక :** మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దండు యాదయ్యతోపాటు మరి కొంత మంది నాయకులు సిపిఐ కి ఆకర్షితులై సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం సమక్షంలో ఆదివారం పార్టీలోచేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎంఎల్‌సి సత్యం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొరటికల్ గ్రామ సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాంలో భాగస్వాములు కావాలని సందర్భంగా కోరారు.

## రైతుల యూరియాను పక్కదారి పట్టించిన ఎమ్మెల్యే గన్‌మెన్

### రాజకీయ పలుకుబడితో యూరియా లారీ దారి మళ్లింపు : రైతుల ఆగ్రహం

### గన్‌మెన్‌పై విచారణకు ఎస్‌పి ఆదేశాలు

ప్రజాపక్షం/మిర్యాలగూడ: యూరియ మార్కెట్లో అందుబాటులో లేదని, రెండు బస్తాల కోసం రోజుల తరబడి రోజులు వేచి చూ డాల్సిన పరిస్థితులతో నానా అవస్థలు పడుతుంటే అధికార పార్టీ అండదండలతో కొందరు లారీ లారీలకే మళ్లించుకుంటున్నారని రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గన్ మెన్ అయిన వారి కో సం ఆదమరిచి రైతుల కోసం వచ్చిన యూరియా లారీని దారి మళ్లించి నెత్తి నొప్పి తెచ్చి పెట్టుకున్నాడు. రైతుల కోసం కేటాయించిన లారీ లోడ్ యూరియాను దారి మళ్లించి న వ్యవహారం ఆలస్యంగా వెలుగు లోకి రావడంతో పోలీసు ఉన్నతాధి కారులు చర్యలకు ఉపక్రమించారు.విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాల గూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వ్యక్తిగత సహాయకుని అవతారమె త్తిన గన్‌మెన్ నాగు నాయక్ వ్య వసాయ అధికారులకు అప్పటికప్పుడు ఫోన్ చేసి యూరియా లా రీని మూడో కంటికి తెలవకుండా దారి మళ్ళించాడు.ప్రస్తుతం మార్కెట్లో యూరియా డి మాండ్ మేరకు నెలకొంటున్న ఆం దోళన సమస్యల మధ్య కొద్ది రోజు ల తర్వాత ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి యూరియాపై ఆరా కోసం అధి కారులకు ఫోన్ చేయడంతో అసలు విషయంతో పాటు గన్‌మెన్ నాగు నాయక్ తతంగం మొత్తం బహిర్గతమైంది.

**గన్‌మెన్‌పై విచారణకు ఎస్‌పి ఆదేశాలు :** మిర్యాలగూడ ఎమ్మెల్యే బస్సుల ల క్ష్మారెడ్డి గన్ మెన్ నాగు నాయక్ వ్యవహారంపై నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సీరియస్ గా తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోం ది. ఈ మేరకు ఇప్పటికే విచారణకు ఆదేశాలు జారీ చేశారు కూడా తెలి సింది. విచారణ నివేదిక వచ్చిన వెంటనే కఠిన చర్యలు తప్పకుండా సంకేతాలు ఇప్పటికే పోలీసు అధి కారుల నుంచి వెలువడినట్టు సమా చారం. యూరియా కోసం ముప్పు తిప్పలు పడుతున్న మాకు రావాల్సిన యూరియాను అధికార అజమాయిషి తో దారి అందించడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వేలి బుచ్చుతున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/కోదాడ: రాష్ట్రంలోని పేదలకు పార్టీలకు అతీతంగా సిఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తుందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన 267 చెక్కులు రూ.87.78 లక్షల రూపాయలను లబ్ధిదారులకు అందజేశారు. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీలో క్రీయశీలకంగా సభ్యత్వం తీసుకుని మృతి చెందిన కార్యకర్తలకు ఒకొక్కరికి రెండు లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.

## ఘనంగా దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

### సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా... కేక్ కట్టింగ్‌లు.. అల్పాహారం... అన్నదానాలు.. రోగులకు పండ్ల పంపిణీ... రక్తదాన శిబిరాలు...

ప్రజాపక్షం/సూర్యాపేట : రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు వరుస కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్టింగ్‌లు, అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలతోపాటు రోగులకు బ్రెడ్లు, పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరాలు, దేవాలయాలలో పూజలు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ ప్రియతమ నేతపై ఉన్న అభిమానాన్ని ఆ పార్టీ శ్రేణులు చాటుకున్నారు.

**జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో(రెడ్‌హౌస్)...** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం రెడ్‌హౌస్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆర్‌డిఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు. భారీ కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. దీనికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. బాణాసంచాలు పేల్చి సందడి చేశారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధి ప్రధాత ఆర్‌డిఆర్ అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర రైతు సమన్వయ కమిటి సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) దేవస్థాన చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ పాల్గొన్నారు.

**ఖమ్మం ఎక్స్‌రోడ్డులో...** పట్టణంలోని ఖమ్మం ఎక్స్‌రోడ్డులో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మాద్దుల నవీన్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు. కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను కూడా పంపిణీ చేశారు. బాణాసంచాలు పేల్చారు. తమ అభిమాన నాయకుడు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని వేడుకున్నారు.

**కుడకుడలో...** మున్సిపాలిటి పరిధిలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, నాయకులు తన్వీర్, పంతంగి దశరధ, మాజీ కౌన్సిలర్ పద్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేశారు. దీనికి ముఖ్య అతిధిగా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు.

**దురాజ్‌పల్లిలో...** మున్సిపాలిటి పరిధిలోని దురాజ్‌పల్లిలో నాయకులు చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, మద్దెనబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు. ఆయన చేతులు మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం...** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించారు.

**రేబల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో...** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను సూర్యాపేట డివిజన్ తాపీ పనివారుల సంఘం (ఐఎన్‌టియుసి) అధ్యక్షులు రేబల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ఖాసీంపేటలో...** సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని ఖాసీంపేటలో మాజీ మంత్రి, సూర్యాపేట నియోజక వర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. 4వ వార్డు మాజీ కౌన్సిలర్ లక్ష్మి మకట్‌లాల్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ వేడుకలకు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు.

**ఆత్మకూర్(ఎస్)లో...** ఆత్మకూర్(ఎస్) మండలంలోని శ్రీ దండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నెమ్మికల్‌లోని ఆలయం సమీపంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

**శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో...** పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, చింతమళ్ళ రమేష్, నాగుల వాసు పాల్గొన్నారు.

**బాప్టిస్ట్ చర్చిలో...** పట్టణంలోని బాప్టిస్ట్ చర్చిలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను యువజన నాయకులు బొజ్జ సంజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రభుదాస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు.






















# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఊర్వశి, మిమిచక్రవర్తిలకు ఇడి నోటీసులు

**న్యూఢిల్లీ :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దూకుడు కొనసాగుతున్నది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు నటీనటులను విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తాజాగా బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాతో పాటు బెంగాల్ నటీ, టిఎంసి మాజీ ఎంపి మిమి చక్రవర్తికి నోటీసులు జారీ చేసింది. మిమి చక్రవర్తిని ఈ నెల 15న, ఊర్వశిని ఈ నెల 16న ఢిల్లీలోని కార్యాలయంలో విచారణకు హాజరుకావలని ఆదేశించింది. వీరిద్దరూ ప్రముఖ బెట్టింగ్ యాప్ 1xBetకు ప్రచారం చేసినట్టు భావిస్తున్నారు. ఈ యాప్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ప్రచారంలో తదితర అంశాల్లో వీరిద్దరి పాత్ర ఎంతో తెలుసుకునేందుకు విచారణ అవసరమని ఈడీ విచారణ అవసరమని భావిస్తున్నది. ఇంతకు ముందు ఇదే కేసులో మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, హర్భజన్‌సింగ్, యువరాజ్‌సింగ్, సురేశ్ రైనాలను సైతం ఈడీ విచారించింది. శిఖర్‌ను ఈ నెల 4న ఈడీ ఎనిమిది గంటల పాటు విచారించింది. సోషల్ మీడియా వేదికగా 1xBetకి ప్రచారం చేసినట్లు ఆధారాలు లభించగా.. ఆ దిశగా ప్రచారం చేసినట్లు ఆధారాలు లభించాయని.. ఈ క్రమంలోనే విచారణ నిర్వహించినట్లు సమాచారం.

### దుబాయ్‌లో భారత్ – పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ వేళ...

# భారత్‌లో ప్రతిపక్షాల నిరసనలు

మహారాష్ట్ర, జమ్ములో శివసేన (యుబిటి) ఆధ్వర్యంలో, ఢిల్లీలో ఆప్ నిరసనలు...

దక్షిణాదిన..మోదీ సర్కార్‌పై ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ విమర్శనాస్త్రాలు



**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ మధ్య ఆసియా క్రికెట్ కప్ మ్యాచ్ భారతదేశంలో నిరసన జ్వాలలను రగిలించాయి. దుబాయ్‌లో జరుగనున్న భారత్–పాకిస్థాన్ ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలు ఆదివారం ఢిల్లీ అంతటా నిరసనలు చేపట్టాయి. ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని ప్రజలను కోరుతూ నినాదాలు చేశాయి. శివసేన నాయకత్వంలో మహారాష్ట్ర, జమ్మూలో నిరసనలు వ్యక్తం చేయగా, ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు ఢిల్లీలో నిరసనలు చేపట్టారు. దక్షిణాదిన ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్–ఎ–ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ పహల్గామ్‌లో మరణించిన వారి జీవితాల విలువ కంటే క్రికెట్ మ్యాచ్ ఆడటం ద్వారా సంపాదించే డబ్బే మీకు ఎక్కువా? అని ఆయన బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై మండిపడ్డారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో పర్యాటకులు సహా 26మంది మరణించిన తర్వాత పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను దెబ్బతీసేందుకు భారతదేశం 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిన తర్వాత ఇరు దేశాల వైపునా మిలిటరీ మధ్య సంఘర్షణలు చోటుచేసుకున్నాయి. సాంప్రదాయ ప్రత్యర్థులు భారతదేశం–పాకిస్థాన్ ఆదివారం సాయంత్రం దుబాయ్‌లో ఆసియా క్రికెట్ కప్ మ్యాచ్‌లో తలపడుతున్నాయి. అందుకు భారత ప్రభుత్వం జాతీయ జట్టును అనుమతించింది. భారత ప్రభుత్వం ప్రపంచ కప్పు, ఆసియా కప్ వంటి అంతర్జాతీయ పోటీలలో పాకిస్థాన్‌తో ఆడటానికి జాతీయ జట్టును అనుమతించింది. కానీ క్రీడలలో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని నిషేధించింది. శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ బిజెపిని, బిజెపి సారథ్యంలోని కేంద్రప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధించారు. ఇదేనా ప్రభుత్వంలో ఉన్న పార్టీ జాతీయవాదం, దేశం పట్ల ఉన్న ప్రేమ అని ఎద్దేవా చేశారు. 'దాని (బిజెపి) హిందుత్వ అనేది ఒక పెద్ద ప్రహసనం. గతంలో భారతదేశం ఇటువంటి క్రికెట్ మ్యాచ్‌ల నుండి వైదొలగింది. ఈ మ్యాచ్ బహిష్కరించాలని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే ఇచ్చిన పిలుపు కేవలం మహారాష్ట్రకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది' అని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్‌రౌత్ చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ నిరసనను ప్రస్తావిస్తూ రాజ్యసభ సభ్యుడు మాట్లాడుతూ మ్యాచ్‌ను ప్రదర్శించే రెస్టారెంట్ల పేర్లను బహిరంగంగా ప్రకటిస్తామని, ఆ ఔట్‌లెట్లను బహిష్కరించాలని పిలుపునిచ్చామన్నారు. 'క్రికెట్ మ్యాచ్ చూపించిన రెస్టారెంట్లను బహిరంగంగా ప్రకటిస్తారు. ఈ ట్రెండ్‌ను మహారాష్ట్రలో కూడా అనుసరిస్తారు' అని రౌత్ చెప్పారు. బిజెపి మంత్రి ఆశిష్ షెలార్ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, ఆసియా క్రికెట కౌన్సిల్ (ఎసిసి) అధిపతి మోనఖ్వీ కింద పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. నైతిక కారణాల వల్ల షెలార్ ఎసిసికి రాజీనామా చేసి ఉండాల్సిందన్నారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాకరే బతికి ఉంటే దుబాయ్ మ్యాచ్ కూడా జరిగేది కాదని ఆయన పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌పై నిర్ణయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చీకటిలో తీసుకున్నారని శివసేన (యుబిటి) కార్యదర్శి, ముంబయి క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు మిలింద్ నర్వేకర్ ఎద్దేవా చేశారు. శివసేన(యుబిటి) పుణే, థాణే, మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలలో కూడా నిరసనలు చేపట్టింది. పహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన సంతోష్ జగ్‌దాలే తండ్రి పుణే నివాసి అసవరి జగ్‌దాలే మ్యాచ్‌ను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'ఆడటానికి సిద్ధంగా ఉన్నవారిని, ఆటను నిర్వహించే వారిని, ఈ సాయంత్రం ఉత్సాహంగా నినాదాలు చేసేవారిని చూసి నేను చాలా సిగ్గుపడుతున్నాను, పహల్గామ్ దాడిని, సైనికుల త్యాగాలను, లెక్కలేనన్ని దాడులను మర్చిపోతున్నాను' అని ఆమె అన్నారు. శివసేన(యుబిటి) ఆదివారం కూడా 'మజా కుంకు మజా దేశ్' ప్రచారాన్ని ముంబయిలో నిర్వహించింది. మేం ఈ వస్తువులను(వివాహిత స్త్రీ ఉపయోగించే సిందూర్ మరియు ఇతర వస్తువులు) అధికారిక మార్గాల ద్వారా పోస్ట్ ద్వారా కేవలం ముంబయి నుండి మాత్రమే కాకుండా మహారాష్ట్ర అంతటి నుంచి ప్రధానమంత్రి కార్యాలయానికి పంపిస్తున్నాం అని శివసేన (యుబిటి) నాయకురాలు, మాజీ ముంబయి మేయర్ కిషోరి పెడ్నేకర్ విలేకరులకు చెప్పారు. మా సోదరీమణుల భర్తల మరణాలకు సంబంధించిన బాధ్యులను (పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ) తప్పకుండా పట్టుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరింది. పెడ్నేకర్ ఆమె పార్టీకి చెందిన దక్షిణ ముంబయ్ ఎంపి అర్వింద్ సావంత్ నాయకత్వంలో సెంట్రల్ ముంబయిలోని కర్రీ రోడ్‌లో ఒక నిరసన ప్రదర్శన చేపట్టారు. కాండివలిలో శివసేన పార్టీ కార్యకర్తలు ఒక టెలివిజన్ సెట్‌ను రోడ్డుపై ధ్వంసం చేశారు. ఈరోజు కూడా మ్యాచ్‌ను బహిష్కరించినట్లు శివసేన (యుబిటి) ఎమ్మెల్యే ఆదిత్య థాకరే చెప్పారు.

## ఆనకట్టల్లో పూడికతో నీటి నిల్వలు, వరద నియంత్రణపై ప్రభావం



న్యూఢిల్లీ : దేశంలోని చాలా ఆనకట్టలు తీవ్రమైన పూడికను ఎదుర్కొంటున్నాయి. దీంతో వరద నియంత్రణ, నీటి నిల్వలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఇఆర్) చేసిన కొత్త అధ్యయనంలో వెల్లడైంది. హిమాలయ, గంగా–సింధూ నదులు అత్యంత దుర్బలమైనవిగా మారాయని, వాటిపై తక్షణ శ్రద్ధ అవసరం అని సూచించింది. భారతదేశంలో జలాశయాల అవక్షేపణపై సంకలనం నుండి ఇటీవలి సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలోని గణాంకాలను విశ్లేషించింది. చాలా ఆనకట్టలు వాటి మొత్తం జలాశయ సామర్థ్యంలో 50 శాతం కంటే ఎక్కువ కోల్పోయాయని కనుగొంది. 2050 నాటికి తూర్పున ప్రవహించే నదులలో 10, పశ్చిమాన ప్రవహించే నదులలో 7 జలాశయాలు వాటి పూర్తి సామర్థ్యంలో 50 శాతం నిల్వలను కోల్పోతాయని అంచనా వేసింది. ఇది నీటి భద్రతకు తీవ్ర ముప్పును కలిగిస్తుందని 'స్టోకాస్టిక్ ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ అండ్ రిస్క్ అసెస్‌మెంట్' జర్నల్‌లో ప్రచురించబడిన భారతదేశంలోని పెద్ద జలాశయాల అవక్షేపణ–ప్రేరిత దుర్బలత్వాలు అనే అధ్యయనం పేర్కొంది. భోపాల్‌లోని ఐఐఎస్ఇఆర్ నుండి పరిశోధకులు ఉమా మాధురి మొగిలి, సోమిల్ స్వర్ణంకర్ హిమాలయ, గంగా–సింధూతో సహా ఏడు ప్రాంతాలలో దాదాపు 370 పెద్ద జలాశయాలను 100 మిలియన్ క్యూబిక్ మీటర్లకుపైగా సామర్థ్యాన్ని పరిశీలించారు. విశ్లేషించబడిన జలాశయాలలో ఎక్కువ భాగం 1939–1991 మధ్య పని ప్రారంభించినట్లు కనుగొన్నారు. గోదావరి దాటి తూర్పు వైపు ప్రవహించే నదులు దాదాపు 160 జలాశయాలను కలిగి ఉన్నాయి. ఇవి దక్షిణ భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక నీటి అవసరాలను తీర్చడంలో కీలకమైన జోన్ అని పరిశోధకులు పేర్కొన్నారు. అయితే, నర్మదా వరకు పశ్చిమ వైపు ప్రవహించే నదులలో తక్కువ అని, అయితే పెద్ద జలాశయాలు ఉన్నాయని గుర్తించారు. పరిశోధన ప్రకారం, హిమాలయ, గాంగా–సింధూ నదుల్లోని అనేక జలాశయాలు అధిక లేదా అత్యంత దుర్బలత్వం మారినట్లు వివరించారు. వీటిపై తక్షణ శ్రద్ధ, నిర్వహణ జోక్యం అవసరమన్నారు.

## కాలువలో పడ్డ కారు


### మహిళలు, చిన్నారులు సహా ఏడుగురు మృతి



**జైపూర్ :** రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా, కారు అదుపుతప్పి నీటి కుంటలో పడింది. ఈ ఘటనలో రెండు కుటుంబాలకు చెందిన మహిళలు, చిన్నారులుసహా ఏడుగురు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ప్రహ్లాద్‌పుర సమీపంలోని శివదాస్‌పుర పోలీస్ స్టేషన్ ప్రాంతంలో వేగంగా వెళ్తున్న కారు జైపూర్‌లో డివైడర్‌ను ఢీకొట్టి రింగ్ రోడ్డు దిగువన ఉన్న దాదాపు 16 అడుగుల లోతున పడిపోయిందని అధికారులు తెలిపారు. నుజ్జు నుజ్జు అయిన వాహనాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం, క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. కారులో ఉన్న ఏడుగురి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపినట్లు శివదాస్‌పుర ఎస్‌హెచ్‌ఒ సురేంద్ర సైని తెలిపారు. మృతులను వాటిక, సంగనేర్ నివాసి రామ్‌రాజ్ వైష్ణవ్; అతని భార్య మధు; వారి కుమారుడు రుద్ర; అజ్మీర్‌లోని కేక్రీకి చెందిన రామ్‌రాజ్ బంధువు కలురామ్; కలురామ్ భార్య సీమ; వారి కుమారుడు రోహిత్; మరియు గజరాజ్‌గా గుర్తించారు. ప్రమాదం శనివారం రాత్రి ఆలస్యంగా జరిగినట్లు కనిపిస్తోందని, అయితే కచ్చితమైన సమయం తెలియదని సైని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం అండర్‌పాస్‌లో దెబ్బతిన్న కారు కనిపించినప్పుడు మాత్రమే ఈ విషయం వెలుగులోకి వచ్చింది అని ఆయన అన్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామ్‌రాజ్ తన బంధువు చితాభస్మాన్ని నిమజ్జనం చేయడానికి కలురామ్, వారి కుటుంబాలతో కలిసి హరిద్వార్‌కు వెళ్లాడు. వారు జైపూర్‌కు తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.

## దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ రక్షణ

### అసోం పర్యటనలో ప్రధాని మోదీ విమర్శ



**మంగళ్‌దోయ్ :** ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అసోంలో పర్యటించారు. దరంగ్ జిల్లాలోని మంగళ్‌దోయ్‌లో జరిగిన ర్యాలీలో మోదీ ప్రసంగించారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పై మండిపడ్డారు. భాతర సైన్యానికి మద్దతు ఇవ్వడానికి బదులుగా, పాకిస్థాన్ తయారుచేసిన ఉగ్రవాదులకు మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను రక్షిస్తోందన్నారు. చొరబాటుదారులు భూమిని ఆక్రమించుకోవడానికి, జనాభాను మార్చడానికి వారు చేసిన కుట్రను బిజెపి అనుమతించదని ప్రధాని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేసిన మన సాయుధ దళాలకు మద్దతు ఇవ్వడానికి బదులుగా, చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను రక్షించడంలో కాంగ్రెస్ నిమగ్నమై ఉందని ప్రధాని ఆరోపించారు. 1962లో చైనా దురాక్రమణ సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ అసోం ప్రజలపై చేసిన గాయాలు ఇంకా మానలేదన్నారు. ఆక్రమిత భూమి నుండి చొరబాటుదారులను తరిమికొట్టి, రైతులు ఇప్పుడు ఈ ప్లాట్లలో సాగు చేసుకోవచ్చని ప్రకటించినదుకు అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మను కూడా ఆయన ప్రశంసించారు. చొరబాటుదారులు భూమిని లాక్కోవడానికి, మహిళలు, బాలికలను అవమానించడానికి, జనాభాను మార్చడానికి కుట్ర చేయడాన్ని బిజెపి అనుమతించదని, ఇది జాతీయ భద్రతకు ముప్పు అని మోదీ వ్యాఖ్యానించారు. భారతరత్న అవార్డు గ్రహీత భూపేన్ హజారికాను కాంగ్రెస్ అవమానించడం పట్ల తాను బాధపడ్డానన్నారు. ఆమె కలల సాకారం చేయడానికి బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ దశాబ్దాలుగా అసోంను పాలించిందని, కానీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం మూడు వంతెనలు మాత్రమే నిర్మించిందని, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో అలాంటి ఆరు నిర్మాణాలను నిర్మించిందని మోదీ పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదుగుతోందని ప్రధాని పేర్కొంటూ అసోం వృద్ధి రేటు 13 శామన్నారు.

### ముడి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించడానికి చర్యలు

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముడి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించడానికి చర్యలు తీసుకుంటోందని, శిలాజ ఇంధనాలు, గ్రీన్ ఎనర్జీ అన్వేషణపై ఎక్కువ దృష్టి సారిస్తోందని ప్రధాన మోదీ అన్నారు. రూ. 12,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన తర్వాత నుమాలిగఢ్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారతదేశం అభివృద్ధి చెందుతున్నందున, ముడి చమురు, గ్యాస్ కోసం దేశం విదేశీ దేశాలపై ఆధారపడి ఉందని అన్నారు. దీనిని మార్చడానికి, మన ఇంధన అవసరాలను తీర్చడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం చమురు అన్వేషణ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై పని చేస్తోంది అని ప్రధాని అన్నారు. ఇథనాల్ ఒక ప్రధాన ప్రత్యామ్నాయ ఇంధన వనరు, నుమాలిఘర్‌లో కొత్తగా ప్రారంభించబడిన బయోఇథనాల్ శుద్ధి కర్మాగారం రైతులకు, గిరిజనులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన అన్నారు.

## ఎస్‌ఎస్‌సి పరీక్షలకు 2,29,497 మంది అభ్యర్థులు హాజరు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వసహాయక పాఠశాలల్లో 11, 12 తరగతులలో అసిస్టెంట్ టీచర్ల నియామకం కోసం ఆదివారం జరిగిన స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సి) పరీక్షలకు మొత్తం 2,29,497 మంది అభ్యర్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. విద్యా మంత్రి బ్రాత్య బసు పేర్కొన్న ప్రకారం మొత్తం 2.46 లక్షల మంది నమోదైన అభ్యర్థులలో 93 శాతం మంది హాజరయ్యారు. తొమ్మిదేళ్ల తర్వాత నిర్వహిస్తున్న స్కూల్ లెవల్ సెలక్షన్ టెస్ట్ (ఎస్ఎల్ఎస్‌టి) 478 కేంద్రాలలో నిర్వహించారు. 13,517 మంది అభ్యర్థులు రాష్ట్రం వెలుపల నుండి వచ్చారని, వీరిలో ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్, బిహార్ నుండి వచ్చారని బసు చెప్పారు. ఈనెల 7న నిర్వహించిన మొదటి దశలో 636 కేంద్రాలలో 9, 10 తరగతులలో అసిస్టెంట్ టీచర్ల నియామకం కోసం ఉద్దేశించిన ఎస్ఎల్ఎస్‌టి పరీక్షలకు 3.19 లక్షల మంది అభ్యర్థులలో 91శాతం మంది హాజరయ్యారు. వారిలో 31,362 మంది బెంగాల్ వెలుపల నుండి వచ్చారు. అధిక శాతం ఉత్తరప్రదేశ్, బిహార్ నుండి వచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థిలపై తాను రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదని, బసు చెప్పారు.

## ఇజ్రాయెల్ దాడులపై నేడు అరబ్ దేశాల సదస్సు

**దోహా :** గడచిన మంగళవారం దోహాలో పలుచోట్ల ఇజ్రాయెల్ దాడులు చేయడంపై సోమవారం అరబ్ దేశాల నాయకులు శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తున్నారు. ఖతార్‌లో జరిగే ఈసదస్సులో పలు అరబ్ దేశాల నాయకులు పాల్గొని ఆ దేశానికి తమ సంఘీభావం ప్రకటిస్తారు. భవిష్యత్ ప్రణాళిక రూపొందించే అవకాశాలున్నాయి. దీనికి ముందుగా ఆదివారంననాడు దోహాలో అరబ్ దేశాల విదేశాంగమంత్రుల సమావేశం జరిగింది. దోహాలో చేసిన దాడులను ఖతార్ ప్రధానమంత్రి అల్ తహనీ ప్రతిష్ఠాత్మకంగా భావించారు. దేశ సార్వభౌమాధికారాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని ఆయన విమర్శించారు. శుక్ర,శనివారాల్లో ఆయన అమెరికాలో పర్యటించారు. డోనాల్డ్ ట్రంప్, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో, ఇతర అమెరికా ఉన్నతాధికారులతో సమావేశాలు జరిపారు. దోహాలో ఇజ్రాయెల్ దాడులపట్ల తమ దేశం ఎంత మాత్రం సంతోషంగా లేదని మార్కో రుబియో చెప్పారు.

## టర్కీకి ఇజ్రాయెల్ దాడి భయం

**ఇస్తాంబుల్:** ఏడాదికాలంగా మధ్యప్రాచ్యంలో ఖతార్ సహా ఏడు దేశాలపై దాడులు చేసిన ఇజ్రాయెల్ వల్ల తమ దేశానికి కూడా తీవ్ర ప్రమాదం ఉందని టర్కీ భయాందోళన చెందుతోంది. దోహాలో దాడుల తర్వాత తదుపరి లక్ష్యం తమ దేశమేనని భయపడుతోంది. ఈనెల తొమ్మిదో తేదీన ఇజ్రాయెల్ సైన్యం దోహాపై దాడులు చేసింది. హమాస్ నాయకులు హతులయ్యారని భావించింది. హమాస్ నాయకులను అప్పగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఖతార్‌కు ఇజ్రాయెల్ హెచ్చరించడంతో ఆ దేశ ప్రధానమంత్రి అల్ తహనీ ప్రపంచదేశాల మద్దతు కూడగడుతున్నారు. ఇప్పుడు టర్కీ కూడా భయపడుతోంది. ఇజ్రాయెల్,టర్కీ రెండు ఒకప్పుడు మధ్యప్రాచ్యంలో బలమైన భాగస్వామ్యదేశాలు. కానీ అనేక సంవత్సరాలుగా పాలస్తీనాకు, హమాస్‌కు టర్కీ మద్దతుగా ఉంది. హమాస్ నాయకులు నిత్యం టర్కీలో పర్యటనలు చేస్తూనే ఉంటారు. వారికి అక్కడ నివాసాలు ఉన్నాయి. ఆ దేశాధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డొగాన్ హమాస్‌కు మద్దతు ఇస్తున్నందువల్ల ఐడిఎఫ్ దాడి చేస్తుందని ఆయన భయపడుతున్నారు. నెతన్యాహూను ఆయన అడాల్ఫ్ హిట్లర్‌తో పోల్చారు. ఖతార్ నాయకులకు ఆయన సన్నిహితుడు. ఇప్పటివరకూ ఇరాన్, సిరియా, యెమెన్, ఖతార్ దేశాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఐతే టర్కీకి బలమైన సైనికశక్తి ఉంది.


## 27 శాతం ఒబిసి కోటాపై బిజెపి డ్రామా

### కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ విమర్శ



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం ఇతర వెనుకబడిన తరగతులకు(ఒబిసి) 27 శాతం రిజర్వేషన్ల పేరుతో 'డ్రామా' ఆడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమల్‌నాథ్ ఆరోపించారు. సామాజిక హక్కులను హరించడానికి అధికార పార్టీ పనిచేస్తోందని మండిపడ్డారు. 2019లో నాథ్ నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఒబిసి కోటాను 14 శాతం నుండి 27శాతానికి పెంచింది. కానీ వ్యాజ్యం కారణంగా అమలు చేయలేకపోయింది. కాగా, మోహన్ యాదవ్ ప్రభుత్వం తనను తాను రక్షించుకోవడానికి కోర్టు విధానాలు, న్యాయ సలహాలను పదేపదే ఉదహరిస్తోందని కమల్‌నాథ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఒబిసి కోటా విషయం సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉందని, దీనిపై ఈనెల 23నుండి ప్రతిరోజూ విచారణ జరగనుంది. యాదృచ్ఛికంగా, యాదవ్ శనివారం ఒబిసి మహాసభతో సమావేశం నిర్వహించగా, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ప్రశాంత్ సింగ్ ఈ అంశంపై న్యాయవాదులు, వాటాదారులతో చర్చించారు. గత నెలలో ముఖ్యమంత్రి యాదవ్ కోటా అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వడంలో ఏకగ్రీవంగా ఉన్నాయని చెప్పారు. శాసనసభ, కార్యనిర్వాహక వర్గం దాని అమలును నిర్ధారించడానికి సమష్టి ప్రయత్నాలు చేస్తాయని యాదవ్ నొక్కి చెప్పారు. అయితే బిజెపిపై కమల్‌నాథ్ విరుచుకుపడ్డారు. 'మధ్యప్రదేశ్‌లో 27 శాతం ఒబిసి రిజర్వేషన్లపై 'భారీవ్యూహం' పేరుతో ఆడుతున్న నాటకం. సామాజిక వర్గాల హక్కులను హరించే కుట్ర కంటే తక్కువేమీ కాదు' అన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో పాల్గొనేవారిని మొబైల్\ఫోన్లు తీసుకెళ్లడానికి ఎందుకు అనుమతించలేదని నాథ్ ప్రశ్నించారు. 'ఇది కుట్రలో భాగమా? చర్చ వాస్తవ దృశ్యాలు, వివరాలు ప్రజలకు చేరాలని ప్రభుత్వం కోరుకోలేదా? అని నాథ్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒబిసి కోటాను 27 శాతానికి పెంచగా, బిజెఇ అమలు చేయకుండా కోర్టులలో అడ్డంకులు సృష్టించిందని నాథ్ ఆరోపించారు.

## బిజాపూర్‌లో కొత్తగా రెండు భద్రతా శిబిరాలు



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నక్సలైట్ ప్రభావిత బిజాపూర్ జిల్లాలో భద్రతా శూన్యతను పరిష్కరించడానికి, అభివృద్ధి పనులను సులభతరం చేయడానికి రెండు కొత్త సిఆర్‌పిఎఫ్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో జనవరి 2024 నుండి జిల్లాలో 36 భద్రతా శిబిరాలను ఏర్పాటు చేసినట్లు బిజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ పిటిఐకి తెలిపారు. ఇదే సమయంలో 193 మంది మావోయిస్టులను తటస్థీకరించామని, 496 మంది లొంగిపోయారని, 900 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'నియాద్ నెల్లా నార్' (మీ మంచి గ్రామం) పథకం కింద గ్రామస్తులకు ప్రాథమిక సౌకర్యాలు, భద్రత కల్పించడం లక్ష్యంగా శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఉల్లూర్ గ్రామంలో జిల్లా పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సెప్టెంబర్ 9న 'సురక్ష ఏవం జన్ సువిధ క్యాంప్' (భద్రత, ప్రజా సౌకర్యాల శిబిరం)ను ఏర్పాటు చేయగా, మరొకటి 11న చిల్లమార్క గ్రామంలో ఏర్పాటు చేశారు. రెండూ భోపాల్‌పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నాయని ఆయన చెప్పారు. ఉల్లూరులోని సిఆర్‌పిఎఫ్ శిబిరం 62వ బెటాలియన్‌కు ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌గా, మరొకటి 2వ బెటాలియన్‌లో ఒకటిగా ఉంటుందని అధికారి తెలిపారు. ప్రతికూల వాతావరణం, కష్టతరమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నప్పటికీ, భద్రతా దళాలు అజేయమైన ధైర్యాన్ని ప్రదర్శించి రెండు కొత్త శిబిరాలను విజయవంతంగా స్థాపించాయని, ఈ చర్య వ్యూహాత్మకంగా ముఖ్యమైనది మాత్రమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధి వేగాన్ని కూడా బలోపేతం చేస్తుందని అధికారి తెలిపారు. ఈ శిబిరాలు భోపాల్‌పట్నంను ఫర్సేఘర్, సాంద్రా (బిజాపూర్‌లో), గడ్చిరోలి (పొరుగున ఉన్న మహారాష్ట్రలో)లకు అనుసంధానించడంలో సహాయపడతాయి, మావోయిస్టుల అంతర్‌రాష్ట్ర కార్యకలాపాలను అదుపు చేస్తాయి. అంతేకాకుండా, ఇంద్రావతి జాతీయ ఉద్యానవనం ప్రాంతంలోని గ్రామాలను అనుసంధానించడానికి రోడ్ల నిర్మాణాన్ని కూడా ఇవి సులభతరం చేస్తాయని ఆయన అన్నారు. ఈ శిబిరాలు గ్రామస్తులకు ఆరోగ్యం, విద్య, విద్యుత్, తాగునీరు, పిడిఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) దుకాణాలు, మొబైల్ నెట్‌వర్క్, రోడ్లు, వంతెనలు అందుబాటులో ఉండేలా చూసుకోవడానికి సహాయపడతాయని అధికారి తెలిపారు.

## బీమా రంగంలో నూరుశాతం ఎఫ్‌డిఐ శీతాకాల సమావేశాల్లో సవరణ బిల్లు



**న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బీమా సవరణ బిల్లు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. బీమారంగంలో నూటికి నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డిఐ) అనుమతించేందుకు వీలుగా ఈ సవరణ బిల్లు ప్రతిపాదన పార్లమెంటుకు తెచ్చే అవకాశాలున్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా పిటిఐ వార్తాసంస్థకు మంత్రి చెప్పారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు సాధారణంగా నవంబరు రెండోవారంలో ప్రారంభమై క్రిస్‌మస్‌కు ముందే పూర్తవుతాయి. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను తదుపరి మరింతగా సరళీకరించేందుకు ఈబిల్లు ఉపయోగపడుతుందా అని ప్రశ్నించగా ''నేనే అదే ఆశాభావంతో ఉన్నా'' అని సీతారామన్ చెప్పారు. జీవితబీమా సంస్థ చట్టంలో సవరణ ద్వారా బ్రాంచీల విస్తరణకు, ఉద్యోగుల నియామకాలు, ఎంపికలకు సంస్థ బోర్డుకే పూర్తి నిర్వహణాధికారాలు సంక్రమింపజేస్తారు. ఐతే ఈ చట్టంలో సవరణలు ప్రధానంగా పాలసీదార్ల ప్రయోజనాల రక్షణపైనే దృష్టి పెడుతుందని మంత్రి చెప్పారు. బీమారంగంలో ప్రస్తుతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు విధించిన 74 శాతం పరిమితిని నూరూశాతానికి పెంచుతామని ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి ప్రతిపాదించారు. ఆర్థిక రంగంలో కొత్త తరం సంస్కరణలను తీసుకురావడంలో భాగంగా ఈ సవరణ బిల్లు ప్రవేశపెడతారు. ''ఈ ఎఫ్‌డిఐ పరిమితి పెంపువల్ల దేశంలో యావత్ ప్రీమియం పెట్టుబడులకు సంబంధిత కంపెనీలకు అవకాశం కలుగుతుంది, ప్రస్తుతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో విధించిన ఆంక్షలను ఈ బిల్లు ద్వారా సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం, ఈ విధానాన్ని సంక్షిప్తీకరిస్తాం అని మంత్రి చెప్పారు. ఇప్పటివరకూ బీమారంగం రూ.82,000 వేలకోట్లు ప్రత్యక్ష పెట్టుబడులను సమకూర్చుకుంది. 1938 నాటి బీమా చట్టంలోని వివిధ నిబంధనలను సవరించేందుకు ఆర్థికమంత్రి చేసిన ప్రతిపాదనలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నూరుశాతం పెంపు కూడా ఒకటి. 1956 జీవిత బీమా సంస్థ చట్టం, 1999 నాటి బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ చట్టం,1938 బీమా చట్టాలలో సమగ్ర శాసనపరమైన సవరణల్లో భాగంగా ఈ ప్రతిపాదనలు చేశారు.

## ట్రంప్ రాకకోసం బ్రిటన్ రాచకుటుంబం ఏర్పాట్లు

**లండన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ వారంలో బ్రిటన్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఘనమైన స్వాగత సత్కారాలు చేయడానికి రాచకుటుంబం బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేస్తోంది. చారిత్రాత్మకమైన పురాతన బగ్గీలలో ప్రయాణ ఏర్పాట్లు, బ్రహ్మాండమైన విందులు, ఆడంబరాలు, గగనతల విన్యాసాలు, రెడ్‌కార్పెట్లతో ఘన స్వాగతాలకు రాచకుటుంబం ట్రంప్‌కోసం ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ కూడా తన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా సుంకాలు, వాణిజ్యం, ఉక్రేన్ యుద్ధ సమస్యపై చర్చలు వంటి అనేక ఇబ్బందికరమైన సమస్యలపై కూడా ట్రంప్ నిర్మొహమాటంగా తన అభిప్రాయాలు ప్రకటించే అవకాశాలున్నాయి.




# ఉద్యమ నెగళ్లు రాజేసిన తెలంగాణ సాహిత్యం


తెలంగాణ సాయుధపోరాటం కావచ్చు.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కావచ్చు.. ఉవ్వెత్తున ఎగసిపడిన నిరసనలకు ఊపిరిలూది, ప్రజలకు పోరాట మార్గాన్ని చూపిన ఘనత ముమ్మాటికీ సాహిత్యానిదే. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా, అప్పటి సాహిత్యాన్ని గుర్తుచేసుకోవడం అత్యవసరం. కానీ, విస్తృతమైన, లోతైన రచనలను ప్రస్తావించడం, స్థూలంగా విశ్లేషించుకోవడం అనుకున్నంత సులభం కాదు. అసాధ్యం కూడా. మచ్చుకు కొన్ని ప్రస్తావనలతో ముగించాల్సిన పరిస్థితి. నిజానికి, నాటి ఉద్యమాన్ని కవిత్వమే ఉరకలెత్తించింది. పరుగులు తీయించింది. దోపిడీని దునుమాడే ఆయుధమైంది. ప్రజల్లోకి దూసుకెళ్లి, ఉద్యమ స్ఫూర్తిని నింపి, నాటి నైజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసింది. సాహిత్యం అనేది సమాజానికి అద్దం అన్న సామెత మనందరికీ తెలిసినదే. కానీ తెలంగాణలో సాహిత్యం కేవలం అద్దమేగాక, ఒక ఆయుధం.. ఒక జ్యోతి... ఒక పిలుపు. జమీందారీ దోపిడీ, అణచివేత, ఆకలి తెలంగాణ ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపుతుంటే, కమ్యూనిస్టుల నేతృత్వంలో సాయుధ పోరాటం అనివార్యమైంది. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు, ఉద్యమ నిర్మాణ వ్యూహాలు, ప్రజలతో మమేకమై వారి పక్షాన గళమెత్తే విధానాలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుకు నడిపించాయి. అదే సమయంలో, అప్పటి సాహిత్యం కూడా ఈ ఉద్యమానికి అండగా నిలిచింది. ఫలితంగా, ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహ అగ్నిపర్వతం ఒక్కసారి విస్ఫోటనమైంది. ఉద్యమంగా రూపాంతరం చెందింది. సాహిత్యమే ప్రజలను ఒక్కోసారి పాటగా, ఒక్కోసారి కవితగా, ఒక్కోసారి కథగా ఆకట్టుకుంది. ఉద్యమ బాట పట్టించింది. అప్పటి తెలంగాణ సాహిత్యాన్ని పరిశీలిస్తే, అది కేవలం అక్షరాల సమాహారం కాదని స్పష్టమవుతుంది. గాయాలే గేయాలైన ఆ అక్షరాల వెనక కదిలిన మానవ సమూహం గుర్తుకొస్తుంది. సగటు జీవి బతుకు బండిపై రాసిన అక్షరాలు మనల్ని పలకరిస్తాయి. ఆలోచింపచేస్తాయి. నాటి హైదరాబాద్ రాష్ట్రంలో రైతులు జమీందార్ల దోపిడీకి గురయ్యారు. వందల ఎకరాల భూమి కొందరి చేతుల్లో ఉండగా, రైతులు బానిసల మాదిరిగా బతికారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు లేచినప్పుడు, ఆ స్వరం మొదటగా కవిత్వంగా, పాటగా బయటపడింది. ఒక ఉద్యమంగా ఎగసిపడింది. తెలంగాణ సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో ముఖ్యమైన అధ్యాయంగా నిలిచిపోయింది. జమీందార్లకు, దోపిడీదార్లకు, నైజాం పాలనకు వ్యతిరేకంగా లక్షలాది రైతులు ఉద్యమించారు. కవులు, గాయకులు, రచయితలు ఉద్యమాన్ని రికార్డు చేయడమే కాదు.. దానికి ఇంధనం సమకూర్చారు కూడా. ఈ సమయంలో కవిత్వం, పాట, నాటకం, నవల ఇలా ప్రతి ఒక్క సాహితీ ప్రక్రియ ప్రజలకు మార్గదర్శకం చేసింది. ప్రజలు పెద్దఎత్తున వీధుల్లో నినాదాలు చేస్తే, రచయితలు పదాలతో ఆ నినాదాల్ని బలపరిచారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ సాగిన దాసరథి రచన, ఒక అణచివేతకు వ్యతిరేకంగా వినిపించిన సింహ గర్జన. వ్యంగ్యమూ, తిరుగుబాటూ కలిపిన శక్తి. ఆయన భాషలో తెలంగాణ మట్టివాసన ఉంది. దాశరథి మాదిరిగానే ఎంతో మంది కవులు అణచివేతను నిరసించారు. ప్రజల తరఫున ధిక్కారపు కేతనాన్ని ఎగురవేశారు. తిరుగుబాటు చేసి, సవాలు విసిరి, సాహిత్య సమరభేరి మోగించారు. సాయుధ దళాలతో తలపడ్డ అక్షరాలే ఆయుధంగా పోరాటాలు కొనసాగించారు. ఆచరణాత్మక ప్రబోధమై వెలిగే నిఖార్సుతనానికి నిలువెత్తు రూపంగా దర్శనమిచ్చారు. తెలంగాణలో జరిగిన దోపిడీలు, పడతుల మానాల అపహరణాలు, అణచివేతలు, ఊళ్ళకు ఊళ్ళు అగ్గిపెట్టి తల్లీ పిల్లల కడుపు కొట్టిన దుర్మార్గాలు... ఇలా ప్రతి అంశం నాటి సాహిత్యంలో ఆవిష్కృతమైంది. దౌర్జన్యాలు, అక్రమాలు, అన్యాయాలపై ధిక్కార స్వరాలు వినిపించింది. నాటి తెలంగాణ సాహిత్యమంటే ఉద్యమ సాహిత్యం... తిరుగుబాటు సాహిత్యం... విప్లవ సాహిత్యం... అణగారిన వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన సాహిత్యం... నైజాం అకృత్యాలను ఎదిరించే శక్తిని సామాన్యుడికి అందించిన సాహిత్యం. తెలంగాణ ఉద్యమకాలంలో ప్రముఖ నవలా రచయిత వట్టికోట అళ్వారుస్వామి రచించిన 'ప్రజల మనిషి'కావచ్చు... దాశరథి రంగాచార్యులు రాసిన 'మోదుగపూలు' కావచ్చు... ప్రతి ఒక్క రచనా ఒక్కో నిప్పు కణిక. కాళోజీ నారాయణరావు సాహిత్యానికి, తెలంగాణ ఉద్యమానికి ఉన్న సంబంధం గురించి ఎంత చెప్పినా తక్కువే. కవితలు, పాటలు మాత్రమేకాదు... ఒగ్గుకథ, బుర్రకథ, హరికథ వంటి జానపద కళారూపాలు కూడా ఉద్యమాన్ని నిలబెట్టాయి. అప్పట్లో ఎంతో మంది రచయితలు కేవలం సాహిత్య ప్రయోగం కోసం కాదు, ఉద్యమంలో భాగస్వాములయ్యేందుకు అక్షరయజ్ఞం చేశారు. ప్రజాగేయాలు ఊరూవాడా మారుమోగాయి. ప్రజా గీతం అంటే కేవలం జానపద స్వరం కాదు, అది 'న్యాయం కావాలి' అంటూ ప్రతిధ్వనించే ఆత్మకేక అని నిరూపించాయి. తెలంగాణ సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ప్రజా గీతాలే చూడాలని అనుకునే రీతిలో నాటి పాటలు ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. అవి దాదాపు ప్రతి గ్రామంలో వినిపించాయి. ఆయా ప్రాంతాల సమస్యలను బయటపెట్టాయి. ప్రజల కష్టాలను, జమీందారుల దౌర్జన్యాలను కళ్లకు కట్టాయి. తిరుగుబాటుకు ప్రేరేపించాయి. వీధినాటకాల రూపంలోనూ ఉద్యమ సాహిత్యం తెలంగాణ నలుమూలలా విస్తరించింది. కమ్యూనిస్టు కళా బృందాలు గ్రామాలకి వెళ్లి వీధి నాటకాలు ఆడేవి. మనం ఎందుకు బానిసలుగా ఉన్నాం? అన్న ప్రశ్న లేవనెత్తేవి. తెలంగాణ సాహిత్యం ఉద్యమానికి జవజీవాలను అందించేవి. పాట నుంచి నాటకం వరకూ... కవిత నుంచి నవల వరకూ, అన్ని రకాల సాహిత్య ప్రక్రియలూ తెలంగాణ ఉద్యమాన్ని నిలబెట్టాయి. గెలుపుబాటలో నడిపించాయి. స్థూలంగా చెప్పాలంటే, ఉద్యమ నెగళ్ళు రాజేసిన తెలంగాణ సాహిత్యం కేవలం పుస్తకాలలో పరిమితమైనది కాదు. అది వీధిలో నినాదమైంది, పొలాల్లో పాటైంది, పల్లెలో గర్జనైంది. తెలంగాణ సాహిత్యం అనేది ఒక యుగానికి నినాదం. అది తిరుగుబాటుకు పిలుపు. అది కన్నీటి చరిత్ర. అదే సమయంలో ఆశ, ఆత్మగౌరవం, గెలుపు పిలుపు కూడా. 1940 దశకంలో వచ్చిన తెలంగాణ సాహిత్యాన్ని... తెలంగాణ సాయుధ పోరాటాన్ని వేరువేరుగా చూడడానికి వీల్లేదు. అప్పటి సాహిత్యంతా ఉద్యమమే. ఉద్యమమంతా సాహిత్య ప్రభావితమే. ఆ రచనలు నేటికీ అదే తరహా ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తాయి. ఆ సాహిత్యానికి శతకోటి విప్లవాభివాదాలు.

**– బిఎల్**



*తెలంగాణ సాయుధ పోరాట సమయంలో వచ్చిన రచనలేకాదు.. ఆ తర్వాత ఎంతోమంది తమ అనుభవాలను వివరిస్తూ రాసిన పుస్తకాలు కూడా పాఠకులను విశేషంగా ఆకర్షిస్తునే ఉన్నాయి. రావి నారాయణ రెడ్డి 'వీర తెలంగాణ నా అనుభవాలు... జ్ఞాపకాలు' కావచ్చు... దొడ్డా నరసయ్య రాసిన 'తెలంగాణ సాయుధ పోరాటం.. అనుభవాలు–జ్ఞాపకాలు' కావచ్చు.. నల్లా నరసింహులు రచించిన 'తెలంగాణ సాయుధ పోరాటం.. నా అనుభవాలు' కావచ్చు.. ప్రతి పుస్తకం చరిత్రకు దర్పణం. ప్రతి అక్షరం భవిష్యత్ తరాలకు మార్గదర్శకం.*

బండి యాదగిరి రాసిన 'బండెన్క బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి... ఏ బండ్లో వస్తవు కొడుకో దేశ్‌ముఖు దొరగాడా' అనే పాట నాటి సాయుధ పోరాటంలోనేకాదు... ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కొన్ని చిన్నచిన్న మార్పులతో మరోసారి తెలంగాణ యావత్తు మారుమోగిపోయింది. యువతకు హితబోధ చేసింది. జన సామాన్యంలోకి చొచ్చుకుపోయి, దశాబ్దాలపాటు తెలంగాణ పోరాటాలకు ప్రతిబింబమైంది. ఆ వేదనను వినిపించడానికి, ఆగ్రహాన్ని ప్రతిబింబించడానికి విద్యార్హతలేవీ అవరం లేదని యాదగిరి పాట ని రూపిస్తుంది. నిరక్షరాస్యుడైనప్పటికీ, అతని పాట తెలంగాణ సాయుధ పోరాట హృదయస్పందనగా మా రింది. చురకత్తుల్లా సూటిగా మెదళ్లలోకి దూసుకుపో యే పదాలకు అక్షర లక్షలు సరిపోవు. ప్రశ్నించే గొం తుకలకు ధైర్యమిచ్చిన ఆ పాట సింహనాదమై జనం గుండెల్లో ప్రతిధ్వనించింది. నైజాం సర్కారు గుండెల్లో రై ళ్లు పరిగెత్తించింది. అప్పటి ప్రజల యొక్క దృఢ సంకల్పాన్ని, లక్ష్యాన్ని ఎలుగెత్తి చాటిన ఆ పాట ఇప్పటికీ ప్రజల గుండెల్లో సజీవంగా, స్థిరంగా నిలిచిపోయింది. 'మా భూమి' సినిమా కోసం గద్దర్ కొన్ని మా ర్పులుచేర్పులు చేసి పాడిన అదే పాట, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ ప్రజలను ఉద్రూతలూగించింది. 'దేశ్‌ముఖు దొరగాడ' అనే పదాల స్థానంలోనే 'నైజా ము సర్కరోడ' అనిమార్చడం, ఆ సినిమాకు అనువైన సందర్భం.




### యాదగిరి రాసిన పాట..


**బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి**
**ఏ బండ్లె వస్తవ్ కొడుకో దేశ్‌ముఖు దొరగాడ**
**నాజీల మించినవ్ రో దేశ్‌ముఖు దొరగాడ**
**పోలీసు మిలిట్రీ రెండు బలవంతులానుకోని**
**నువ్వు పల్లెలు దోస్తివి కొడుకో .. మా పల్లెలు దోస్తివి కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**స్త్రీ పురుషులంత గలిసి ఇల్లాలమంత గలిసి**
**వడిసేల రాళ్లు గట్టి వడివడిగ గొట్టితేను**
**కారాపు నీళ్లు దెచ్చి కండ్లల్ల జల్లితేను**
**నీ మిలిట్రీ బారిపొయెరో,, నీ మిలిట్రీ బారిపొయెరో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**మాపొలం మింగినోడ.. మా అడవి దోచినోడ**
**మా బతకు బుగ్గిచేసి.. సిరిసంపదంత దోచి**
**సంచుల్లకెత్తుకోని.. బళ్లల్లో నింపుకోని**
**బయలుదేరినావ కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**సుట్టుముట్టూ సూర్యపేట, నట్టనడుమ నల్లగొండ**
**నువ్వుండేది హైద్రబాదు దాని పక్క గోలుకొండ**
**గోలుకొండ ఖిలా కిందా.. గోలుకొండ ఖిలా కిందా**
**నీ గోరికడతం కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**నీ గోరికడతం కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**


## చదవాల్సిన పుస్తకం

# ఉద్యమ యోధుడి సింహావలోకనం




తెలంగాణ సాయుధ పోరాట మహా ఉద్యమంలో పాల్గొన్న ఓ మహాయోధుడు తన అనుభవాలను అక్షర రూపంలో సింహావలోకనం చేసుకోవడం ఆత్మసంతృప్తి కావచ్చు. కానీ, భావి తరాలకు మాత్రం ఓ అద్భుత వరం. 'తెలంగాణ సాయుధ పోరాటం.. నా అనుభవాలు' పేరుతో నల్లా నరసింహులు ఉద్యమ తీరుతెన్నులను అద్భుతంగా వివరించారు. అందులో తన భాగస్వామ్యాన్ని కూడా పొందుపరిచారు. తెలంగాణ చరిత్రలో సాయుధ పోరాటం ఒక అపూర్వమైన విప్లవ ఘట్టం. నిజాం ప్రభుత్వ దౌర్జన్యం, దోపిడీ, తరతరాల బానిసత్వం, అంతులేని పన్నుల మోత వంటి ఎన్నో పరిణామాలు రైతాంగాన్ని తిరుగుబాటు పంథాలో నడిపించాయి. అణచివేతను, అకృత్యాలను సహించలేని స్థితికి చేరుకున్న గిరిజన, దళిత పేదలు, తమ బానిస సంకెళ్లు తెంచుకోవడానికి ఉద్యమ బాట పట్టారు. కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శకంలో తుపాకీ పట్టారు. 'భూమి కోసం.. విముక్తి కోసం ఈ పోరాటం' అంటూ రక్తాన్ని ధారపోశారు. గ్రామగ్రామాన పోరాటాలు చేశారు. ఎంతో మంది వీరమణం పొందారు. రైతుకి భూమి, కూలీకి గౌరవం సాధించడమే వారి లక్ష్యం. సామంతుల భూస్వామ్య వ్యవస్థను కూల్చివేయడమే వారి ధ్యేయం. దళిత, గిరిజన పేదలపై జరుగుతున్న దోపిడీకి ముగింపును వారు కోరుకున్నారు. కేవలం భూమి కోసం మాత్రమే కాదు.. మనిషి గౌరవం కోసం కోసం కూడా పరితపించారు. వీరి త్యాగం వల్లే నల్లని కాళరాత్రిలో వెలుగురేపిన అగ్ని కిరణాలతో గ్రామాలు మేల్కొన్నాయి. నిజం సర్కారు పీడల నుంచి విముక్తి పొందారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటం చూపిన దారి, వేసిన బాటలే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశాయి. ఈ అంశాలన్నీ నల్లా నరసింహులు పుస్తకం ప్రస్తావిస్తుంది. విసునూరు దేశ్‌ముఖ్ దోపిడిని, దౌర్జన్యాలను వివరిస్తుంది. చాలా మంది హరిజనులు వెట్టి చేయలేక ముస్లిం మతంలోకి మారిన దైన్యాన్ని కళ్లకు కడుతుంది. ఆకునూరులో ప్రజల తిరుగుబాటు, కడవెండిలో ఆంధ్రమహాసభ నిర్మాణం, చాకలి ఐలమ్మ పోరాటం, జీతగాళ్ల సమ్మె, దొడ్డి కొమురయ్య వీరమణం, ధర్మాపురంలో భూమికోసం పోరాటం, మూకుమ్మడి అరెస్టులు వంటి ఎన్నో జ్ఞాపకాలతో పుస్తకాన్ని నల్లా నరసింహులు తీర్చిదిద్దారు. ఇందులో ప్రతి పేజీ చరిత్ర పుటగా కనిపిస్తుంది. పాఠకులను స్ఫూర్తిదాయక ఆలోచనా స్రవంతిలోకి తీసుకెళుతుంది. నాటి తెలంగాణ పోరాయ యోధులు చేసిన త్యాగాలు వృథా కాకూడదన్న సత్యాన్ని మనకు నిరంతరం గుర్తుచేస్తుంటాయి. ఈ పుస్తకాన్ని ఎన్. సాంబశివరావు 'The Telangana Armed Struggles... my experiences' పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. ఇది ఒక అనువాదం మాదిరికాకుండా, నేరుగా ఒక చారిత్రక నేపథ్యం గల ఆంగ్ల పుస్తకాన్ని చదువుతున్న అనుభూతిని కలిగిస్తుంది. రచయిత స్వయంగా చూసిన పరిస్థితులు... అనుభవించిన కష్టాలు... ఎక్కడికక్కడ రగులుకున్న పోరాట పంథాలు... ఇలా ఎన్నో అంశాలు, ఘటనలు, అనుభవాలతో కూడిన ఈ పుస్తకం తప్పక చదవాల్సిందే.




### పుస్తకం పేరు

**తెలంగాణ సాయుధ పోరాటం.. నా అనుభవాలు**
**రచయిత: నల్లా నరసింహులు**
**వెల: రూ. 170**
The Telangana Armed Struggle... my experiences
price: Rs. 220
**అనువాదం: ఎన్. సాంబశివరావు**

ప్రతులకు

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

# పోరాటాలకు ఊపిరులూదిన తెలంగాణ పాట

పాట తెలంగాణ జన జీవితంలో ఓ భాగమైంది. సంతోషం, దుఃఖం, పండుగ, పబ్బం, చావు, పెళ్లి ఏదైనా పాట ఉండాల్సిందే. తెలంగాణ పాట ప్రజల జీవితాల్లో మా ర్పులు తెచ్చింది. తమ జీవితంలో భాగమైన పాటం తెలంగాణ ప్రజలకు గౌరవం. ఇక్కడి పాటలన్ని శ్రమజీవుల కష్టాల్లోంచి, ఆచార వ్యవహారాల్లోంచి అన్నింటికి మించి పని పాటల సోదరుల పొత్తిళ్లలో పుట్టింది. జనం సుఖ సంతోషాలు, బాధలు, ఆచారాలు, వ్యవహారాలే పాటకు ఇతివృత్తాలయ్యాయి. ఎవరి కోసమో అవసరాలు తీర్చుకోవడానికో ఇక్కడి కవులు కలాలు పట్టలేదప్పుడు. ప్రజల కోసమే కలం పట్టి ప్రజల కోసమే రాశారు. అందుకే తెల ంగాణ పాటకు పదునెక్కువ. అది ఎంతటి శక్తిని సంతరించుకుందం తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజలు ఉ ప్పెనలా కదిలేలా చేసింది. సామాన్యలను సాయుధులు ను చేసి బలవంతులమని విర్రవిగిన అనేక మందిని తోకముడిచి పారిపోయేలా చేసింది. తరతరాల రాచరిక వ్యవస్థను మట్టికరిపించింది. తమకు ఎదురే లేదని భావించిన వారికి గజగజలాడించిన తెలంగాణ పాట రైతాంగ సా యుధ పోరాటంలో దిక్సూచిగా నిలిచింది. పా ప్రేరణై మ హత్తర ప్రజా తిరుగుబాటుకు నేతృత్వం వహించింది. ఆ రోజుల్లో పాటలు ప్రజలను ఆలోచింపజేసేవి. ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని హితబోధ చేశాయి. ఇప్ప టి బిజెపి నేతలు సాయుధ తెలంగాణ పోరాటం హిందు, ముస్లిం పోరాటంగా చూపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంలో దాశరథి రాసిన పాట విం బిజెపి నేతల్లో మార్పు రావచ్చు. నల గొండ రణములో తెలుగ తెగువను చూపి బలమైన వీరులను కలవాలి
నిలిచి ముస్లింలు, హిందువులు తెలంగాణ సంకెళ్లు తెంచాలి ఈ పాట తర్వాత అనేక పాటలు తెలంగాణ ప్రజలను పోరాటానికి సన్నద్ధం చేశాయి. ఇదే సందర్భంలో

**అరుణారుణ తరుణి కొరకు**
**చెలరేగిన ప్రబల వాంఛ**
**పురికొల్పిన పొంగులతో**
**పోతున్నాం యుద్ధానికి**
**రణరంగపు విపణి వీధి**
**లక్షలాది ప్రాణాలను పైసలుగా పారబోసి స్వాతంత్ర్యం కొనితెస్తాం.** అన్న దాశరథి పాట ప్రజల్లో విశ్వాసాన్ని పోది చేసింది.

**రణభేరీ మ్రోగింది తెలుగోడా**
**రావోయి ముందుకు మొనగాడా**
**ఆంధ్రా వీరులు బాలచంద్రులై లేవాలి**
**మగువలందరూ రుద్రమాంబలై కదలాలి** అన్న సుద్దాల **హన్మంతు పాట ప్రజలను కదిలించింది.**

**చిన్న చిన్న పొరగాళ్లు**
**సీతయ్య జీతగాళ్లు**
**గొడ్డళ్లు నూరారు**
**భుజానపెట్టారు** అని కైకట్టిన పాట సామాన్యులు ఆయుధాలు పట్టేలా చేసింది. సుద్దాల హన్మంతు, కాళోజీ నారాయణరావు, దాశరథి, సుంకర, విశ్వం, తెన్నేటి సూరి, తిరునగరి రామాంజనేయులు, వట్టికోట అల్వారు స్వామి, బం డి యాదగిరి ఇలా అనేక మంది రాసిన పాటలతో పాటు స్థా నికంగా కవులు, కళాకారులు పరిస్థితులకు అనుగుణంగా స్థానిక బాణిలతో పాటలు పాడుకుంటూ సాయుధ పోరాట విజయవంతానికి తమ పాటను ఆయుధంగా అందించారు. ఇలాంటి త్యాగాల ముటా తెలంగాణ పాట. శృతితప్పి గతితప్పింది. పైసల కోసం



కలాలు, గళాలు అమ్ముడుపోతున్నాయి. తెలంగాణ ప్రజ ల వాస్తవిక జీవితాన్ని ప్రపంచానికి చూపిన పాట చైతన్యాన్ని నింపిన పాట ఇప్పుడు డబ్బుల కోసం జోగుతుం ది. స్థాయి లేని వారిని తెగపోగుడుతూ సా గిల పడుతుం ది. లేనిది ఉన్నట్లుగా ఉన్నది లేనట్లుగా చూపి ప్రజలను ఏమార్చుతుంది. తెలంగాణ పాట వ్యాపార వ స్తువై ఎన్నికల వేళ ఊరురా వినిపిస్తుంది. సాయుధ పోరాట వార్షికోత్సవ వేళ ప్రజల బాధలు తమవిగా ప్రజల జీవితమే పా టకు ప్రేరణగా పాటలు, కవితలు రాసి అమరులైన వారి కి జోహార్లు అర్పిస్తూ ఇప్పటికీ ప్రజల పక్షాన నిలుస్తున్న కలాలకు, గళాలకు వందనాలు అర్పిస్తూ ఓ కవి రాసినట్లు

**కాసు కొరకు కీర్తి కొరకు**
**కాకూడదు గానం**
**ఎత్తవోయి నీ గళం**
**కదలాలి ఈ జనం**
**నీ గానం నీ చిత్రం**
**నీ కావ్యం నీ నటన**
**తెలపాలి అసలు నిజం**
**కదలాలి జనం మనం**

**– ఏనుగు వెంకశ్వరరావు, ఖమ్మం**

ఈ వారం కవితలు

## చలో చండీఘడ్



చలో చలో చలో కామ్రేడ్స్
పద పద పద కామ్రేడ్స్
భారత కమ్యూనిష్టుపార్టీ
ఇరువై ఐదవ మహాసభలకు
రారమ్మని చండీఘ్డ పిలుస్తోంది.

నాటి తొలితరం నేతలు
కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలు
సింగారవేలు డాంగే ఘాటే అధికారి
చంద్ర ఇంద్రజిత్ గుప్తాలు ఎగరేసిన
ఎర్రజెండా మహాసభ పిలుస్తోంది

ప్రజాస్వామ్య పట్టుగొమ్మ
పార్లమెంటు భవన ప్రారంభకులు మన
రావి నారాయణరెడ్డి ప్రజలవాణి ప్రతిధ్వనించిన
భూపేష్ గుప్తా చతురానన్ చంద్రప్పన్ బర్ధన్
గర్జించిన గళం పిలుస్తోంది. పద కామ్రేడ్

మహిళా బిల్లుకై పోరాడిన మన
గీతా ముఖర్జమ్మ శ్రామిక హక్కుల ప్రధాత
గురుదాస్ దాస్‌గుప్త పార్టీ నిర్మాణదక్షులు
నీలం నల్లమల గిరి ప్రసాద్ త్యాగాల
సమర పతాకం పిలుస్తోంది.పదకామ్రేడ్

నాలుగు వందల డెబ్బై అయిదు మంది
అభ్యర్థుల పోరు బరిలో గెలిచి ఎన్నికల చరిత్రను
తిరగరాసిన ధర్మబిక్షం వామపక్ష విద్యార్థి
యువజన ఉద్యమాల రణం సురవరం
అందించిన ఆరుణ పతాకం పిలుస్తోంది
పద కామ్రేడ్

భరతమాత ముద్దుబిడ్డడు. భగత్ సింగ్
పురిటి గడ్డ పిలుస్తోంది పద కామ్రేడ్
నరహంతక డయ్యర్ తూటాలకు
నేలకొరిగిన అమరుల త్యాగాల నేల
జలియన్ వాలాబాగ్ పిలుస్తోంది.
రక్షణలేని రాజ్యాంగం
ఉగ్రవాదపు ఉన్మాదాలు
మణిపూర్‌లో మారణహోమాలు
మతోన్మాద శక్తుల నుంచి
ఈదేశాన్ని రక్షిద్దాం పద కామ్రేడ్స్

**(సిపిఐ 25వ జాతీయ మహాసభలు చండీఘడ్‌లో జరుగు సందర్భాన్ని పురస్కరించుకొని)**

**బొమ్మగాని నాగభూషణం**
**సెల్: 9849622633**

## గుట్టు తెలియాలి

అవినీతి విశ్వరూపమెత్తింది విశ్వమంతా
విశ్వాసాన్ని కోల్పోయి దోపిడీ కొమ్ము కాస్తున్నది
నీతి గోతిలో కూరుకు పోయింది
నేతిబీర నవ్వు లౌలకబోస్తున్నది
ధర్మదేవత గాంధారి రూపు దాల్చింది
మాటకు విలువ లేకుండా ఉంది
మూటలకు వంత పాడుతున్నది
చట్టం చట్ట బండలయినది

పీతాంబర దారులకే పీటలేస్తున్నది
గోచిలోని పాపం కాశీకే అంకితమంటున్నది
రక్త సంబంధాలకు లుప్త మనే వ్యాధి సోకింది
ఆత్మీయత అనురాగం ఎడారిలోన యుగళగీతమైనది
ఐక్యత బీడు పడి పోగా నీతికి పట్టమెక్కదున్నది
అవినీతి అంతం కావాలంటే కలుశాలకు నిలయమైన.....
కలియుగాన్ని మట్టు బెట్టే గుట్టు తెలియాలి

**నమిలకొండ నాగేశ్వర్ రావు**

## ఎవడిదిరా పోరాటం!

అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరూరా
ఇంకా నిటారుగా ఆకాశాన్నంటిన
సుత్తికొడవలి స్థూపాలు కాంద్రించి ఉమ్మేస్తాయి
స్థూపాల కింది మండే గుండెలు పెళపెళ
మంటూ విరుచుకు పడతాయి
ఏ కోశానా కూడా పోరాటపు ఛాయలే లేని
ఛాందసులు మౌఢ్యం వాసనే సోకని నేలపై
ప్రగల్భాలు పలక జూస్తే ఊర్ల నడిబొడ్డున
రంగు వెలవని సుత్తి కొడవలి జెండా
దిమ్మెలు మహత్తర పోరాట కాల సాక్ష్యా
లుగా ప్రజాకోర్టుల ఎదుట నిలబడతాయి

ఏ గుట్టను కదిలించినా
తుపాకీ గుళ్ల శబ్దాలను చెబుతాయి
ఏ వాగును కదిలించినా దోసిళ్ళతో
దూపను తీర్చిన చెలిమెలను చూపిస్తాయి
ఏ చెట్టును పట్టుకున్నా కొమ్మన వేలాడిన
సద్దులు సందేశాలు యాదికి తెస్తాయి
ఏ దారి ఎటుపోతుందో తెలియదు
ఏ డొంక ఎటు కదులుతుందో
కార్యాచరణలో నిబద్ధత పల్లెల నిండా
గడీల కూలదోసే దాకా సాగిన నడక
చేతికి దొరికిందే ఆయుధంగా మలచుకున్న
సృజనాత్మకత

రేపటి తరానికి విముక్తిని ప్రసాదించాలనే
ఆకాంక్షతో సాగిన సాయుధ పోరాట
హైజాక్ మీ తరం కాదు రా!!
కులం లేదుమతం లేదు
నిరంకుశ పాలనకి చరమగీతం పాడాలనే
లక్ష్యంగా సాయుధ పోరాటం!
మతం పేరిట వక్రీకరణ చేయ జూస్తే
బందగీ షోయబుల్లా ఉదయిస్తారా!
ఒక్క అడుగు పెట్టని మీకు ఈ నేలన
అడుగు పెట్టే అర్హత ఎక్కడిది?!

**గిరి ప్రసాద్, 9493388201**

## కర్ర శ్రీహరికి వెలిచాల నివాళి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** సిద్దిపేట జిల్లా శనిగరం గ్రామంలో సీనియర్ నాయకుడు కర్ర శ్రీహరి మృతదేహం వద్ద కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు నివాళులర్పించారు. కర్ర శ్రీహరి శనివారం రాత్రి హైదరాబాదులోని ఏఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వెలిచాల రాజేందర్ రావు ఆదివారం ఉదయం శనిగరం చేరుకుని కర్ర శ్రీహరి మృతదేహం వద్ద నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న కాంగ్రెస్ నేత, వారి కుమారుడు కర్ర రాజశేఖర్‌ను రాజేందర్‌రావు ఓదార్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కర్ర శ్రీహరి గొప్ప నేత అని, ఆయన మృతి అందరికీ తీరని లోటు అని రాజేందర్‌రావు సానుభూతి వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## మంత్రి శ్రీధర్ బాబు చొరవతో రైతులకు సరిపడా యూరియా

సింగిల్ విండో చైర్మన్ యాదగిరి రావు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ముత్తారం మండల రైతులకు సరిపడా యూరియా అందుబాటులోకి వచ్చిందని రైతులు ఆందోళన చెందకుండా ,యూరియా కావాల్సిన రైతులు సోమవారం ఆధార్ కార్డు జిరాక్స్,పట్టాదారు పాసు పుస్తకం జీరాక్స్ కార్యాలయంలో సంప్రదించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్అల్లాడి యాదగిరి రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## నర్సారెడ్డి, హరికృష్ణకు పిసిసి షోకాజ్ నోటీసులు

**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట నియోజక వర్గం కాగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణకు పిసిసి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల గజ్వేల్ నియోజక వర్గంలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలోనే డిసిసి ఎస్సీసెల్ చైర్మన్ విజయ్‌కుమార్‌పై డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి వర్గీయులు దాడి చేసిన ఘటనపై పిసిసి క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేశారు. అలాగే సిద్దిపేట నియోజక వర్గం ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణపై నియోజక వర్గానికి చెందిన పలువురు నేతలు క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో పిసిసి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి,వైస్ చైర్మన్ అనంతుల శ్యాం మోహన్ విచారణ జరిపి ఇరువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల లోపు జవాబు ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి ఆదివారం గాంధీభవన్‌కు వెళ్లి పిసిసి నేతలకు రేషన్‌కార్డుల పంపినలో జరిగిన గొడవపై వివరణ ఇచ్చినట్లు సమాచారం.

## పారమిత విద్యార్థులకు నేషనల్ 'స్పార్క్ ఇన్నోవేషన్' అవార్డులు




**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు కె.లక్షిత్, ఎ.వికాస్ తమ శాస్త్రీయ వినూత్న ఆవిష్కరణలకు గాను నేషనల్ స్పార్క్ ఇన్నోవేషన్ అవార్డు 2025 పొందారని ప్రధానోపాధ్యాయుడు గోపీ కృష్ణ తెలిపారు. తమ గైడ్ టీచర్ మోహన్ సాహుతో కలిసి 2025 సెప్టెంబర్ 12న హైదరాబాద్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి) లోని పి.ఎం.భార్గవ ఆడిటోరియంలో డాక్టర్ కెవి రావు సైంటిఫిక్ సొసైటీ నిర్వహించిన వార్షిక అవార్డు కార్యక్రమంలో కె.లక్షిత్, ఎ.వికాస్‌లను రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు, అవార్డులతో సత్కరించారు. సిల్వర్ జూబ్లీ వేడుకల సంధర్బంగా ఐఐసిఎస్‌సి బెంగుళూరులోని సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ మాదవి లత , సిఎస్ఐఆర్ సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, హైదరాబాదు డైరెక్టర్ డా.వినయ్ , కె.నండికూరి ప్రధాన అతిధులుగా విచ్చేసి విధ్యార్థులకు సర్టిఫికెట్, ట్రోఫీ, మెడల్, పదివేల రూపాయల నగదు బహమతితో సత్కరించారు. విధ్యార్థులు తమ ఆవిష్కరణ గణిత పరమైన జ్యామితీయ మార్గాల నమూనాను డాక్టర్ కెవి రావు శాస్త్రీయ సంఘం హైదరాబాదులో నిర్వహించిన స్పార్క్ ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ సంధర్బంగా పారమిత పాఠశాలల చైర్మన్ డా.ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు. రష్మిత, వియుయం ప్రసాద్, వినోద్ రావు, హనుమంత రావు. గోపీకృష్ణ, కో ఆర్డినేటర్లు రబీంద్ర పాత్రో, నాగరాజు, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు, ఉపాధ్యాయులు అభినందించారు.

## 3130 కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 3130 కేసులు పరిష్కారమయ్యాయని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో పెండింగ్‌లో ఉన్న 568 కేసులతో పాటు, 210 ఈ పెట్టి కేసులను, 2149 డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర మోటార్ వెహికల్ చట్ట ఉల్లంఘన కేసులను పరిష్కరించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితుల ఖాతాల్లో నిలిపివేసిన రూ.25,79,883ను 103 కేసుల ద్వారా బాధితులకు కోర్టుల సమక్షంలో తిరిగి ఇప్పించడం జరిగిందని కమీషనర్ వివరించారు. ఈ లోక్ అదాలత్ నిర్వహణలో సహకరించిన న్యాయమూర్తులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, ప్రజలకు, కక్షిదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మృతి చెందిన సింగరేణి అద్దె వాహనాల యాజమానుల సంఘం అధ్యక్షులు తోట సమ్మయ్య కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేసిన రామగుండం ఏరియా 1 అద్దె వాహనాల యాజమానులు.సింగరేణి భూనిర్వాసితుడు రామగుండం ఏరియా 1 అద్దె వాహన యజమానుల ప్రెసిడెంట్ తోట సమ్మయ్య ఇటీవల అనారోగ్య కారణాలవల్ల అకాల మరణానికి చింతిస్తు పెద్ద కర్మ సందర్బంగా కుటుంబ సభ్యులకు రామగుండం ఏరియా1 ఓనర్స్ అసోసియేషన్ తరపున లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం సమ్మయ్య చిత్రపటం దగ్గర నివాళులు అర్పించి లక్ష రూపాయలు చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దెబ్బేట మల్లేష్,తోడేటి సదానందం,మారపెల్లి నవీన్,గొనె కుమార స్వామి,ఏలువాక సతీష్,కోయడ శంకర్,సుందిళ్ల నాగరాజు,వడ్లకొండ రాజు,గాదవీన రమేష్,శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## దిగువ మానేరు జలాశయం గేట్లు మూసివేత

**ప్రజాపక్షం/ముత్తారం :** కరీంనగర్ ఎల్ఎండి కి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో గేట్ల ద్వారా ఆదివారం ఉదయం 9 గంటల 30 నిమిషాలకు నీటి విడుదలను ఇరిగేషన్ అధికారులు నిలిపివేశారు. ఎగువ నుంచి మిడ్ మానేరు ద్వారా ఎల్ఎండీకి వస్తున్న ఇన్ఫ్లో‌లు కూడా పూర్తిగా నిలిపివేశారు. కాకతీయ కాలువ ద్వారా 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల కొనసాగుతుంది. ప్రస్తుతం ఎల్ఎండీలో 23.387 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# కట్టుదిట్టంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలు

కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం ఎంపిక చేసి రెండు నెలల శిక్షణ అనంతరం ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సర్వేయర్ల శిక్షణ పొందిన అభ్యర్థుల నిర్వహించిన పరీక్ష సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పర్యావేక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ సప్లమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్‌లో 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన పరీక్షల్లో 31మంది హాజరుకాగా, మధ్యాహ్నం 2గంటల నుండి 5 గంటలక వరకు నిర్వహించిన పరీక్షల్లో 52 మందికి 51మంది హాజరైనట్లు తెలిపారు. ఈ సప్లమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట సర్వేల్యాండ్ వినయ్‌కుమార్, డిఆర్ఓ నాగరాజమ్మ. డిగ్రీ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాచాపూర్ గ్రామానికి ఆర్‌టిసి బస్సును పునరుద్ధరించాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగేందర్

**ప్రజాపక్షం/శంకరపట్నం:** కాచాపూర్ గ్రామానికి కరీంనగర్, హుజురాబాద్ ఆర్టీసీ డిపో నుంచి బస్సు పునరుద్దరించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బావండ్లపెల్లి యుగేందర్ ఆద్వర్యంలో ఆదివారం విధ్యార్థులు, మహిళలతో కలిసి గ్రామ బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా యుగేందర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి కాచాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం నడుస్తుండగా 20 రోజుల క్రితం వర్షాల కారణంగా రోడ్డు బాగా లేదనే సాకుతో బస్సు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పట్టణ, మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గ్రామం నుంచి మోడల్ స్కూల్‌కు, కళాశాలలకు వెళ్లే విధ్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. వెంటనే రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే దృష్టి సారించి బస్సు వచ్చేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.



## మంత్రి పొన్నం కాన్వాయ్‌లో ప్రమాదం




**ప్రజాపక్షం/కొండపాక:** మంత్రి పొన్నం ప్రభాకర్ కాన్వాయ్‌లో ప్రమాదం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్లితే సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ వెళుతున్న క్రమంలో కాన్వాయ్‌లోని వాహనం కుకునూరుపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారి డివైడర్‌పైకి దూసుకెళ్లింది.సదరు వాహనం డివైడర్‌పై నుంచి సిద్దిపేట వైపు వెళ్లే రహదారిపై మళ్లింది.వాహనంలోని పొన్నం ప్రభాకర్ సహాయకుడు మంజూనాథ్, ఫోటో గ్రాఫర్, అటెండర్, గన్‌మెన్ సాంబశివరావులు ఉన్నారు.కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కార్ అక్కసు

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట నియోజకవర్గం అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిందని.. నేడు అభివృద్ధి అర్థాంతంగా ఆగిపోయిందని.. సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కార్ అక్కసు పెంచుకుందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. సిద్దిపేట అభివృద్ధిపై వివిధరాష్ట్రాల ప్రతినిధులు పాఠాలు నేర్చుకున్నారని..ప్రగతిపై ప్రయోగశాలగా నిలిచిందన్నారు. పదవులు ఉన్నా..లేకున్న ప్రజలకు నిత్యం జవాబుదారులుగా ఉంటామన్నారు. ఆదివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు కరోన సమయంలో చాల ఇబ్బందులు పడ్డారన్నారు. జర్నలిస్టులు బయటకు కనపడేంత హుందగా ఉండరని, లోన చాల కష్టాలు ఎదర్కోంటారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా జర్నలిస్టులకు అన్ని విధాల సహాయం చేశారన్నారు. కరోన సమయంలో తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండిఏ అనేక మంది జర్నలిస్టులను కాపాడుకున్నట్లు గుర్తుచేశారు. బిఆర్ఎస్ అధికారంలో సిద్దిపేట అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు సిద్దిపేట అభివృద్ధిని చూసేందుకు వచ్చారన్నారు. ఏన్నో రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడకు వచ్చి నేర్చుకొని వెళ్లారన్నారు. సిద్దిపేట అభివృద్ధికి పాఠం..ప్రగతికి ప్రయోగ శాల అని ప్రశంసించిన విషయాన్ని గుర్తుచేశారు. భారతదేశంలో చాలమంది ఇతరదేశాలవారు ఇబ్రహింపూర్‌కు వచ్చి చూసి వెళ్లినట్లు తెలిపారు. నాడు సిద్దిపేట అభివృద్ధిపై ఏన్నో విజయగాథలు అద్భుతంగా రాసారని, ఇప్పుడు అర్థాంతంగా ఆగిపోయిన పనులతో వెక్కిరిస్తున్నాయని. అర్థాంతంగా ఆగిన అభివృద్ధి సిద్దిపేటగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతిశ్రీనివాస్, బిఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి రాధకిషన్‌శర్మ.మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సిద్దిపేట నియోజక వర్గం జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోండి

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** పద్మనగర్‌లో ఇటీవల ప్రారంభించిన సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. అన్ని వసతులతో విశాలంగా ఉన్న మార్కెట్‌ను ప్రజలు సందర్శించి అన్ని రకాల వెజ్, నాన్ వెజ్ కొనుగోలుకు ఉపయోగించుకోవాలని , రోడ్లపై కొనుగోలు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు వాహనాల పార్కింగ్ తదితర ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. సమీకృత మార్కెట్‌లో అమ్మేవాళ్లకు, కొనుగోలు చేసేవారికి పార్కింగ్‌తో పాటు విశాలమైన ప్లాట్‌ఫామ్స్ , మరుగుదొడ్లు, అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కూరగాయల వ్యాపారులు, నాన్‌వెజ్ వ్యాపారులు రోడ్డుపై కాకుండా సమీకృత మార్కెట్‌లో అమ్మాలని నరేందర్ రెడ్డి సూచించారు.

# ప్రతి గడపకూ బిసిల భావజాలం



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** బిసిల బావజాలాన్ని ప్రతి గ్రామంలో గడప గడపకూ తీసుకెళ్లాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బిసి నేత సబ్బని వెంకట్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని పద్మశాలి ఫంక్షన్ హాలులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బిసి రాజ్యాధికార సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, విశిష్ట అతిధిగా సబ్బని వెంకట్ హాజరై బిసిలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా బిసిలు ఎంతో నష్టపోతున్నారని, ఇకనైనా మేల్కోవాల్సిన అవసరముందన్నారు. బిసిలు నష్టపోకుండా తమ హక్కులను సాధించే దిశగా పోరాటం చేయాలన్నారు. ఆత్మన్యూనత బావాన్ని వదిలి చైతన్యంతో పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇప్పటికే బిసిలలో చైతన్యం నింపడం కోసం వివిధ పుస్తకాలు ఆర్టికల్స్‌ను రాసినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా గ్రామ గ్రామాన గడప గడపన బిసి బావజాలాన్ని తీసుకువెళ్లినట్లు తెలిపారు. గతంలో హైదరాబాదులో తాజ్‌కృష్ణ హోటల్‌లో బిసిలందరూ కలిసి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వానికి కులగణన చేయాల్సిందిగా డిమాండ్ చేయడంతో సర్కారు దిగివచ్చిందన్నారు. అదే విధంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునేందుకు పోరాటం చేయాలన్నారు. బిసి రిజర్వేషన్ బిల్లును కేంద్రం 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. సబ్బని వెంకట్ మాట్లాడుతూ ఒక వ్యక్తికి పార్టీ అధ్యక్ష పదవి, ముఖ్యమంత్రి పదవి వస్తే బిసిలందరికీ న్యాయం జరగదని, మారుమూల పల్లెలో ఒక బిసి నాయకుడికి పదువులు లభిస్తేనే న్యాయం జరుగుతుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ అంశం రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌లో చేరిస్తేనే పార్టీలను, ప్రభుత్వాన్ని నమ్మగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఉరుమల్ల విశ్వం, ఎమ్మెల్సీ కంటెస్టెడ్ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, కరీంనగర్ జిల్లా బిసిఐఎఫ్ నాయకులు ఇప్పనపెల్లి సాంబాన్ తదితరులున్నారు.

# యూరియా కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణలో యూరియా కొరత, రైతులు పడుతున్న గోసకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం పెద్దపల్లిలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు 6.12లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం పంపించినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంవద్ద 1.76లక్షల యూరియా నిల్వలు ఉన్నాయని, అయినా యూరియా కొరత ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. రైతులకు యూరియా సరిగా సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారని నిలదీశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సైతం యూరియా అడిగిన రైతులకు బేడీలు వేసి జైళ్ళకు పంపించిన ఘనతను మూటగట్టుకుందని గుర్తు చేశారు. రైతుల కన్నీళ్ళతో కాలం వెళ్ళదీస్తున్న ఇరుపార్టీలకు ప్రజలు తగిన గుణపాటం చెప్తారని హెచ్చరించారు. ఇప్పటికైన ప్రభుత్వం మేల్కొని రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, జిఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కనుకుంట్ల జోగేందర్, బొడ్డుపల్లి కుమార్, పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాలలో అన్ని సదుపాయాలు



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయని ధర్మపురి ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి. రాజశేఖర్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కే. రాజ్ కుమార్ ఆదేశాలతో ఆదివారం వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. మెనూ ప్రకారం నాణ్యమైన పోషక పదార్థాలతో కూడిన భోజనం, అల్పాహారం, స్నాక్స్ విద్యార్థులకు అందించడంతో పాటు అతిగా సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసి వసతి గృహ సంక్షేమ అధికారులు రాజు, శేఖర్, సుధాకర్, శీరిష సిబ్బంది పాల్గొన్నారు.

# అదుపు తప్పితే అధఃపాతాళానికే!



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మర్రి చెరువు ప్రమాదకరంగా మారింది.అడవి శ్రీరాంపూర్ నుండి ఖమ్మంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చెరువు మట్టి తవ్వకాలు చేపట్టడంతో భారీ గుంతలు ఏర్పడడంతో నీటి నిలువలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఈ చెరువు అడవి శ్రీరాంపూర్ నుండి ఖమ్మం పల్లి వైపు వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో పాటు అడవి శ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అమ్రాబాద్ నుండి నిత్యం పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు ఇదే దారి గుండా కాలి నడకన రావలసిన పరిస్థితి ఉంది. ఆ ఊరుకి ఆనుకొని మర్రి చెరువు ఉన్నది. అయితే ఈ రహదారి మూలమలుపున ఈ చెరువు ఉండడంతో వాహనదారులు అదుపుతప్పితే పరలోకలకే అన్న చందంగా మారింది.అయితే పొరపాటున చిన్నపిల్లలు చెరువు లో పడితే మాత్రం ప్రాణపాయం సంభవించే అవకాశాలు ఉన్నాయి. బతుకమ్మ పండుగకు ముందే చెరువు చుట్టూ ఇనుప జాలి ఏర్పాటు చేయాలి* గ్రామానికి ఆనుకుని ఉన్న మర్రిచెరువు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. కానీ ఈ సంవత్సరం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తవ్వకాలు చేపట్టడంతో చెరువుల్లో నీటి సామర్థ్యం భారీగా పెరిగింది. అయితే సద్దుల బతుకమ్మ రోజున అంగరంగ వైభవంగా వేలాదిమంది గ్రామస్తులు సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఇదే ప్రాంతంలో జరుపుకుంటారు. పొరపాటున ఎవరైనా చెరువులో పడినట్లయితే ప్రాణానికి ప్రాణప్రాయం ముప్పు ఉంది. అందువల్ల ముందు చూపుతో అధికారులు స్పందించి గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు చుట్టూ ఇనుప జాలిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆర్చ్‌ఫార్మా యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం

యూనియన్ గౌరవ అధ్యక్షుడు మారెడ్డి రవీందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ పరిధిలోని ఆర్చ్ ఫార్మా కెమికల్ ఫ్యాక్టరీలో గత మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదం ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లేనని బిఆర్‌టియు ఆర్చ్ ఫార్మా గౌరవ అధ్యక్షుడు మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్చ్ ఫార్మాను మారెడ్డి రవీందర్‌రెడ్డి సందర్శించి ప్రమాదం ఎలా జరిగిందనే విషయాలను తెలుసుకొని,అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దసరా పండుగ తర్వాత మాజీ మంత్రి ఎంఎల్ఏ తన్నీరు హరీష్‌రావును ఫ్యాక్టరీకి తీసుకొచ్చి కార్మికుల సమస్యలను తెలుసుకొని,సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు నాయకులు,కార్మికులు తదితరులు పాల్గోన్నారు.



## ఎడపల్లి మండలంలో మిలాద్ ఉన్ నబీ నేపథ్యంలో ర్యాలీ

ప్రజాపక్షం/ఎడపల్లి:మిలాద్ ఉన్ నబీ నేపథ్యంలో ఆదివారం ఎడపల్లి మండలంలో ముస్లిం మైనార్టీలు భారీ ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీలో ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక జామ మసీదుల నుంచి నాయకులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ కొనసాగింది. స్థానిక దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వారికి షర్బత్ అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలువురు పాల్గొన్నారు. భద్రత చర్యలను బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, ఎస్ఐ ముత్యాల రమ తదితరులు పర్యవేక్షించారు.



## యువకుడిపై దాడి కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాపక్షం / తాండూర్ :తాండూరుకు చెందిన సృజన్ గౌడ్ అనే యువకుడిపై దాడి చేసిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి. కిరణ్ కుమార్ తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 5న ఐబి కేంద్రంలో సృజన్ గౌడ్‌పై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు సుభద్ర కాలనీకి చెందిన అనిల్, సాయి, రాజు, నరేశ్, హరి అనే ఐదుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిఖిల్ అనే నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ యువకులపై రౌడీ షీట్లు తెరుస్తామని ఎస్ఐ తెలిపారు.




## రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ జెండా ఆవిష్కరణ




ప్రజాపక్షం / బెల్లంపల్లి :భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా పట్టణం లోని స్టేషన్ రోడ్ కాలనీలో కామ్రేడ్ దాసరి తిరుపతి గౌడ్, అక్కపెల్లి బాబు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర సంగ్రామంలో కీలక పాత్ర పోషించిందని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు త్యాగం చేశారని, 3,000 గ్రామాలను విముక్తం చేసి భూమిలేని వారికి పదిలక్షల ఎకరాల భూమిని పంచారని తెలిపారు. ఈ చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని, బిజెపి రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలను అడ్డుకునేలా ప్రజలు చైతన్యం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బికెఎంయు జాతీయ సమితి సభ్యులు అక్కపెల్లి బాబు, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, డిఎస్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు డిఆర్ శ్రీధర్, బికేఎంయు జిల్లా కార్యదర్శి గుండ చంద్ర మాణిక్యం, రత్నం రాజు, దాసరి తిరుపతి గౌడ్, మంతెన రమేష్, బొంకూర్ రామచందర్, కొండపల్లి నరసయ్య, కె. తిరుపతి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కూచారంలో ఉచిత ఆరోగ్య శిబిరం



ప్రజాపక్షం/మనోహరాబాద్:ప్రజా నాయకులు దివంగత నేత కీర్తిశేషులు నాయిని రాజేంద్రప్రసాద్ గౌడ్ గారి 15వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్, నాయిని నందు గౌడ్ ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామంలో సీఎంఆర్ హాస్పటల్ వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్లు గ్రామ ప్రజలకు బిపి, షుగర్ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామ ప్రజలు వివిధ ఆరోగ్య సమస్యలను డాక్టర్లకు వివరించగా వారిని పరీక్షించి వాటికి సంబంధించిన మందులను ఉచితంగా అందజేసారు. ఇతర రోగ నిర్ధారణ పరీక్షలు అవసరం ఉన్న వారికి బుధవారం ప్రత్యేక బస్సు పెట్టి ఆసుపత్రికి తీసుకెళ్ళి అన్ని పరీక్షలు చేయించి, డాక్టర్లకు చూపించి మళ్ళీ కూచారం గ్రామానికి పంపిస్తామని సీఎంఆర్ హాస్పిటల్ మేనేజర్ జె దుర్గా ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి చోట ప్రజలు వైరల్ జ్వరాలు, ఇతర సమస్యలతో భాదపడుతున్నారని అందుకే సీఎంఆర్ ఆసుపత్రి సహకారంతో మా నాన్న వర్ధంతి సందర్భంగా ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. దాదాపు 200 మంది ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారని, ఇందుకు సహకరించిన సీఎంఆర్ ఆసుపత్రి చైర్మన్ గోపాల్ రెడ్డి,మేనేజర్ దుర్గా ప్రసాద్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అశోక్, వైష్ణవి, అనిల్, మాజీ సర్పంచ్లు నాయిని లక్ష్మీ నర్సింలు గౌడ్, విఠల్ యాదవ్, నాయకులు , సీఎంఆర్ ఆసుపత్రి సిబ్బంది , నేచర్ ఐకాన్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగుల క్రీడా వార్షికోత్సవం ప్రారంభం



ప్రజాపక్షం/మందమర్రి:సింగరేణి ఉద్యోగుల 61వ క్రీడా వార్షికోత్సవాన్ని ఆదివారం ఎల్లందు క్లబ్‌లో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్, డబ్ల్యుపిఎస్ అండ్ జిఎ అధ్యక్షులు ఎన్. రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, సింగరేణి క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. అనంతరం టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ వంటి ఇండోర్ ఆటలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మందమర్రి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, సిఎంఓ, ఎఐటియుసి మందమర్రి ఏరియా అధ్యక్షుడు రమేష్, పర్సనల్ మేనేజర్ డబ్ల్యుపిఎస్ అండ్ జిఎ ఎఎంఒ ఏరియా చీఫ్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్ పటేల్, జిఎం ఆఫీస్ సీనియర్ పిఒ, క్రీడల గౌరవ కార్యదర్శి ఎం. కార్తీక్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, డబ్ల్యుపిఎస్ అండ్ జిఎ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీను తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కళాశాల బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు

ప్రజాపక్షం/నిజామాబాద్ :రాష్ట్రంలో పెండింగ్‌లోని ఫీజు రీఎంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 15 నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ ఇంజినీరింగ్ కళాశాలలు చేస్తున్న నిరవధిక బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం అన్నారు. మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదలపై నిర్లక్ష్యం చేస్తూ ఫీజు రీఎంబర్సమెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని, రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చాక వెంటనే పెండింగ్‌లోని ఫీజు బకాయిలను విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలన్నారు. అటు ప్రైవేట్ కళాశాలలు సైతం ఫీజు బకాయిల విడుదల లేక కళాశాలల నిర్వహణ చేయలేక సిబ్బందికి జీతాలు ఇవ్వలేని స్థితిలో యాజమాన్యాలు ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి త వద్ద విద్యాశాఖ ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయించటంలో వైఫల్యం చెందడాన్ని ప్రభుత్వం వెంటనే కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి పెండింగ్ ఫీజు రీఎంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని రఘురాం డిమాండ్ చేశారు.

# వరి... వైరస్ వర్రీ

***వాతావరణ మార్పులతో ఆందోళనలో రైతన్న * సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారుల సూచన**

ప్రజాపక్షం/ఎడపల్లి:అల్పపీడనం, భారీ వర్షాల కారణంగా చోటుచేసుకున్న వాతావరణంలో మార్పులు వరి పంటకు శాపంగా మారాయి. వరి నాటిన దగ్గరి నుంచి తెగుళ్ల ఉధృతి అధికమైంది. ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టిన ప్రకృతి అనుకూలంగా లేకపోవడంతో పంట ఎదుగుదలలో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో రైతుల్లో ఆందోళన షురూ అయ్యింది. ఈ ఏడాది సాగునీటి కొరత లేకపోవడంతో నిజామాబాద్ జిల్లాలో 4లక్షల 36వేల ఎకరాల్లో వరి సాగు కాగా, ఎడపల్లి మండలంలో 12,700 ఎకరాల్లో వరి సాగైంది.

**వరికు అధికమైన తెగుళ్లు..**

ప్రస్తుతం వానాకాలంలో మొత్తం వరి విస్తీర్ణంలో 85శాతం సన్న రకాలు సాగయ్యాయి. వరుస భారీ వర్షాలు, ముసురుతో పాటు ఉష్ణోగ్రత్తల్లో వ్యత్యాసాలు, ఉక్కపోత వంటి కారణాలతో వరి సాగులో ఇబ్బందులు ఎదురయ్యాయి. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో జూన్‌లో నారు పోసుకొని జూలైలో నాటు వేసి పొలాలు వర్షాలకు ఏపుగా పెరగడంతో దోమ వ్యాప్తి, బూడిద తెగులు (బాక్టీరియా ఆకు ఎండు తెగులు) అధికమైంది. ఇప్పటికే రెండు నుంచి మూడు సార్లు ఖరీదైన పురుగు మందులు పిచికారి చేసిన వైరస్ నియంత్రణలో రాలేదని రైతులు వాపోతున్నారు. దోమతో పాటు మొగి పురుగు ఆశించడంతో దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు నెలలో ఆలస్యంగా సాగు చేసిన వరికి ప్రారంభం నుంచే పురుగు ఆశించింది. ఇప్పటి వరకు రెండు నుంచి మూడు సార్లు రైతులు పురుగు మందులు పిచికారి చేశారు. సాధారణ రసాయనిక మందులు పని చేయకపోవడంతో కొత్త రకం, ఖరీదైనవి పిచికారీ చేస్తుందన్నారు. ధర అధికంగా ఉండటంతో ఎకరానికి సుమారు రూ. 2,500 వరకు ఖర్చు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెలలో పంట చేతికొచ్చి జోరుగా కోతలు షురూ కానున్న నేపథ్యంలో ఇలాంటి తెగులు సోకి పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని, వాతావరణం అనుకూలిస్తే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**వరిలో సమస్యలు అధికమయ్యాయి**

మంగళ్పాహాడ్ రైతు, గంగారాజునాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తు న్నా.. నాటు దగ్గరి నుంచి తెగుళ్ల సమస్య అధికమైంది. దీనికి తోడు వాతావరణంలో పెను మార్పులు, అధిక వర్షాలు పంటలపై దుష్ప్రభావాలు చూపుతున్నారు. అగ్గి తెగులు, దోమ, మొగి వ్యాప్తితో పంట దెబ్బతింటోంది. సస్యరక్షణ చేపట్టాల్సి రావడంతో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. దిగుబడులు ఆశించిన మేర వచ్చేట్టు కనబడటం లేదు.

**అధికారంగా పురుగు మందుల వాడకంతో నష్టం... ఎడపల్లి ఏవో, సిద్ధి రామేశ్వర్**



రైతులు దశాబ్ధకాలంగా సేంద్రియ ఎరువులు వాడటం లేదు. పశువుల ఎరువుతో పాటు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము పంటలు రైతులు సాగు చేయడం లేదు. కేవలం అడుగు పిండితో పాటు నత్రజని ఎరువులు అధికంగా వాడటం వల్ల భూమిలో పోషక విలువలు తగ్గాయి. దీనికి తోడు వాతావరణంలో మార్పులు కారణంగా ప్రస్తుతం వరిలో తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. రైతులు ఇష్టానుసారంగా మందులు పిచ్చికారి చేయకుండా సస్య రక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశంలో చేర్చాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్




ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్:తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశంలో చేర్చాలని, బిజెపి ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మారుస్తు హిందూముస్లింల పోరాటంగా వక్రీకరిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అ న్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విలీన దినోత్సవా న్ని పురస్కరించుకొని సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 77వ తెలంగాణ సా యుధ రైతాంగ పోరాట వారోత్సవాల సం దర్భంగా ఈనెల 11 నుండి 16వరకు గ్రామ, మండల కేంద్రాల్లో పార్టీ జెండాలు ఎగురవేసి, సభలు నిర్వహిస్తు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విలీన దినోత్సవ చరిత్రను ప్రజలకు వివరిస్తున్నామని, సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగురవేసి తెలంగాణ సా యుధ రైతాంగ పోరాట యోధులను స్మరించుకోవాలన్నారు. 4500 మంది కమ్యూనిస్టుల ప్రాణ త్యాగంతో తెలంగాణ ప్రాంతం లో 10 లక్షల ఎకరాల భూమి నిరుపేదలకు పంపిణీ జరిగిందని, 3500 గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందాయని అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న నిజాం నవాబు భారత్‌లో విలీనం చే యడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం బిజెపి సాయుధ పోరాటచరిత్రను హిందు ముస్లిం పోరాటంగా వక్రీకరిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరపడంతో పాటు ఇట్టి చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బి. రఘురాం, రంజిత్, నగర నాయకులు సక్కి, సురేష్, అనిల్, దేవేందర్, సాయమ్మ, గంగామణి, ఫిరోజ్, భాను, శుభోదు, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసును ఛేదించిన పిట్లం పోలీసులు



ప్రజాపక్షం/పిట్లం:పిట్లం మండలంలో ఈనెల 11వ తేదీనా ఓ హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా ఎస్‌పిరాజేష్‌చంద్ర ఈ ఘటన గురించి ఆదివారం పిట్లం పోలీస్టేషన్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెళ్ళడించారు. ఈనెల 11న మధ్యాహ్నం 3 గం.లకు మాంజీరానదిలో గుర్తు తెలియని ఓ వృద్ధ మహిళ మృతదేహం కనిపించింది. దీంతో స దరు గ్రామపంచాయతీ కార్యదర్శి గంగుల శివాజీ ఫిర్యాదు మేరకు పిట్లం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించగా సదరు వృద్ధురాలి ఫొటోలు, సిసిటివిఫుటేజీలు సోషల్ మీడియా ద్వారా అందరికి చేరవేశారు. ఈనెల 12న బోర్లం గ్రామ పెద్దలు గ్రామానికి చెందిన ఎర్రోళ్ళ బాలయ్యను నీ తల్లిఆదివారం సాయవ్వ(77)ను తన ఆరోగ్యం బాగోలేదని, కూర్చున్నచోటే మలమూ త్ర విసర్జన చేస్తుందని, ఇల్లు వాసన వస్తుందని ఈ నెల 8న రాత్రి 9 గం.లకు తన బైక్‌పై బొల్లక్‌పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్ళి బ్రిడ్జిపై నుండి మాంజీరా నదిలోకి తోసివేసి హత్యచేసినట్లు తెలిపారు. ఆదివారం బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట చౌ రస్తా వద్ద నిందితులు ఎర్రోళ్ళ బాలయ్య, మరో వ్యక్తి బోర్లం నుండి కొయ్యగుట్టకు వస్తుండగా అ రెస్టు చేసి హత్యలో ఉపయోగించిన బైకు, రెండు సెల్‌ఫోన్లను సాధీనం చేసుకుని బాలయ్యను రిమా ండ్‌కు తరలించినట్లు, జువైనల్ బాలుని జువైనల్ అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ హత్య కేసును ఛేదించిన బాన్సువాడ డిఎస్‌పి విఠల్‌రెడ్డిని, వారి పర్యావేక్షణలో పనిచేసిన సిఐ తిరుపతయ్య, పిట్లం ఎస్‌ఐవెంకటరావును, సిబ్బంది జిల్లా ఎస్‌పి అభినందించారు.

## నిలిచిపోయిన బస్సు సర్వీసులు

ప్రజాపక్షం/నిజాంసాగర్: భారీ వర్షాల కారణంగా గత వారం, పదిహేను రోజులుగా ని జాంసాగర్ మండలంలో భారీ వర్షాలు కురిసి న నేపథ్యంలో మండలంలోని రోడ్లు, కల్వర్టులు, వంతెనలు పెద్ద మొత్తంలో చాలా చోట్ల దెబ్బతిన్నాయి. కోతలుకు గురయ్యాయి. ఈ మేరకు నిజాంసాగర్ కామారెడ్డి బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. లింగంపేట్ సమీప ంలో ఓ చిన్నపాటి వంతెన వర్షాలకు దెబ్బతినడంతో లారీలు, బస్సుల రాకపోకలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. ఈ రోడ్లకు కొంతమేరకు మరమ్మతులు పూర్తి చేసినప్పటికి బైకు లు, ఆటోలు, కార్లు మాత్రమే ఈ రోడ్డు గుం డా ప్రయాణిస్తున్నాయి. ఈ రూట్లలో ఒక్క బ స్సు సర్వీసు కూడా నడవకపోవడంతో ప్రయాణికులు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదురొ ్కంటున్నారు. దీనిని అదునుగా భావించిన కొందరు ఆటోలు, జీపుల ప్రైవేటు వాహనదారులు ప్ర యాణికులను నిలువునా దోచుకుంటున్నారు. వర్షాలు కురిసి 20 రోజులు గడిచినా నేటి వరకు సంబందిత ఆర్అండ్‌బి శా ఖ అధికారు లు పట్టింపు లేనట్లు వ్యవహారిస్తుండడంతో తమకు దూరభారంతో పాటు రె ట్టింపు డబ్బులు వ్యయభారం పడుతుందని ప్రయాణికులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇ ప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఆర్‌టిసి బస్సు సర్వీసులను కొనసాగించేలా తగు చర్యలు చే పట్టి ప్రయాణికులకు బస్సు సర్వీసులను వా డుకలోకి తీసుకురావాలనిమండలంలోని ఆ యా రూట్లలోప్ర యాణించే ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



## రైలు ఢీకొని రైతు మృతి

ప్రజాపక్షం/నిజామాబాద్:గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యవసా య రైతు మృ తి చెందిన ఘటన ఆదివారం చోటు చే సుకుంది. రై ల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన వి వరాలిలా ఉనాయి. ఇందల్వా యి మండలం గన్నారం గ్రామానికి చెందిన బద్దం రాజారెడ్డి కు మారుడుబద్దంరవీందర్‌రెడ్డి (46) కులం గురడికాపు, వృ త్తి :వ్ యవసాయ రైతు గ్రామశివారులోని రైలు పట్టాల పక్కన గల తన వ్య వసాయ భూమి వద్దకు వెళుతు న్న సమయంలో ఆదివారం తెల్లవారు జామున 4.40 గ ంటల కంటే ముందు ఇందల్వాయి సి ర్నాపల్లి రైల్వే స్టేషన్ల వద్ద గుర్తు తెలియని రైలు బండిరాకను గ మనించకు ం డారైలుపట్టా లుదాటుటకు ప్రయ త్నించగా ప్రమాదవ శాత్తు రైలు ఢీకొట్టగా త గిలిన గా యాల వల్ల అక్కడికక్కడే మరణించినట్లు తెలిపారు.ఈవిషయం లో ఆర్‌పిఎస్ నిజామాబాద్‌లో కే సు నమోదు చేసి హెడ్‌కానిస్టేబు ల్ హన్మాండ్లుపరిశోధనచేయనున్నట్లుతెలిపారు.



## కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో రైళ్ల నిలుపుదలతో ప్రజలకు ఎంతో మేలు

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు




ప్రజాపక్షం/కాగజ్‌నగర్‌రూరల్:కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో పలు కొత్త రైళ్ల నిలుపుదలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంద ని సిరూర్‌ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ట్రైన్ నెం. 12591 గోరఖ్‌పూర్ యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలును నూతనంగా నిలుపుదల ఇవ్వగా ఎమ్మెల్యే హరీష్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్, ఆదివారం యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, మ ంగళవారం పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్, గురువా రం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు కాగజ్‌నగర్ లో హాల్టింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ద సరా, దీపావళి ముందు ఈ రైళ్ల హాల్టింగుల తో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టెలికం అడ్వైజరీ కమిటి సభ్యులు ప్రభాకర్ గౌడ్, భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురా లు శ్రీదేవి, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభ ద్ర చారి, మాజీ కౌన్సిలర్ సింధం శ్రీనివాస్, అరుణ్ లోయ, చిలువేరు ప్రవీణ్, పవన్ బ ల్దేవ, ఎస్‌సి మోర్చా పట్టణ అధ్యక్షులు చిప్పకుర్తి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొ ండ తిరుపతి, మంజుల, పుష్పలత, చేరాల శ్రీనివాస్, చందు, అశోక్, ఆర్య, వి లాస్, సౌరబ్, సంతోష్, సాయి, అనిల్, అతి క్, పు రుషోత్తం,అధర్వ,తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదిక దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

సొమ్ము రికవరీ



ప్రజాపక్షం/బెల్లంపల్లి:తాళ్ళగురిజాల రైతు వేదికలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 1.90 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తాళ్ళగురిజాల రైతు వేదికలోని వీడియో కాన్ఫరెన్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి చెందిన 65 అంగుళాల ఎల్ఇడి టివి, రెండు సౌండ్ బాక్సులు, సిపియు, యాంప్లిఫయర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు జూలై 3న రాత్రి దొంగిలించారు. ఈ ఘటనపై ఎఇఒ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు నెలల విచారణ అనంతరం ఆదివారం మధ్యాహ్నం దొంగిలించిన వస్తువులను ఆటోలో తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో బెల్లంపల్లి రూరల్ సిఐ హనోక్ ఆధ్వర్యంలో తాళ్ళగురిజాల ఎస్ఐ రామకృష్ణ, ఎఎస్ఐ అలీ, పిసి అరుణ్ పోచమ్మగడ్డ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ఆటోలో దొంగిలించిన వస్తువులను గుర్తించి, అందులో ఉన్న మహమ్మద్ నసీం బేగ్, వర్మ శైలేష్ లను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. రైతు వేదిక తాళం పగులగొట్టి దొంగతనం చేసినట్లు తెలిపారు. దొంగిలించిన వస్తువులను జనకాపూర్‌లోని నసీం తాత ఇంటిలో దాచి ఉంచినట్లు వెల్లడించారు. అనంతరం, వాటిని అమ్మేందుకు బెల్లంపల్లికి తీసుకెళ్తుండగా పట్టుబడ్డారని పోలీసులు పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం బెల్లంపల్లి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

## విలువలే తన ఆస్తిగా బతికిన వ్యక్తి ముత్యాల మనోహర్ రెడ్డి

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్



ప్రజాపక్షం/మోర్తాడ్:సమాజమే తన కుటుంబంగా బ్రతికి, మంచి మాటలు మాట్లాడుతూ.. పది మందికి మంచి చెబుతూ అందరికీ ఆదర్శంగా నిలిచిన పాలెం గ్రామానికి చెందిన వ్యక్తి మనోహర్ రెడ్డి ని, ఆయన విలువలే తన ఆస్తిగా బ్రతికారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టి ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు అంటే మొదటిగా గుర్తొచ్చే పేరు నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామానికి చెందిన ముత్యాల మనోహర్ రెడ్డి అని పసుపు బోర్డు సాధనే లక్ష్యంగా తన జీవితకాలం తపస్సును చేసిన వ్యక్తి ఆయన అని అన్నారు. ఆయన మన మధ్య లేక సంవత్సర కాలం గడిచిపోయిందని ఆయన అన్నారు. మనోహర్ రెడ్డి జీవితం నుంచి ఈ కాలం యువత ఎన్నో పాఠాలను నేర్చుకోవాలని ఆయన కోరారు. ఆదివారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా పాలెం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాలెం గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పటిక లింగం ఏర్పాటుకు రూ.2.31లక్షల విరాళం



ప్రజాపక్షం/ఎడపల్లి:ఎడపల్లి మండలం జాన్కంపేట్ స్వయం భూలింగేశ్వర స్వామి నూతన ఆలయంలో నూతన స్పటిక లింగం ఏర్పాటు చేసేందుకు జాన్కంపేట్ గ్రామానికి చెందిన పూలపల్లి వీరేశం, పారుపల్లి సురేష్ లు సుమారు రూ. 2.31లక్షలు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆ ఆదిదేవుని అనుగ్రహం ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఉప్పు సురేష్, సంగారెడ్డి, నర్సింగ్ రావు, రాజేశ్వర్ తదితరులు ఉ న్నారు.

# క్రీడ

## వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ సాధించిన పతకాలు..

మీనాక్షి హుడా(మహిళల 48 కేజీల)- గోల్ మెడల్
జైస్మీన్ లాంబోరియా(మహిళల 57 కేజీలు)- గోల్ మెడల్
నుపుర్ షెరోన్(మహిళల 80+ కేజీలు)- సిల్వర్ మెడల్
పుజారాణి(మహిళల 80 కేజీలు)- సిల్వర్ మెడల్





# బాక్సింగ్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు!

వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు లభించాయి. జైస్మీన్ లాంబోరియా, మీనాక్షి హుడా విజేతగా నిలిచారు. ఆదివారం జరిగిన మహిళల 48 కిలోల విభాగం ఫైనల్లో మీనాక్షి హుడా 4–1 తేడాతో కజకిస్థాన్ ప్లేయర్ సజీమ్ కైజైబేపై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి వ్యూహాత్మకంగా ఆడిన మీనాక్షి ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా పంచ్‌లు విసిరి.. ఆధిపత్యం చెలాయించింది. ఈ బౌట్లో తన ఎత్తును అడ్వాంటేజ్‌గా మార్చుకుంది. బ్యాక్‌పుట్‌పై ఉంటూ ప్రత్యర్థిపై దాడి చేసింది. బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి పంచ్‌లను కాచుకుని విజయాన్ని సొంతం చేసుకుంది.

అంతకుముందు జరిగిన మహిళల 57 కేజీల విభాగంలో జైస్మీన్ లాంబోరియా 4–1 తేడాతో పోలండ్‌కు చెందిన జూలియాను ఓడించింది. మరోవైపు భారత్‌కు చెందిన నుపుర్ షెరోన్(80+ కేజీలు) సిల్వర్ మెడల్ సాధించగా.. పుజారాణి(80 కేజీలు) బ్రాంజ్ మెడల్ గెలిచింది. పురుషుల విభాగంలో ఈ సారి భారత్‌కు ఒక్క పతకం రాలేదు. 2013 తర్వాత పురుషుల విభాగంలో భారత్ ఒక్క పతకం కూడా సాధించకపోవడం ఇదే తొలిసారి.

**ఫైనల్ చేరిన జైస్మిన్, నుపుర్ :** భారత స్టార్ బాక్సర్, తెలుగు తేజం నిఖత్ జరీన్ పోరాటం మాత్రం క్వార్టర్స్‌లోనే ముగిసింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఈ మాజీ ఛాంపియన్ క్వార్టర్ ఫైనల్లో 0–5తో రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో చిత్తయింది. దాంతో పతకం లేకుండా నిఖత్ జరీన్ ఇంటిబాట పట్టింది. గత సారి (2023) 50 కిలోలు, అంతకుముందు (2022) 52 కిలోల విభాగాలలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి 51 కిలోల బరిలో దిగింది.





# అందుకే అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకోలేదు : సూర్యకుమార్ యాదవ్

ఆసియా కప్ 2025లో భాగంగా పాకిస్థాన్‌తో జరుగుతున్న హై ఓల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా టాస్ ఓడింది. కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘూ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపాడు. పిచ్ స్లో వికెట్‌గా కనిపిస్తుందని, భారీ లక్ష్యాన్ని నమోదు చేయాలనే వ్యూహంతోనే బ్యాటింగ్ ఎంచుకున్నానని వివరణ ఇచ్చాడు.

'మేం ముందుగా బ్యాటింగ్ చేస్తాం. గత కొద్ది రోజులుగా మేము మంచి క్రికెట్ ఆడుతున్నాం. ఈ మ్యాచ్ కోసం చాలా ఉత్సాహంగా ఉన్నాం. ఇది స్లో వికెట్లా కనిపిస్తోంది. ముందుగా బ్యాటింగ్ చేసి స్కోర్ బోర్డుపై భారీ లక్ష్యాన్ని ఉంచాలనుకుంటున్నాం. జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం. దాదాపు గత 20 రోజులుగా మేము ఇక్కడే ఉన్నాం. కాబట్టి ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడ్డాం. 'అని సల్మాన్ అలీ అఘూ చెప్పుకొచ్చాడు.

మరోవైపు టాస్ గెలిచినా బౌలింగ్ ఎంచుకునేవాడినని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. దాంతో టాస్ ఓడినా తాము కోరుకున్నదే దక్కిందని సంతోషం వ్యక్తం చేశాడు. 'మేము ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. టాస్ ఓడినా మేం కోరుకున్నదే దక్కినందుకు సంతోషంగా ఉంది.

గత మ్యాచ్‌లో ఈ పిచ్ పక్కనే ఉన్న వికెట్‌పై ఆడాం. అది మంచి వికెట్. రాత్రి పూట బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. వాతావరణం ఉక్కపోతగా ఉంది కాబట్టి మంచు కురుస్తుందని ఆశిస్తున్నాం. జట్టులో ఎలాంటి మార్పులు లేవు. విన్నింగ్ కాంబినేషన్‌తోనే బరిలోకి దిగుతున్నాం.'అని సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. విన్నింగ్ కాంబినేషన్‌తోనే కొనసాగించడంతోనే అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకోలేదనే విషయాన్ని సూర్య పరోక్షంగా తెలిపాడు.

**తుది జట్లు:**

**భారత్:** అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

**పాకిస్తాన్:** సైమ్ అయూబ్, సాహిబ్జాదా ఫర్హాన్, మొహమ్మద్ హారిస్ (వికెట్ కీపర్), ఫఖర్ జమాన్, సల్మాన్ ఆఘూ (కెప్టెన్), హసన్ నవాజ్, మొహమ్మద్ నవాజ్, ఫహీమ్ అష్రఫ్, షాహీన్ అఫ్రిది, సుఫియాన్ ముఖీమ్, అబ్రార్ అహ్మద్.


ఫోకస్

# ఆరోగ్యం

## మనిషికి వెన్నునొప్పి ఎందుకు వస్తుంది?

వెన్నునొప్పి ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణ వైద్య సమస్యల్లో ఒకటి. ఇది కేవలం చెడ్డ కూర్చునే తీరు లేదా ఎక్కువసేపు కుర్చీలో గడపడం వల్లే కాదు.... మనిషి పరిణామ క్రమంలో చేసిన చోటు చేసుకున్న ఒక ప్రత్యేకమైన పరివర్తన ఫలితమేనని శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు అంటున్నారు. మన పూర్వీకులు లక్షల సంవత్సరాల క్రితం జంతువుల్లా నాలుగు కాళ్ల మీద నడిచేవారు.

పరిణామక్రమంలో మనిషి రెండు కాళ్లపై నిటారుగా నడవడం అలవాటు చేసుకున్నాడు. ఈ మార్పు చేతులను స్వేచ్ఛగా ఉపయోగించే అవకాశం ఇచ్చింది. పనిముట్లు తయారు చేయడం, వేట చేయడం, వ్యవసాయం, సాంకేతికత ఇలా నాగరికత మొత్తం ఈ మార్పుపైనే ఆధారపడింది. కానీ ఈ విప్లవాత్మక మార్పు, 'వెన్నుముక మీద అతి ఎక్కువ ఒత్తిడి' అనే సమస్యను కూడా వెంట తెచ్చింది. వెన్నెముక మొదట నిటారుగా నడిచేలా రూపకల్పన కాలేదు. అది మొదట నాలుగు కాళ్లతో నడిచే జీవాలకు అనుకూలంగా ఉండేది. నిటారుగా నడవడం వలన 'S' ఆకారపు వక్రత ఏర్పడింది. ఇది శరీరాన్ని నిలబెట్టటానికి సహాయపడినా, ఒత్తిడి కొన్ని చోట్ల అధికమై వెన్నునొప్పికి దారితీస్తుంది. ఈ పరిణామ మార్పు వల్ల మనిషి మెదడు పెద్దదవడానికి, చేతులు స్వేచ్ఛ కలిగించడానికి అవకాశం దొరికిందికానీ, దాని బదులుగా తరతరాలకు వెన్నునొప్పి భాధ తప్పలేదు. ఈ సమస్యను ఆధునిక జీవన శైలి మరింతగా పెంచుతున్నది. కుర్చీల్లో ఎక్కువసేపు కూర్చోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తలకు మించిన బరువు మోసుకోవడం, తప్పుడు భంగిమలు ఇవన్నీ ఈ పరిణామంలో ఏర్పడిన బలహీనతను మరింత ముదిరిస్తాయి. ఆధునిక కాలంలో సెడెంటరీ లైఫ్ స్టైల్ (ఆలస్యపూరిత కూర్చునే జీవనశైలి) ఈ సమస్యను ప్రపంచ వ్యాప్తంగా పెంచుతోంది. ఏదిఏమైనా వెన్నునొప్పిని ఒక వైద్య సమస్యగా మాత్రమేగాక, ఒక జీవ సంబంధమైన మార్పు, జీవనశైలితో ముడిపడిన అంశంగా కూడా చూడాలి. వెన్నునొప్పి కథ అంటే కేవలం ఆరోగ్య సమస్య కాదని, మనిషి ఎవరమో చెప్పే పరిణామ గాథలో ఒక భాగం తెలుసుకోవాలి. మానవజాతి నేటి నాగరికతను, సాంకేతికతను పొందిన కారణం రెండు కాళ్లపై నడిచే సామర్థ్యమే. కానీ అదే సామర్థ్యం మనకు శాశ్వత సమస్యలా వెన్నునొప్పి రూపంలో ఎదురవుతోంది. ఇది పరిణామం ఇచ్చిన ఓ బహుమానం. ఓ శిక్ష.





## కిడ్నీవ్యాధికి ఉపయోగపడే మలబద్ధకం మందు!

సాధారణంగా మలబద్ధకానికి ఇచ్చే మందు కిడ్నీ వ్యాధుల చికిత్సకు పనికివస్తుందని అంటున్నారు జపాన్‌లోని టోహోకు యూనివర్సిటీ పరిశోధకులు. వారి ఆవిష్కరణను అనుసరించి, మలబద్ధకానికి ఇచ్చే లుబిప్రోస్టోన్ అనే ఔషధం, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి పెరగకుండా నిరోధిస్తుంది. ఫేజ్ II క్లినికల్ ట్రయల్లో 150 మంది రోగులపై పరీక్షలు చేశారు. ప్లాసిబో (నకిలీ మందు) వాడినవారితో పోలిస్తే, లుబిప్రోస్టోన్ వాడినవారి కిడ్నీ పనితీరు మెరుగుపడింది. దీర్ఘకాల మూత్రపిండ వ్యాధి చాలా సందర్భాల్లో కిడ్నీ ఫెయిల్యూర్‌కి దారితీస్తుంది, డయాలిసిస్ అవసరం అవుతుంది. నిజానికి, కిడ్నీని నేరుగా రక్షించే అనుమతిపొందిన మందులు ఇప్పటివరకు లేవు. ఈ పరిస్థితుల్లో జపాన్ పరిశోధకుల ఆవిష్కరణ వైద్య శాస్త్రంలో గొప్ప ముందడుగా పేర్కోవాలి. లుబిప్రోస్టోన్ మలబద్ధకం తగ్గించి, ఆంత్రము (గట్) ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని వలన స్పెర్మిడిన్ అనే సమ్మేళనం ఉత్పత్తి పెరుగుతుంది. ఈ సమ్మేళనం (శక్తి ఉత్పత్తి చేసే కణ భాగాలైన మైటోకాండ్రియాలను బలోపేతం చేస్తుంది. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఈ ప్రభావాలు కిడ్నీ దెబ్బతినకుండా అడ్డుకుంటాయి. ముఖ్యంగా ఎక్కువ డోస్ తీసుకున్నవారికి, కిడ్నీ రక్షణ ప్రభావం మరింతగా కనిపించింది, మొత్తం మీద మలబద్ధకానికి వాడే ఒక ఔషధం, మనిషిలో కిడ్నీలకు రక్షణ కలిగించగలదని మొట్టమొదటి సారి గుర్తించగలిగారు. ఫేజ్ II క్లినియల్ ట్రయల్స్ సత్ఫలితాలను ఇవ్వడంతో, పరిశోధకులు ఇప్పుడు ఫేజ్ III క్లినియల్ ట్రయల్స్‌కు రంగం సిద్ధం చేస్తున్నారు. వారి ప్రయోగాలు విజయవంతమైతే, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారికి ఎంతో ఊరట లభిస్తుంది.

## ఇంజక్షన్ రూపంలో జెల్!

నొప్పి ఉన్న ప్రాంతంలో పైపూతగా వాడే పెయిన్ బామ్ లేదా జెల్ త్వరలోనే ఇంజక్షన్ రూపంలో అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. జర్మనీ వైద్య శాస్త్రవేత్తలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలను అనుసరించి ఇంజక్షన్ రూపంలోని జెల్ నొప్పిని సమర్థవంతంగా నియంత్రిస్తుంది. ప్రత్యేకించి కీళ్ల నొప్పుల నుంచి త్వరగా ఉపశమనమిస్తుంది. ఈ జెల్‌ను జాయింట్‌లోకి ఇంజెక్ట్ చేసినప్పుడు, ఇది 'స్కాఫోల్డ్'గా పిలిచే ఒక సపోర్టివ్ స్ట్రక్చర్‌గా పనిచేస్తుంది. ఇందులో ప్రధానంగా హైయాలురోనిక్ యాసిడ్ కొలాజెన్ లేదా ఆధునిక హైడ్రోజెల్స్ వంటి పదార్థాలు ఉంటాయి. ఈ పదార్థాలు సహజ కార్టిలేజ్ నిర్మాణాన్ని పోలి ఉంటాయి, అందువల్ల శరీరం లోపల కణాలు కొత్త కార్టిలేజ్ ఏర్పరచుకునే విధంగా ప్రోత్సహిస్తాయి. ఇది కీళ్లలో క్యెల్స్ స్థిరపడడానికి, పెరగడానికి సహాయపడుతుంది. అప్పటికే ఉన్న ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే పదార్థాల ద్వారా సహజమైన ప్రాణశక్తిని పెంపొందింపచేస్తుంది. జర్మనీలో ఇప్పటికే క్లినికల్ ట్రయల్స్ మొదటిదశను పూర్తి చేసుకున్న ఈ ఇంజెక్షనబుల్ బయో యాక్టివ్ జెల్ నేరుగా లోనికి చొచ్చుకెళ్లి, కార్టిలేజ్ కణాలను ఉత్తేజపరుస్తాయి. ఫలితంగా మోకాళ్ల కదలికల్లో నొప్పి తగ్గుతుంది. కొందరు శాస్త్రవేత్తలు ఈ జెల్‌ను కుందేళ్ల మోకాళ్లలో ప్రయోగించగా, రెండు వారాల్లోనే మెరుగైన ఫలితాన్ని కనుగొన్నారు. ఈ ప్రయోగాల ద్వారా, జెల్‌ను సరిగ్గా ఇంజెక్ట్ చేసిన తర్వాత ఆ ప్రాంతంలో కొత్త కార్టిలేజ్ ఏర్పడుతుంది. వివిధ రకాల నొప్పులతో బాధపడేవారు, ప్రత్యేకించి వృద్ధులకు ఎంతో ఉపయోగపడే ఈ జెల్‌కు ఐరోపా వ్యాప్తంగా, 2026లో అనుమతి లభించనుందని సమాచారం. అదే జరిగితే, శస్త్రచికిత్స అవసరం లేకుండా, ఒకే ఇంజక్షన్‌తో సహజ కార్టిలేజ్ తిరిగి వస్తున్న ఫలితాలు పొందవచ్చు.

# ఎర్రజెండా నీడలోనే సాయుధ పోరాటం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

**ప్రజాపక్షం/నర్సంపేట :** ఎర్రజెండా నీడలోనే తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని, సాయుధ పోరాట హక్కులు కమ్యూనిస్టులకే దక్కుతాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నర్సంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఐ నర్సంపేట మండల కార్యదర్శి అయిత యాకయ్య అధ్యక్షత వహించగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణకు స్వాతంత్ర్యం రాలేదని, తెలంగాణతో పాటు కర్ణాటకలోని మూడు, మహారాష్ట్రలోని ఐదు జిల్లాలతో కలిసి తెలంగాణ హైదరాబాద్ సంస్థానం ఉండేదన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, సోయాబుల్లాఖాన్ వంటి అనేక మంది పోరాటం ఫలితంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం హిందువులకు వ్యతిరేకంగా జరిగిందని బిజెపి దొంగ మాటలు మాట్లాడుతుందన్నారు. హైదరాబాద్‌లో స్మృతి వనం ఏర్పాటు చేసి పోరాట యోధుల విగ్రహాలు ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర లిఖించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బాష్‌మియా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేష్, నాయకులు మియాపురం గోవర్ధన్, పాలక కవిత, పిట్టల సతీష్ గడ్డం, నాగరాజు, ఇల్లందుల సాంబయ్య, అక్కపెల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వరుడు, గడ్డం యాకయ్య, దండుగుల అశోక్, వడ్లకొండ యశోద, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట...

### సామాన్యులను సాయుధులను చేసిన పోరాటం

**కొణిజర్ల :** సామాన్యులను సాయుధులను చేసిన మహోత్తర పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. భూమి, భుక్తి, విముక్తితో పాటు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది యోధులు అమరులయ్యారని ఆయన తెలిపారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో సాయుధ తెలంగాణ పోరాట యోధుడు గడల సీతారామయ్య స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని హేమంతరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ అమరుల ఆశయాలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నిరంతర ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కొణిజర్లలో సాయుధ పోరాటయోధుడు దొండపాటి వెంకయ్య స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, పోటు కళావతి, మండల కార్యదర్శి గడల భాస్కర్ రావు, మండల నాయకులు స్వర్ణ రమేష్, మునిగ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు గడల సీతారామయ్య, యాసా శాంతకుమారి, సోమయ్య, తోటపల్లి సీతారాములు, ఎల్. గోపాలరావు, విష్ణుమూర్తి, సీతారాములు, బానోత్ రామయ్య, రాంబాబు, వెంకయ్య, అడపా బాబు, చింతల ఆదినారాయణ, యాసా కళావతి పాల్గొన్నారు.

### పోరాట యోధులను అందించిన పోరాటాల పురిటి గడ్డ పలివెల

**మునుగోడు :** దొరలు, భూస్వాములు, నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడడానికి యోధులను అందించిన పోరాటాల పురిటి గడ్డ పలివెల చరిత్ర మరువలేనిదని.. ఆ యోధుల చరిత్రను భావితరాలకు అందించే బాధ్యత అందరిపైన ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పలివెల గ్రామంలో సాయుధ పోరాట యోధులు కొండవీటి గురునాథరెడ్డి, కొండవీటి బచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డి విగ్రహాలకు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పలివెల గ్రామం నుండి బచ్చిరెడ్డి, గురునాథరెడి, గోస్కొండ పెద్దులు మరో 30 మంది పోరాట యోధులు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, అమరవీరుల కుటుంబసభ్యులు కొండవీటి సునీల్‌రెడ్డి, కొండవీటి రవీందర్‌రెడ్డి, కొండవీటి సురేందర్‌రెడ్డి, కొండవీటి శేఖర్‌రెడ్డి, సిపిఐ నాయకులు ఉప్పునుతుల రమేష్,మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాధగోని సాయిలు, ఈదులకంటి కైలాష్, గుబ్బ వెంకన్న, ఎండి జానీ, వరికుప్పల వెంకన్న, నాతి సత్తమ్మ, గోసుకొండ మల్లేష్, మాధగోని లింగయ్య, కట్కూరి లింగస్వామి, చాపల విప్లవ్, బొలుగురి వంశీకృష్ణ పాల్గొన్నారు.

### తెలంగాణ సాయధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

**భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని 17వ వార్డు న్యూగొల్లగూడెంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జమీదారీ వ్యవస్థ, దోపిడి, అన్యాయాలపై పేదరైతులు, కూలీలు ఏకమై పోరాడిన ఉద్యమమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమన్నారు. సాయుధ పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిలో నిలిచిపోయే విధంగా ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, మాజీ కౌన్సిలర్ కళ్యాణి, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, పురుషోత్తం, దుర్గ, అమన్, పుష్పలత, అస్మిత్, ముక్త్యార్, మల్లయ్య, పి రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

**హనుమకొండ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని అశోక జంక్షన్ వద్ద సిపిఐ సీనియర్ నాయకులు, అమరులు, బిఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద సిపిఐ మండల కార్యదర్శి యేషబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై కర్రె భిక్షపతి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరబోయిన కరుణాకర్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కార్యదర్శి కొట్టేపాక రవి, నాయకులు యాళ్ల సంజయ్, కండె నరసయ్య, పిలకల రాజు, ప్రభాకర్, చంద్రమౌళి, వినయ్ తదితరులు పాల్గొన్నారు

### పోరాట వారోత్సవాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**భూపాలపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో ఆదివారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎఐటియుసి కొమురయ్య భవన్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేసి నివాళులర్పించి వారోత్సవాల సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోటాపలుకుల రమేష్, పైల్ల శాంతికుమార్, అన్నారపు రాజేందర్, జి.శ్రీనివాస్, నూకల చంద్రమౌళి, నబి, నేరెళ్ల జోసఫ్, వేముల శ్రీకాంత్, తాళ్ల పోషం, పొన్నగంటి లావణ్య, గోలి లావణ్య, ఎండియాకూబ్, బౌతు కమలాకర్, గోనల తిరుపతి, పల్లెర్ల రజిత, మట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దాం

**మోటకొండూరు :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలలో అశువులు బాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం మోటకొండూర్ మండలంలోని మోటకొండూర్, కాటేపల్లి, ముత్తిరెడ్డిగూడెం, మాటూర్ గ్రామాలలో ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్లుగా పని చేసి నేలకొరిగిన రెడ్డిగట్టు శేషయ్య, శనిగరం సత్తయ్య, పేరెబోయిన రాజయ్య, కొమ్మగాని స్వామి, బండి జగన్నాథం, మచ్చ శ్రీహరి, ఎలగందుల శ్రీరాములు స్థూపాలకు పూలమాల లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేగు సిద్దయ్య, బండి అనసూయ, కొమ్మగాని లక్ష్మి లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, సహాయకార్యదర్శిలు ఆలేటి బాలరాజు, ముసుకు పెంటారెడ్డి, కార్యవర్గ సభ్యులు బోల్ల శ్రీనివాస్, బీరకాయల మల్లేష్, పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, పసుపుల నర్సింహా, రేగు సిద్దయ్య, జివిలికలపల్లి పాండు, బీరకాయల మధు, సూదగాని వెంకన్న, చొప్పరి సోములు, రేపాక నరసింహ, మచ్చ సూర్యనారాయణ, లక్ష్మీ నారాయణ, నల్ల రామ్‌లు, జివిలకలపల్లి గణేష్, రేపాక ఉమా, ఎండి యూసూబ్, బి.మంచాల పద్మ, దూశెట్టి అండాలు, ఆడపు లక్ష్మి , మంచాల సుగుణ, బండి అనసూయ, గొట్టిపాముల సునీల్ కుమార్, సిద్దుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


కొణిజర్ల..


మునుగోడు...



భద్రాద్రి...


భూపాలపల్లి...


మోటకొండూరు...


హనుమకొండ...



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఎప్పటికీ రాజీమార్గమే రాజమార్గం

### జిల్లా ఎస్పి కిరణ్ ఖరే

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జాతీయమెగాలోక్అదాలత్‌లో భాగంగా, భూపాలపల్లి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 1466 కేసులను పరిష్కరించామని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం తెలిపారు. ఈ కేసుల్లో ఇరు వర్గాలను రాజీ కుదిర్చి సమస్యలను సత్వర పరిష్కారం చేయడం జరిగిందని ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు న్యాయం చేయడం లోక్అదాలత్ ప్రధాన ఫలితం ఇచ్చిందని 15 సైబర్ క్రైమ్ కేసులలో రూ.88000మొత్తాన్ని తిరిగి సైబర్ బాధితుల ఖాతాల్లో జమ చేయడానికి సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు ఆర్డర్ కాపీలు పంపించడం జరిగిందన్నారు. బాధితులకు ఈ సహాయం ఒక పెద్ద ఉపశమనంగా నిలిచిందని వివరించారు. లోక్అదాలత్ అనేది క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకునే అద్భుతమైన వేదిక. చిన్న గొడవలు, వివాదాలు కోర్టుల్లో సంవత్సరాల తరబడి నిలవకుండా, ఇరు వర్గాలు రాజీ మార్గం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎప్పటికీ రాజీమార్గమే గొప్పదన్నారు.

## ఇద్దరు రైతులు మృతి యూరియా కోసం వెళుతూ ప్రమాదం



**ప్రజాపక్షం/మహబూబాబాద్/గూడూరు:** యూరియా కోసం వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జిల్లాలోని గూడూరు మండలం దుబ్బతండాకు చెందిన దారావత్ వీరన్న, బానోత్ లాల్య ఇద్దరు రైతులు యూరియా టోకెన్లకోసం ద్విచక్రవాహనంపై బొద్దగొండకు వస్తుండగా జగన్‌నాయకుల గూడెం స్టేజివద్ద ఆ ద్విచక్రవాహనాన్ని బొలేరా వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రైతుల మృతదేహాలను మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. దీంతో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హుటాహుటీన జిల్లా ఆసుపత్రికి చేరుకోగానే పెద్ద ఎత్తున రైతులు అక్కడ ధర్నాకు దిగడంతో వారితోపాటు మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ కూడా మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రి మార్చురీ ముందు మృతుల బంధువులతో కలిసి ఆందోళన చేపట్టారు.

## 'పరకాల' ప్రజల శ్రేయస్సే పరమావధి

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల:** పరకాలనియోజకవర్గ ప్రజల శ్రేయస్సే తన పరమావధిని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం పరకాల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరకాల నియోజకవర్గంలో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పరకాల నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని వివిధ గ్రామాలలోగల కుంటుపడిన అభివృద్ధి పనులను వేగవంతంచేసిఅక్కడిప్రజలకు అభివృద్ధి తాలూకు వివరాలను తెలియజేస్తూ ప్రజలను భాగస్వామ్యం చేస్తానని అన్నారు. గత పది సంవత్సరాలు పరకాలను భ్రష్టు పట్టించిన మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి అభివృద్ధిపై మాట్లాడడం విడ్డూరంగా ఉంది అన్నారు. ఏనాడు నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ధర్మారెడ్డి మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. తన పది సంవత్సరాల పదవీ కాలంలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చేశానని చెప్పటమే కానీ వాటి వల్ల ప్రజలకు జరిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. సుమారు 300 కోట్లకు పైగా తనకు లాభం వచ్చే పనులను చేసుకోవడం జరిగిందే కానీ ప్రజల ఇబ్బందులకు పరిష్కారాన్ని చూపించే పనులను ఒక్కటి చేయలేదన్నారు.అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు గాని ఇతరులు గాని ఒక్క రూపాయి వసూలు చేసిన రుజువులు చూపించినట్లైతే ఎలాంటి శిక్షకైనా సిద్ధమన్నారు. అర్థంపర్థం లేని ఆరోపణలు చేసే ముందుముందు వెనక ఆలోచించాలని అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పరకాలలో సుమారు 200కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనులను కొద్ది రోజులలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. వాటికి సంబంధించి టెండర్లు పూర్తి కావడం జరిగిందని ఆయన తెలిపారు.విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల చర్యలు చేపట్టిందన్నారు. ఏ నాడు రైతుల గురించి మాట్లాడని ధర్మారెడ్డి ఈరోజు రైతులపై ప్రేమ చూపించడం హాస్యస్పదమన్నారు. రైతులను బెదిరించి బేడీలు వేసిన టిఆర్ఎస్ ఈరోజు రైతులపైమోసపూరిత ప్రేమను నటిస్తుందన్నారు.రాష్ట్రంలోని తెలంగాణ ప్రభు త్వంపై ప్రజల్లో వ్యతిరేకతను తీసుకురావాలని ఉద్దేశంతో టిఆర్ఎస్, బిజెపి కావాలని యూరి యా కొరతను సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఏరోజైనా బిజెపిపై టిఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన నిలదీశారు. రైతులకు కావలసిన యూరియాను అందుబాటులో ఉంచే విధంగా అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నట్లు ఎమ్మె ల్యే రేవూరి తెలిపారు. పరకాల మండల పట్టణ అధ్యక్షులు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్య డ శ్రీనివాస్ ,ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరలేదని సొసైటీ చైర్మన్ల తొలగింపు

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**ప్రజాపక్షం/పరకాల :** కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నెపంతో సొసైటీ చైర్మన్లను తొలగించడం దుర్మార్గపు చర్య అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని పలువురు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్లతో సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్ట్ నెల 14వ తేదీన ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గ పదవి కాలం పొడిగించిన రోజు నుండే ఇతర పార్టీలకు చెందిన చైర్మన్లను కాంగ్రెస్ పార్టీలో చేరాలని అధికార పార్టీ నాయకులు,అధికారులు ఒత్తిడి తెచ్చిన పార్టీ మారని చైర్మన్లను పొంతనలేని సాకులతో తొలగించడం ఈ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు.ఎన్నికల ప్రచారంలో 2 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులు ఎవ్వరు చెల్లించద్దని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణాలు మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మి రైతులు రుణాలు చెల్లించకుండా ఉన్నారు.ఇప్పుడు అదే సొసైటీ పాలకర్గంలో 2 లక్షలలోపు అప్పు ఉన్న సభ్యులను రుణాలు బాకీ ఉన్నారని తొలగించడం విడ్డురంగా ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎంత మంది రైతులకు రుణాలు మంజూరు చేశారో తెలపాలని అన్నారు.దమ్ముంటే ఇప్పుడున్న పాలకవర్గాలను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని సవాలు విసిరారు.అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం అధికారులు పాలవర్గాలను బెదిరింపులకు పాల్పడడం సబబు కాదన్నారు.ఎన్నికల్లో గెలిచే సత్తాలేకనే పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు.ఓటమి భయంతోనే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఎన్నికలు నిర్వహించే దమ్ములేదు.వ్యవసాయానికి సరిపడా యూరియా అందివ్వలేని చేతకాని ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తాకడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లిలోని మిలీనియం క్వార్టర్స్ వెనక వైపు ఉన్న సింగరేణి కొత్త నర్సరీ మైదానంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మొక్క నాటి నీరు పోశారు. అనంతరం ప్రకృతి సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం 370 మొక్కలను ఒకేసారి నాటారు. ఈ సందర్భంగా బలరాంను ఎమ్మెల్యే సత్తన్న అభినందించారు. వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటివరకు 20వేల కు పైగా మొక్కలు నాటిన తొలి సివిల్ సర్వీసెస్ ఆఫీసర్ గా సింగరేణి సీ అండ్ ఎండి బలరాం రికార్డ్ సృష్టించారన్నారు. సింగరేణి జిఎం రాజేశ్వర్‌రెడ్డి, సింగరేణి అధికారులు మారుతి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, దాట్ల శ్రీనివాస్, శిరుప అనిల్ ఉన్నారు.

## బతుకమ్మకుంట పనులు వేగంగా చేయాలి



### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ జనగామ :** జనగామ పట్టణ ప్రజలకు అహ్లాదాన్ని ఇచ్చే బతుకమ్మ కుంట పనులు శరవేగంగా పూర్తి చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్ రెడ్డితో కలిసి బతుకమ్మ కుంటను పరిశీలించారు. కుంట పాత్రం, కట్టను పరిశీలించారు. చిల్డ్రన్ పార్కును పరిశీలించారు. కట్టపైన విద్యుత్ దీపాలు, అదే విధంగా బురద ప్రాంతంలో మట్టిపోయడం, యోగశాల తదితర వాటిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి, డిఇ రాజ్‌కుమార్‌లకు పలు సూచనలు చేశారు. అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామలోని బతుకమ్మ కుంట దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా నిధులు రావల్సి ఉన్నప్పటికి మున్సిపాల్టీకి పన్నుల ద్వారా వచ్చిన నిధులు కోటిన్నర రూపాయలతో బతుకమ్మ కుంటను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. లైటింగ్, చెరువు చుట్టు గ్రిల్స్, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్కు, వాటర్ ట్యాంక్ ఇలా పలు అభివృద్ధి పనులు చేయడం జరిందన్నారు. బతుకమ్మ కుంటలో చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయని, సద్దుల బతుకమ్మకు ముందే పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 21 పెద్దరామాస ఉన్నందున ఆ లోగా పనులన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఇంకా చేయాల్సినవి అనేకం ఉన్నాయని, వాటిపై సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రత్యేకంగా చర్చిస్తానన్నారు. జనగామ పట్టణంలోని డ్రైనేజీ, రోడ్ల సమస్యను తీర్చాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ప్రజల సహకారంతో జనగామ మున్సిపాల్టీని మరింత అందంగా తీర్చిదిద్దడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని, ప్రభుత్వం నుండి నిధులు తెప్పిస్తామన్నారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పోకల జమున, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బండ యాదగిరిరెడ్డి పట్టణ అధ్యక్షులు తాళ్ల సురేష్ రెడ్డి, రాందయాకర్, వాంకుడోతు అనిత, రాంచందర్, తిప్పారపు విజయ్, జైన రమేష్, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ పులి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అండగా కాంగ్రెస్



**ప్రజాపక్షం/ములుగు:** కాంగ్రెస్‌ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉంటుందని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సబ్ జూనియర్ బాలురు, బాలికల జట్ల ఎంపికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ములుగు జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పైడాకుల అశోక్ పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా నుండి కబడ్డీ క్రీడాకారులకు మంత్రి సీతక్క నుండి గాని జిల్లా అసోసియేషన్ తరుపున గాని, తమ స్వంతంగా గానీ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ జట్ల ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ములుగు జిల్లాకు మంచి పేరు తెచ్చి మంత్రి సీతక్కకు బహుమతిగా నిలవాలని క్రీడాకారులకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చింత కృష్ణ, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కట్టేకోళ్ల వెంకటేష్ యాదవ్, అసోసియేషన్ బాధ్యులు గోరు రాజయ్య, మద్దెల నవీన్, అసోసియేషన్ సభ్యులు కన్నం మహేందర్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## 22న సాయి శివానీ వెల్ఫేర్, కల్చరల్ సొసైటీ 24వ వార్షికోత్సవం



**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :** ఈ నెల 22న సాయి శివాని వెల్ఫేర్ అండ్ కల్చరల్ సొసైటీ 24వ వార్షికోత్సవ సందర్భంగా 23 వసంతాలు ముగించుకొని 24వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్టత పొందిన మహిళలకు నేషనల్ అవార్డు ఇవ్వడం జరుగుతుందని లయన్ డాక్టర్ పద్మజాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాజకీయ నాయకులు, సినీ ఇండస్ట్రీ సంబంధించిన వారు రావడం జరుగుతుందని అన్నారు. గత సంవత్సరం 111 ఎన్జీవో సంఘాలకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఈ సంవత్సరం 111 మంది మహిళలను గుర్తించి వావ్ ( వండర్ఫుల్ ఉమెన్ ) అవార్డు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఆరోజు ఉదయం ఉమెన్ రాంప్ వాక్ , బతుకమ్మ సెలబ్రేషన్స్, అవార్డుల ప్రధానోత్సవం ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సందీప్ గౌడ్ , మౌనిక గౌడ్, హేమ, హేమలత, సమతా, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి





**ప్రజాపక్షం/హనుమకొండ :** మహాత్మా గాంధీ జీవితం, సిద్ధాంతాలు, మార్గదర్శనాన్ని ప్రస్తుత తరానికి పరిచయం చేసేందుకు చేపట్టిన "లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన"కు సంబంధించిన పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం నాడు బాలసముద్రం లోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్లోబల్ గాంధీ ఫెడరేషన్ నుండి వచ్చిన నిర్వాహకులు, అక్టోబర్ 10, 11, 12, 13 తేదీలలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగబోయే మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సు, స్వదేశీ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు.ఈసందర్భంగా మాట్లాడిన ఎమ్మె ల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మహాత్ముడు చూపిన శాంతి, అహింస, స్వదేశీ మార్గాలు ఈరోజు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. గాంధీ సిద్ధాంతాలను యువతకు చేరవేయడానికి ఇలాంటి కార్యక్రమాలు బహుళంగా నిర్వహించాలని, లక్ష గాంధీజీల విగ్రహాల ప్రదర్శన అనేది ఒక సాంస్కృతిక, సమాజ మార్పు కాంక్షతో కూడిన విప్లవాత్మక ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్, యువజనవిభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసి సాయి చంద్, యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్‌రెడ్డి, హనుమకొండ అధ్యక్షులు సాగర్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,యూత్ ప్రెసిడెంట్ సంజయ్‌రెడ్డి, నాయకులు రాజకుమార్, ప్రశాంత్, సతీష్ అరుణ్, సంతోష్,దొర బాబు, సతీష్, సోమేశ్, స్థానికులు, తదితరులు ఉన్నారు.

## మెరుగైన ఆరోగ్య సేవలు

**ప్రజాపక్షం/జనగామ :** మహిళలు, పిల్లలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం కోసం స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ ఒక ప్రకటన చేస్తూ స్వస్త్ నారి, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జరుగుతుందని, ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేసి మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికికార్యక్రమం రూపొందించి ముఖ్యమైనసేవలు అందించడం జరుగుతుందన్నారు.అక్టోబర్ 1న రక్తదానం నిర్వహించి 1 లక్షల యూనిట్ల రక్త సేకరణ కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు.

## సూరారం కాలువకు మరమ్మతులు



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** సూరారం కెనాల్ కాలువకు స్టేషన్‌ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య ఆధ్వర్యంలో మరమ్మత్తులు పనులు నిర్వహించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ కాలువకు వెంటనే జేసీబీతో మట్టిని తొలగించి మరమ్మత్తులు చేసి ఇప్పగూడెం కాలువ ద్వారా సూరారం గ్రామానికి నీటిని విడుదల చేయడానికి అవసరమైన పనులను చేయించామన్నారు. ఇప్పగూడెం కెనాల్ కాలువ ద్వారా సూరారం గ్రామానికి నీళ్లు వస్తాయని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## రామప్ప సన్నిధిలో అమెరికా దేశస్థులు



**ప్రజాపక్షం/వెంకటపూర్:** మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను అమెరికా దేశానికి చెందిన బ్రాడ్, రాచెల్ లు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులుహరిశ్ శర్మ, ఉమాశంకర్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళా ప్రాముఖ్యత గురించి స్టేట్ టూరిస్ట్ గైడ్ శశి, టూరిజం గైడ్ విజయ్ కుమార్ లు వివరించారు అనంతరం రామప్ప చెరువు ను సందర్శించారు.

## వికలాంగ విద్యార్థిపై ఎబివిపి కార్యకర్తల దాడి



### కెయులో విద్యార్థుల ఆందోళన
### వర్సిటీలో ఉద్రిక్త వాతావరణం

**ప్రజాపక్షం/కేయూక్యాంపస్ :** కేయూలో వికలాంగుడైన విద్యార్థిపై ఎబివిపి కార్యకర్తలు దాడి చేయడంతో యూనివర్సిటీ గెస్ట్ హౌస్ వద్ద విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీంతో కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాజీపేట ఎసిపిప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కాకతీయ యూనివర్సిటీకి చేరుకుని వారిని శాంతింపజేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాలలోకి వెళితే కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి వికలాంగుడైన... ఎంబీఏ డిపార్ట్మెంట్‌కు చెందిన విద్యార్థి గజేంద్ర అనే వ్యక్తి కాకతీయ యూనివర్సిటీలో రాత్రి భోజనం చేసి తిరిగి హాస్టల్ కి వెళ్తున్న క్రమంలోయూనివర్సిటీ మార్గంలో ఉన్న గెస్ట్ హౌస్ ఎదురుగా ఏబీవీపీకి చెందిన కొంత మంది వ్యక్తులు మద్యం సేవిస్తూ.. గజేంద్రను అడ్డు కొనిదుర్భాషలాడారు. ఇక్కడికి రారా అనగా... ఏంటి బ్రో చెప్పండి అని వికలాంగుడైన విద్యార్థి అనడంతో... బ్రో ఎవడురా...నీకు అన్న అని అనాలని వికలాంగుడైన గజేంద్రపై పిడిగుద్దులవర్షం కురిపించారు. వెంటనే అప్రమత్తమైన వికలాంగుడైన గజేంద్ర తన స్నేహితులకు సమాచారం అందించారు. యూనివర్సిటీ గెస్ట్‌హౌస్ వద్ద ఆందోళన దిగారు. గొడవ జరుగుతుందని సమాచారం అందుకున్న యూనివర్సిటీ పోలీసులుఅప్రమత్తమై... హనుమకొండ, సుబేదారి పోలీసులు రంగంలో దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఏబీవీపీకి చెందిన కొంతమంది విద్యార్థులు.. యూనివర్సిటీలో చదువు అయిపోయినా.. యూనివర్సిటీలోనే ఉంటూ.. ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని యూనివర్సిటీ లోని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

## శివానీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం




**ప్రజాపక్షం / హసన్ పర్తి :** శివాని విద్యాసంస్థల ఆధ్వర్యంలో చింతగట్టు నందు గల యంటిఆర్ గార్డెన్‌లో ద్వితీయ సంవత్సర విద్యార్థిని విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు పేరెంట్స్ మీటింగ్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీవీ యాంకర్, కార్పొరేట్ మోటివేటర్ కె.వి ప్రదీప్ హాజరు కావడం జరిగింది. ఈ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ నిజమైన గెలుపు అపజయాలను అధిగమించినప్పుడు వస్తుందని,అదే విధముగా ప్రతి కఠిన పరిస్థితి నీ బలం పరీక్షించడానికి వస్తుందని, ప్రతి అనుభవం నీకు పాఠం, ప్రతి కష్టం నీకు గెలుపు పునాది అవుతుందన్నారు. మీ కష్టం మీ గెలుపుకి దారి అని, మీ ఆశయం మీకు దిక్సూచి అని చెప్పడం జరిగింది.కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ తాళ్ళపల్లి స్వామి మాట్లాడుతూ ఒక సారి గెలవాలన్న సంకల్పం మనసులో పెనవేసుకుంటే, విజయానికి మరింత సమయం ఉందని, జీవితంలో ప్రతి క్షణం, నిన్ను ముందుకు నడిపించే గెలుపు నీకు ఎదురు చూస్తుందన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను, అధ్యాపకులను అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లు, డైరెక్టర్లు పాల్గొని అత్యున్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివాని కాలేజ్ ముఖ్యులు జి.సురేందర్ రెడ్డి, వి.చంద్రమోహన్, రమేష్, టి.రాజకుమార్,మురళీధర్, సంతోషరెడ్డి పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## గుడి నిర్మాణానికి లక్ష విరాళం

ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని పూసుగూడెం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయం నిర్మాణం చేపడుతున్నారు. ఎన్నారై తాండ్ర వెంకటేశ్వరరావు ఆదివారం లక్షల రూపాయల విరాళాన్ని ట్రస్ట్ కమిటీ సభ్యులు నరాటి ప్రసాద్, తాండ్ర బుచ్చిబాబు, కొదుమూరి పుల్లారావు చేతుల మీదుగా ఆలయ కమిటీ అధ్యక్షులు బండికట్ల ప్రభాకర్ చారీకి అందజేశారు. ఈసందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారు భవిష్యవాణి ద్వారా ఈ ప్రపంచంలో జరగబోతున్నటు వంటి జ్ఞాన దృష్టి ద్వారా సమాజానికి తెలియజేశారని, స్వార్థం లేని మనిషిగా జీవించి జీవ సమాధి కాబడిన శ్రీపోతూలూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ములకలపల్లి మండలంలో చేపట్టడం అభినందనీయమని తాండ్ర వెంకటేశ్వరరావు తెలియజేసినట్లు ట్రస్ట్ బాధ్యులు నరాటి ప్రసాద్ తెలిపారు.



## ప్రశాంతంగా లైసెన్స్ సర్వేయర్ సప్లమెంటరీ పరీక్షలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం ఎస్ఆర్అండ్బిజిఎన్ఆర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం సెషన్లో నిర్వహించిన థియరీ పరీక్షకు 129 మంది అభ్యర్థులకు 128 మంది అభ్యర్థులు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్లాటింగ్ పరీక్షకు 205 మంది అభ్యర్థులకు గాను 202 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, సిపివో ఎ. శ్రీనివాసులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

## షెడ్యూల్ క్యాస్ట్ ఏరియాలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి




ప్రజాపక్షం/చంద్రుగొండ: షెడ్యూల్ క్యాస్ట్ ఏరియాలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ పెద్దిని వేణు అన్నారు. ఆదివారం స్థానిక సమస్యలు ఉన్న దగ్గరే కూర్చోని నిరసన తెలియజేశారు. పాలకులు నిధులు కేటాయింపు చేస్తున్నారని, ఒక పక్క చెబుతూనే దళిత కాలనీలలో సమస్యలు ఉన్నాయని, గుర్రాయిగూడెం రోడ్డు, వాడపల్లి వారి వీధి, దడిగల దుర్గమ్మ గారి వీధి డ్రైనేజీకి ఎత్తుగా పోయడం జరిగిందని దానికి ఇరువైపులా వాహనాలు రావడానికి పోవడానికి ఇబ్బందిగా ఉందని, కొంత మంది బండ్లపై నుండి క్రింద పడి దెబ్బలు కూడా తగిలాయని, వెంటనే దానికి ఇరువైపులా కాంక్రీట్తో నింపాలని, డ్రైనేజీ నిర్మాణం చేసినప్పటికీ డ్రైనేజీలో నుండి చుక్క నీరు కూడా పోవట్లేదని, వర్షం వస్తే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రాయి రాజ పాల్గొన్నారు.

## పదవీవిరమణ బెన్ఫిట్స్ను విడుదల చేయండి



ప్రజాపక్షం/ ఖమ్మం : ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పదవి విరమణ అనంతరం వచ్చే బెన్ఫిట్స్ను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. జేఏసి సమావేశం ఆదివారం రిక్కాబజార్ హైస్కూల్లో సింగారపు జయరాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ మార్చి 2024 నుండి ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కమిటేషన్, గ్రాట్యూటి, న్యూ శాలరీ, జిఐఎస్, ఈఎల్ఎన్ క్యాష్మెంట్స్, పిఆర్సి ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ప్రతినెల రూ. 700 కోట్లు పెండింగ్ బిల్లులకు చెల్లిస్తుందని వాటిలో ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రత్యేక కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దశల వారీగా ఆందోళనకు సిద్ధమవుతామని వారు తెలిపారు. ఈ సమావేశంలో రాంచందర్ రావు, శాంతయ్య, ఆది నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థినికి సన్మానం



ప్రజాపక్షం/ కొణిజర్ల : తనికెళ్ల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థినిని ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు. గ్రామానికి చెందిన మేకల కొమరయ్య అలివేలు దంపతుల కుమార్తె మేకల లావణ్య సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్రెడిట్ ఆఫీసర్గా నియామకమైంది. పదవ తరగతిలో తనికెళ్ల ఉన్నత పాఠశాలలో లావణ్యకు విద్య నేర్పిన గురువులు మాచినేని మధుసూదన్రావు, రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు లావణ్యను సన్మానించి అభినందించారు. ఈ విజయం ఎంతో మంది బాలికలకు ప్రేరణ కలిగిస్తుందని గురువులు ఆకాంక్షించారు. లావణ్యను ప్రోత్సహించిన అక్క, బావ లను, తండ్రి లేకపోయిన కష్టపడి చదివించిన తల్లిని అభినందించారు.

## డిస్ట్రిక్ట్ ప్రోగ్రామింగ్ యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రఘురాం



ప్రజాపక్షం/కల్లూరు: నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న డిస్టిక్ ప్రోగ్రామింగ్ యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఖమ్మం జిల్లా కల్లూరూ మండలం చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన నామ రఘురాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ లో జరిగిన డిస్టిక్ ప్రోగ్రామింగ్ యూనిటీ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలో రఘురామును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. 2018 వ సంవత్సరంలో నేషనల్ హెల్త్ మిషన్ నందు డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబలైసర్ గా నియమితులైన రఘురాం ఎల్లవేళలా కృషి చేస్తామని, అందరిని కలుపుకునే ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# కార్మిక సమస్యలు పరిష్కారమయ్యే వరకూ బంద్

### సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు
### యాజమాన్యాన్ని తప్పుదోవ పట్టిస్తున్న సర్కారు సంఘం
### ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఏఐటియూసి నాయకత్వం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి యాజమాన్యం ఒప్పందం ప్రకారం అమలు కోసం ఎలాంటి సర్క్యులర్ జారీ చేయక పోవడం దుర్మార్గమని, సమస్యలు పరిష్కరించేత వరకు సింగరేణి స్ట్రక్చర్ కమిటీ సమావేశాలకు ఏఐటీయూసీ హాజరు కాదని, అందుకే 12 వ తేది హైదరాబాద్లో జరిగిన సమావేశాన్ని బహిష్కరించామని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగవెంకట్, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి వీరస్వామి అన్నారు. ఆదివారం స్థానిక శేషగిరి భవన్లో జరిగిన ఏఐటీయూసీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచిన అనంతరం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు యాజమాన్యానికి లేఖ రాసినట్లు చెప్పారు. దీనిపై ఇప్పటి వరకు రెండు సార్లు డైరెక్టర్ పా స్థాయి, ఒక సారి సి అండ్ ఎండి స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు జరిగాయని అందులో కొన్ని సమస్యల పరిష్కారానికి అంగీకారం తెలిపిన యాజమాన్యం ఎందుకు సర్క్యులర్ జారీ చేయలేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం కాలేదని కొన్ని సంఘాలు పనిగట్టుకుని ఏఐటీయూసీపై అనవసరపు విమర్శలు చేస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం సంఘం ఐఎన్టీయూసీ సమస్యలు పరిష్కారం కాకుండా యాజమాన్యం, అధికారులపై బెదిరింపులకు పాల్పడుతూ ఏఐటీయూసీపై బురదచల్లుతోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సింగరేణి యాజమాన్యంపై ఐఎన్టీయూసీ నాయకులు ఒత్తిడి చేయడం వల్ల సమస్యలు పరిష్కారాం కావడం లేదని విమర్శించారు. ప్రధానంగా సింగరేణిలో కొత్తగనులు రావడం కోసం, కార్మికుల సొంతింటి పథకం కోసం, మారుపేర్లు, విజిలెన్స్ కేసులతో పాటు తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఏఐటీయూసీపై కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. సింగరేణిలో ఎవరు ఎన్నికుట్రలు పన్నినా కార్మికల అండతో పోరాటాలు, ఉధ్యమాలు చేసి హక్కులు సాధించే దమ్ము, ధైర్యం ఒక్క ఏఐటీయూసీకే ఉందని వారు స్పష్టం చేశారు. వెంటనే మొత్తం లాభాన్ని ప్రకటించి వాటిపై కార్మికులకు 35 శాతం లాభాల వాట ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని ఏఐటీయూసీ సమ్మెకు పిలుపునిస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసి నాయకులు, బ్రాంచ్ కార్యదర్శి ఎస్వి రమణమూర్తి, కొత్తగూడెం బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, కార్పోరేట్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి సామల రాము, ఉపాధ్యక్షులు కేడబ్ల్యూ క్రిష్టాఫర్, ఆఫీస్ బేరర్స్ నాగయ్య, ఎస్కే హ్యూమయన్, సందెబోయిన శ్రీను, బండారి మల్లయ్య, పిట్ కార్యదర్శులు అనంత లక్ష్మి, జే రమేష్, రామ్, శంకర్, నరేష్, రాజేశ్వరరావు, వేమన చారి సత్యనారాయణ, బ్రహ్మచారి, నర్సింహా, శ్యామ్కుమార్, పల్నాటి ప్రశాంత్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి

### జాతీయ రహదారుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి కావడానికి మిగులు భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో జాతీయ రహదారుల నిర్మాణ పురోగతిపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం దేవరపల్లి, నాగపూర్ అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం దేవరపల్లి రహదారికి ధంసలాపురం వద్ద ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ల కొరకు 6.22 ఎకరాల భూ సేకరణ చేయాలన్నారు. అందులో 3.16 ఎకరాలకు ఇప్పటికే అవార్డు పాస్ చేసినట్లు, మిగిలిన 3.06 ఎకరాలకు భూ సేకరణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. మేజర్ బ్రిడ్జి, వియుపిలు నవంబర్లోగా, ఆర్వోబి డిసెంబర్ లోగా పూర్తి చేయాలన్నారు. కొదుమూరు వద్ద 400 కెవి ఈహెచ్టి షిఫ్టింగ్ పనులు రెవెన్యూ, విద్యుత్ శాఖాధికారులు సమావేశమై పూర్తి చేయాలన్నారు. నాగపూర్ అమరావతి ప్యాకేజీ 1, 2 భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ లోగా పరిహారం చెల్లింపు పూర్తి చేసి భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఎన్హెచ్ఏఐ పిడిలు రామాంజనేయ రెడ్డి, దివ్య, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 4625 కేసులు పరిష్కారం సిపి సునిల్దత్

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : జిల్లా వ్యాప్తంగా జాతీయలోక్ అదాలత్కు వి శేష స్పందన లభించిందని వీటి ద్వారా 4625 కేసులు పరిష్కారం అయ్యాయని పోలీసు కమిషనర్ సునిల్దత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సైబర్క్రైం కేసుల్లో 52 లక్షలరూపాయలకు పైగా రిఫండ్ మొత్తాన్ని భాదితులకు అందజేయడం జరిగిందన్నారు. దీనిలో రా జీకి అవకాశం ఉన్న 712 ఎఫ్ఐఆర్ కేసులు, పెట్టి కేసులు 775, డ్రం క్అండ్డ్రైవ్ కేసులు 2972, మైనర్ డ్రైవింగ్ కేసు లు 8, సైబర్ నేరాలపై నమోదైన కేసులు 158 లోక్అదాలత్లో పరిష్కారం అయ్యాయని వీటి ద్వారా రూ. 52,11,246 లక్షలు బాధితులకు అందజేయడం జరిగిందని వెల్లడించారు. కేసుల పరిష్కారానికి కృషిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్అదాలత్ను వినియోగించుకున్న కక్షిదారులు, సహకరించిన న్యాయవాదులు, న్యాయసేవాధికారులకు ఆయన కృతజ్ఞాతలు తెలిపారు.

# జియోథర్మల్ ప్రాజెక్టు ను పరిశీలించిన ప్లానింగ్ అధికారి



డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, ఓఎన్జిసి డైరెక్టర్ ఆఫ్ జనరల్ సునీల్ కుమార్, జనరల్ మేనేజర్ ఎస్ఎస్. మాయల్, జనరల్ మేనేజర్ కిరణ్ తో కలిసి ఆదివారం పగిడేరు గ్రామంలో జీవధర్మన్ ప్రా జెక్టును పరిశీలించారు. ఈ పర్యటనలో ముందుగా డైరెక్టర్ ప్లానింగ్ కొప్పు ల వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పగిడేరు సింగరేణి జియో థర్మల్ విద్యుత్ ప్లాంట్ సందర్శించారు. ప్రస్తుతం ఉత్పత్తి సామర్థ్యం 20 కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్య పెంపుకు అవకాశాలు పరిశీలించాలని సం బంధిత అధికారులతో సమాలోచనలు జరిపారు. అనంతరం డైరెక్టర్ ప్లా నింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులతో పీకే ఓసి 2 గనిని వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను సందర్శించారు. భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా ఓపెన్ కాస్ట్ గనులలో చేరే వర్షపు నీరుని బయట పంపే విధంగా ముందస్తు చర్యలు చేపట్టి సరిపడే మోటర్లు కండిషన్లు ఉండేలా సంబంధిత బాధ్యులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, బొగ్గు రవాణాకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు లేకుండా తగుచర్యలు చేపట్టాలని అధికారులను వారు సూచించారు. ఏరియా జిఎం దుర్గం రాం చందర్, జిఎం కనకయ్య, జిఎం శ్రీనివాస్, ఏజిఎం పంకజ్ ,శ్రీనివాస్, ఏరి యా ఇంజనీర్ బి. శ్రీనివాస్, ఇన్చార్జి ప్లానెట్ ఆఫీసర్ వీరభద్ర రావు, ఎస్ఓ టూ జిఎం బి. శ్రీనివాస్ , ఆర్అండ్బిడి జనరల్ మేనేజర్ కనకయ్య, ఎక్స్ప్లోరేషన్ జనరల్ మేనేజర్ బి.ఎస్. రావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ పీకే ఓసి వీరభద్రుడు, పీకే ఓసి 2 మేనేజర్ సురేష్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కె. శ్రీనివాస్, ఏరియా సర్వే ఆఫీసర్ దయాకర్, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ బబ్బుల్ రాజ్ పాల్గొన్నారు.

# సందడిగా మారిన పెద్దమ్మతల్లి ఆలయం



ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్యన కొలు వై ఉన్న ( శ్రీ కనకదుర్గ ) పెద్దమ్మతల్లి దేవాలయం ఆదివారం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో సందడిగా మారింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు .ఒడిబియ్యం, చీరలు, కనుములు తదితర మొ క్కు లు చెల్లించుకొన్నారు. దేవస్థానం ఆద్వర్యంలో క్యూలైన్లో భక్తుల కోసం ఉచిత పులిహోర వితరణ, మంచినీటి వసతి కల్పించారు. నేడే టెం డర్ బహిరంగ వేలం : దేవస్థానంకు చెందిన షాపులను, చీర లు ప్రోగు చేసుకొనే లైసెన్స్ హకుల్కు, పూలు, పూల దండలు అమ్ముకొనుటకు లీజులు, లైసెన్స్ హక్కులు పొందటానికి నేడు దేవాలయ ఆవరణంలో టెండర్ కం బహిరంగ వేలములను ని ర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీ కు మారి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ. 200/లు చెల్లించి షెడ్యూల్ పొందాలని, నిభంధనల మేరకు డిడిజతపరిచి టెండర్ కం బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు. అలాగే ఆలయంలో పులిహోర, లడ్డూ ఇతర ప్రసాదములను తయారు చేసేందుకు ఆలయాల్లో పని చేసిన అనుభవం కలిగిన బ్రాహ్మణులు కావాలని, ఆసక్తి కలిగిన వారు ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

ప్రజాపక్షం/వైరా: రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వైరా మండల పరిధిలోని రెబ్బవరం బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలను భూక్యా వీరభద్రం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సొంత భవనం లేక అరకొర వసతులతో చదువులు సక్రమంగా చదవలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనం నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మించాలని కోరారు. కాంట్రాక్టర్లు గురుకులాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని ఎలంటి అవకతవలు లేకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారు చెప్పిన సమస్యలను అక్కడి ప్రిన్సిపాల్ వార్డెన్, సంబంధించి వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. బాలికలకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వారికి నిపుణులైన వైద్యులతో సకాలంలో వైద్య సౌకర్యాలు అందేవిధంగా చర్యలు ప్రభుత్వం చేపట్టాలని కోరారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి మెనూ ప్రకారం అన్ని అందించాలని సూచించారు.

## ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్ సహకారంతో సయ్యద్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం హిందీ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సంధర్భంగా అరుణ కుమారి, షాహనాజ్ ఖాన్లు మాట్లాడుతూ దేవనాగరి లిపిలో ఉన్న హిందీ భాషను దేశ అధికార భాషగా గుర్తించిన తరువాత ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 14వ, తేదీన జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని జరుపుకొంటారని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మను యూత్ క్లబ్ సబ్యులు సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, డి. రమేష్,వేముల కామేశ్వరరావు, కొండలరావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, శెట్టి స్వరూపరాణి, శ్రీదేవి, పొట్లపువ్వు శ్రీనివాసరావు, దీపిక, విమల పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ ర్యాలీకి భారీగా కదిలిన లంబాడీలు

ప్రజాపక్షం/పాల్వంచ : కొత్తగూడెంలో ఆదివారం జరిగిన ఆత్మగౌరవ ర్యాలీకి పాల్వంచ మండల వ్యాప్తంగా లంబాడీలు భారీగా కదిలారు. ముందుగా కేటిపిఎస్ సి కాలనీ గేటు దగ్గర నుండి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ మీదుగా అంబేద్కర్సెంటర్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. లంబాడీ సామాజికి వర్గాలు అన్నదమ్ముల వలె కలిసి ఉంటున్నారని అన్నారు. కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవటానికి ఆదివాసీలను లంబాడీలపైకి ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించాలని కోర్టుకు వెళ్ళటం దుర్మార్గమని మండిపడ్డారు. ఇకనైనా అలాంటి ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. లేదంటే లంబాడీ సామాజిక వర్గాల ఆగ్రహానికి గురికావలసి వస్తుందన్నారు. జేఏసి నాయకులు ఉపేందర్ నాయక్, భట్టు మంజుల, కుశనాయక్, భరత్, భద్రు నాయక్, పరమేష్, నందిని, రమేష్, రాము నాయక్ పాల్గొన్నారు.

# అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి



### నత్తలతో రైతులకు నష్టం..!
### బెంబేలెత్తుతున్న రైతన్నలు
### రాత్రి వేళల్లో మిరపపై నత్తల దాడి

ప్రజాపక్షం/పినపాక: పంటలపై కోతులు, ఎలుకలు, మిడతలు ఆఖరికి సీమలు దాడి చేయడం చూశాం విన్నాం ఎప్పుడైనా నత్తలు దాడి చేయడం విన్నామా పినపాక మండలంలో ఇప్పుడిదే సమస్యగా మారింది. నత్తలు గుంపులు, గుంపులుగా దండెత్తుతున్నాయి. ఇళ్లు, వాకిళ్లతోపాటు పంటలపైనా దాడి చేస్తున్నాయి. మిరప తోటలు సాగుచేసిన రైతులపాలిట ఈ ఏడాది నత్తలు శాపంలా మారింది. మండలంలోని చింతల బయ్యారం, వెంకట్రావ్ పేట, పాతరెడ్డి పాలెం, దుగినేపల్లి, ఏడూళ్ల బయ్యారం, సింగిరెడ్డి పల్లి పలు గ్రామాల్లో మిరప తోటల్లో గుంపులుగా నత్తలు సంచరిస్తున్నాయి. అవి మొక్క దశలోనే కాండాన్ని తొలుస్తుండటంతో రెండు నుంచి మూడు రోజులల్లోనే మొక్కలు వడలిపోతున్నాయి. వర్షం వస్తే ఉదయాన్నే పొలానికి వెళ్లి చూసేసరికి సాళ్లల్లో ఎక్కడ చూసిన నత్తలే కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పగటిపూట కనిపించని నత్తలు రాత్రి సమయాల్లో తోటల్లోకి ప్రవేశిస్తున్నాయి. డ్రిప్పులు అమర్చిన పొలాల్లో మల్చింగ్ షీట్ కిందకు చేరిమొక్క మొదళ్లను నాశనం చేస్తున్నాయి. మరోవైపు డ్రిప్ లేటర్లలోకి నత్తలు వెళ్లడంతో పైపుల్లో నీళ్ల రాకుండా బ్లాక్ అవుతున్నాయి. ఉదయం పూట ఓ తోట నుంచి మరో పొలంలోకి పాకిపోతున్నాయి. ఇవి జిగటలాంటి ద్రవాన్ని విసర్జిస్తూ వెళుతున్నట్టు రైతులు చెబుతున్నారు. మిరప తోటలకు గతంలో వైరస్ తెగుళ్లుసోకేవి. అలాగే గత ఏడాది ధర తక్కువ ఉండటంతో రైతన్నలకు నష్టాలను చవిచూడటంతో ఈ ఏడాది పంటవిస్తీర్ణం తగ్గినప్పటికీ రైతులను ప్రస్తుతం నత్తలు నష్టపరుస్తున్నాయి.ఈ ఏడాది వర్షాలు అధికంగా కురుస్తున్నందున నత్తలు అధికంగా పొలాల్లో తిరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి వీటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని రైతన్నలు కోరుతున్నారు.

# రీల్

## 1న 'ఇడ్లీ కొట్టు' విడుదల



'కుబేర'తో బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకున్న నేషనల్ అవార్డ్ విన్నింగ్ సూపర్ స్టార్ ధనుష్ 'ఇడ్లీ కొట్టు' సినిమాతో అలరించబోతున్నారు. ధనుష్ హీరో, డైరెక్టర్ గా చేస్తున్న ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిలమ్స్ బ్యానర్స్ పై ఆకాష్ బాస్కరన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. డైరెక్టర్ గా ధనుష్ కి ఇది నాలుగో మూవీ. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం తెలుగు, తమిళ్ లో ఒకేసారి అక్టోబర్ 1న రిలీజ్ కానుంది. చాలా మంది ఈ సినిమా తెలుగు రైట్స్ కోసం పోటీ పడ్డారు. ఫైనల్ గా ధనుష్ కెరీర్ లోనే హైయెస్ట్ ప్రైస్ కి శ్రీ వేదక్షర మూవీస్ తెలుగు రైట్స్ ని దక్కించుకుంది. శ్రీ వేదక్షర మూవీస్ బ్యానర్ ద్వారా నిర్మాత రామారావు చింతపల్లి తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత రామారావు చింతపల్లి మాట్లాడుతూ...ఈ సినిమాని అక్టోబర్ 1న ధనుష్ గారి కెరీర్ లోనే హైయెస్ట్ థియేటర్స్ లో గ్రాండ రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాము. తెలుగులో చాలా అగ్రెసివ్ గా ప్రమోట్ చేసి సినిమాని భారీగా రిలీజ్ చేయబోతున్నాము. ఈ సినిమా తెలుగు రైట్స్ మాకు ఇచ్చినందుకు ధనుష్ కి, టీం కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. నిత్యా మీనన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు. కిరణ్ కౌశిక్ డీవోపీ గా పని చేస్తుండగా, ప్రసన్న జీకే ఎడిటర్, జాకీ ప్రొడక్షన్ డిజైనర్. పీటర్ హెయిన్ మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.'ఇడ్లీ కొట్టు' తెలుగు తమిళ్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ధనుష్, నిత్యా మీనన్, అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ నటిస్తున్నారు.



## 'హే భగవాన్' సెట్‌లో శివానీ సంబరం

లిటిల్ హార్ట్స్ సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో హీరోయిన్ గా నటించిన శివానీ నాగారంకు మంచి పేరు వచ్చింది. ఈ తరుణంలో ఆమే హే భగవాన్ సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నారు. షూటింగ్ సెట్‌కు వెల్లిన శివానీ నా గారంను సాదరంగా ఆహ్వానించి లిటిల్ హార్ట్స్ సినిమా సక్సెస్ అయినందుకు కేక్ కట్ చేశారు. హే భగవాన్ సినిమా షూటింగ్ సెట్ లో కేక్ కట్ చేసిన నటీ నటులు సంతోశాన్ని పంచుకున్నారు. హే భగవాన్ సినిమాలో సుహాస్ హీరోగా నటిస్తున్నారు. గతంలో శివాని నాగారం అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ లో సుహాస్ సరసన నటించింది. హే భగవాన్ సినిమా షూటింగ్ జరుగుతుంది

## కవాయ్ ఐల్యాండ్స్ లో విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ ఇటీవల యూఎస్ లోని కవాయ్ ఐల్యాండ్స్ వెకేషన్ వెళ్లారు. ఈ ఐల్యాండ్స్ లో బ్యూటిఫుల్ నేచర్ ను ఎంజాయ్ చేసిన ఫొటోస్, వీడియోస్ ఇన్ స్టా ద్వారా షేర్ చేశారు విజయ్. హవాయ్ లోని కవాయ్ ఐల్యాండ్స్ వర్సటైల్ నేచర్ కు ప్రసిద్ధి. హిస్టారికల్ గానూ ఈ ఐల్యాండ్స్ కు ఎంతో ప్రత్యేకత ఉంది.

ఫ్యామిలీ అండ ఫ్రెండ్స్ తో కలిసి ఈ ట్రిప్ కు వెళ్లడం హ్యాపీగా ఉందని విజయ్ దేవరకొండ తన పోస్ట్ లో పేర్కొన్నారు. కవాయ్ ఐల్యాండ్స్ లోని బ్యూటిఫుల్ లొకేషన్స్ ఆకట్టుకున్నాయని ఆయన తెలిపారు. మరో వెకేషన్ వెళ్లేలోగా తన ప్రెజెంట్ మూవీస్ షూటింగ్ కు రెడీ అవుతున్నట్లు విజయ్ దేవరకొండ వెల్లడించారు. ఇటీవల కింగ్డమ్ తో పాన్ ఇండియా సక్సెస్ అందుకున్న విజయ్ దేవరకొండ, ప్రస్తుతం రౌడీ జనార్ధన, వీడీ 14 చిత్రాల్లో నటిస్తున్నారు.







## 'లక్ష్మణరేఖ' గోల్డెన్ జూబ్లీ వేడుక


గోపాలకృష్ణ దర్శకత్వంలో మురళీమోహన్ , జయసుధ జంటగా నటించిన 'లక్ష్మణ రేఖ' చిత్రం విడుదలై 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక నిర్వహించారు. చిత్ర దర్శకుడు గోపాలకృష్ణ, మురళీమోహన్, జయసుధతోపాటు ఈ చిత్రానికి కో డైరెక్టర్ గా పని చేసిన రాజేంద్రప్రసాద్ లను ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరంతా 50 ఏళ్ళు వెనక్కి వెళ్ళి, అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్రమశిక్షణ, అంకితభావాలను లక్ష్మణరేఖలుగా మలచుకుని ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రామసత్యనారాయణను అభినందించారు. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకలో సీనియర్ దర్శకులు ధవళ సత్యం, పి.ఎన్. రామచంద్ర రావు, తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్న కుమార్, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్, ఫిలింనగర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాజా సూర్యనారాయణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టులు సురేష్ కొండేటి, ధీరజ అప్పాజీ పాల్గొన్నారు.

## ఘనంగా 'దక్ష' ప్రీ రిలీజ్



మంచు లక్ష్మీ ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్ అండ మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'దక్ష ది డెడ్‌లీ కాన్సిరసీ'. ఈ సినిమాలో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఈ చిత్రంలో నటించడం విశేషం. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ఈ నెల 19న ఈ సినిమా వరల్డ్ వైడ గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ 'దక్ష' కథను నా దగ్గరకు నాన్న తీసుకొచ్చారు. ఆయనే ఈ కథను తీసుకొచ్చారా అనేది మొదట్లో నమ్మలేకపోయాను. ప్రతి చిత్రంతో మనకొక సొంత టీమ్ తయారవుతుంది. మహేశ్, జెమినీ సురేష్ వంటి కో ఆర్టిస్టులతో మాకొక కొత్త టీమ్ ఫార్మ్ అయ్యింది. 'దక్ష' సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ఇది తమ సినిమా అనుకునే నటించారు. మహేశ్ అయితే ప్రమోషన్స్ గురించి ఎలా చేయాలో చెప్పేవాడు. ఈ చిత్రంలో నాన్న ఇమేజ్ కు తగినట్లు పర్ఫెక్ట్ క్యారెక్టర్ ఉంది. అందుకే ఆయనను అడిగాం. సముద్రఖని, సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా..ఇలా పాన్ ఇండియా వైజ్ చూస్తే ప్రతి భాష నుంచి పేరున్న ఆర్టిస్టులు మా చిత్రంలో నటించారు. నాన్న తర్వాత నన్ను అంత బాగా చూసుకునేది మనోజ్. అతను సినిమా చేయనప్పుడు ఇలాంటి మంచి ఆర్టిస్ట్ స్క్రీన్ మీద మళ్లీ ఎప్పుడు కనిపిస్తాడు అని ఒంటరిగా బాధపడ్డాను. మనోజ్ హీరోగానే కాదు విలన్ గానూ మెప్పించగలడు, కామెడీ చేయగలడు. వర్సటైల్ యాక్టర్ గా ప్రూవ్ చేసుకున్నాడు. 'దక్ష' సినిమాకు మనోజ్ ఇచ్చిన సజెషన్స్ ను తీసుకున్నాను. ఎందుకంటే మనోజ్ కు ఫిలిం మేకింగ్ మీద, ప్రతి క్రాఫ్ట్ మీద పట్టుంది. నాన్న గారితో అమితాబ్ పీకూ లాంటి మూవీ చేయాలని ఉంది. నటిగా నా ప్రయాణాన్ని ఆపను. తమిళం, మలయాళంలో కూడా నటించాను అని అన్నారు. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ నా మిరాయ్ మూవీని సక్సెస్ చేసినందుకు ప్రేక్షకులకు థ్యాంక్స్. నెకట్స్ వీక్ అక్క, నాన్న కలిసి నటించిన 'దక్ష' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాను కూడా మీరు పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. ఈ సినిమా కోసం అక్క చాలా కష్టపడింది. 'దక్ష' టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ చెబుతున్నా. ప్రస్తుతం ప్రేక్షకులతో థియేటర్స్ కళకళలాడుతున్నాయి. లిటిల్ హార్ట్స్ హిట్ అయ్యింది, బెల్లంకొండ సాయి కిష్కింధపురి మంచి విజయాన్ని అందుకుంది. అలాగే మా మిరాయ్ ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. రెండు చిత్రాలు రిలీజై మంచి విజయం సాధించాయి. అందుకు బెల్లంకొండ సాయి బ్రదర్ కు కంగ్రాట్స్ చెబుతున్నా. నెకట్స్ 'దక్ష' రాబోతోంది అన్నారు.

## భద్రకాళి లాంటి పొలిటికల్ థ్రిల్లర్
## రామాంజనేయులు జవ్వాజి



హీరో విజయ్ ఆంటోనీ 'మార్గన్' విజయం తర్వాత మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'తో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్ మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కనెక్ట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ విలేకరుల సమవేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

విజయ్ ఆంటోనీ ఎప్పటినుంచో మంచి మిత్రులం. విజయ్ ఆంటోనీ ఫిలిం ఫ్యాక్టరీ, మా బ్యానర్ సర్వంత్ రామ్ క్రియేషన్స్ కలిపి కొన్ని మూవీస్ చేయాలని ప్రయాణం మొదలు పెట్టాం. మార్గాన్ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు భద్రకాళి సెప్టెంబర్ 19 రిలీజ్ కాబోతుంది. ఇటీవలే బూకి అనే సినిమాని మొదలుపెట్టాం. మలయాళం లో ఒక సినిమా చేస్తున్నాం. అది చివరి దశకు వచ్చింది. మా రెండు బ్యానర్స్ లో ఇంకొన్ని సినిమాలు కూడా చర్చల్లో ఉన్నాయి. త్వరలోనే వాటి గురించి అనౌన్స్ చేస్తాం. బిచ్చగాడు డైరెక్టర్ శశి, విజయ్ ఆంటోని కాంబినేషన్లో ఒక భారీ ప్రాజెక్టు ఉంటుంది. తొందరలో అది అనౌన్స్ చేస్తాం. మేము విజయ్ ఆంటోని గారు కలవడం వల్ల బ్యాక్ టు బ్యాక్ సినిమాలో చేస్తున్నాము. మా నుంచి వరుసగా సినిమాలు రాబోతున్నాయి.డైరెక్టర్ అరుణ్ ప్రభు గారు కథ చెప్పారు. చాలా బాగుంది. డైరెక్టర్ గారు అంతకుముందు తీసిన రెండు సినిమాలు కూడా చాలా అద్భుతంగా ఉంటాయి.సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఇది విజయ్ ఆంటోనీకి 25వ సినిమా అవ్వడం కూడా కలిసి వచ్చింది.మార్గాన్ కి ముందు దాదాపు 11 సినిమాలు చేశాను. తమిళ్లో చాలా పెద్ద లెవెల్లో డిస్ట్రిబ్యూషన్ చేశాం. అయితే కోవిడ్ తర్వాత కొంచెం గ్యాప్ వచ్చింది. తర్వాత విజయ్ ఆంటోనీ గారితో రీ కనెక్ట్ అవడంతో మళ్లీ సినిమాల వరుసగా చేయాలని ప్లాన్ చేశాం. తెలుగులో సత్యదేవ్ గారితో ఫుల్ బాటిల్ అనే సినిమా చేస్తున్నాం. అది కంప్లీట్ అయి రెడీగా ఉంది. నవంబర్లో

## సుంకం రద్దు కత్తి
**(మొదటి పేజీ తరువాయి)**

బెదిరింపుల తర్వాత భారత్ దిగుమతి సుంకాన్ని రద్దు చేసింది. ఆగస్టు 15న ఎర్రకోట సాక్షిగా మోడీ భారత వ్యవసాయ రంగాన్ని కూడా చెప్పిన మాటలు మరిచి పోయి ఆగస్టు 19న దిగుమతి సుంకాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది భారత వ్యవసాయ రంగానికి ప్రత్యేకించి పత్తి రైతాంగానికి ఆశ నిపాతంలా తగిలింది. తెలంగాణలో 66 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారు.గతేడాది అతివృష్టి కారణంగా దిగుబడి రాక ఒకవిధంగా నష్టపోగా నాణ్యమైన పత్తి రాలేదని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) రైతుల వద్ద సరైన రీతిలో పత్తి కొనుగోలు చేయలేదు. ప్రైవేటు వ్యాపారులకు క్వింటా మూడు వేల నుంచి ఐదువేల నడుమ గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు విక్రయించాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా భారీ వర్షాలు పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. ఒక పక్క దిగుబడి తగ్గి మరో పక్క గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న పత్తి రైతుపై దిగుమతి సుంకం రద్దు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారైంది. పత్తి ధర మరింత తగ్గితే పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.దశాబ్ద కాలంగా మోడీ రైతాంగ వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇప్పటికీ రోజుకు 31 మంది దేశ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ రంగ నష్టాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే దేశీయ సంస్థలను, పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిన మోడీ వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు యధాశక్తి ప్రయత్నిస్తున్నారు. నూటికి 65 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని పరిరక్షించడానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మోడీ ప్రధాని అయ్యే వరకు వివిధ రూపాలలో ప్రోత్సాహాన్ని అందిస్తూ సబ్సిడీలను ఇచ్చేవారు. దశాబ్ద కాల మోడీ పాలనలో రూ. 87339 కోట్ల సబ్సిడీని తగ్గించారు. కొన్ని సబ్సిడీలను ఎత్తివేశారు. ఒక పక్క వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేస్తూ మరో పక్క కార్పొరేట్ శక్తులు సంపన్న వర్గాలకు రూ. 26 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు. వ్యవసాయ రుణాలను రద్దు చేసేందుకు ససేమీరా అంటున్న బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు రూ. 26 లక్షల కోట్లు ఎలా రద్దు చేశారన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉపాధి,ఉద్యోగ కల్పన రంగాలు వట్టిపోతున్నాయి. దేశ జనాభాలో సగభాగం ఉన్న యువతలో మూడొంతుల మంది ఉపాధి ఉద్యోగాలు లేక కొట్టుమిట్టాడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న ఇప్పటికీ అతిపెద్ద ఉపాధి రంగంగా ఉన్న వ్యవసాయ రంగం పట్ల మోడీ సర్కార్ కక్ష పూరిత నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతే భారతదేశ ఆర్థిక రంగం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. నెలకో దేశం తిరిగే మోడీకి ఇతర దేశాల్లో వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలు కనిపించక పోవడం భారతదేశ రైతుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికే వ్యవసాయ రంగం నుంచి యేటా లక్షలాది కుటుంబాలు వైదొలిగి ప్రత్యామ్నాయ రంగాల వైపు పయనిస్తున్నాయి. మోడీ ప్రభుత్వ నిర్ణయాలతో మరిన్ని మరిన్ని ఇబ్బందికర పరిస్థితులు తలెత్తి వ్యవసాయ రంగం ఇబ్బందులను ఎదుర్కొంటే అది జాతీయ విపత్తుగా మారే ప్రమాదం ఉంది. దేశంలో ప్రధానమైన వ్యవసాయ ఉత్పత్తులకు పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించాలని దశాబ్దాలుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. మూడు సాగు చట్టాలకు సంబంధించి చారిత్రాత్మక పోరాటం నిర్వహించిన కిసాన్ సంయుక్త మోర్చా నేతృత్వంలో దేశ వ్యాప్తంగారైతు సంఘాలు పత్తి దిగుమతి సుంకం రద్దుపై ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కేంద్రం దిగివచ్చి సుంకం రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు ప్రధాన పంటలకు పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఆందోళన తీవ్ర రూపం దాలిస్తే మోడీ సర్కార్‌కు చిక్కులు తప్పకపోవచ్చు. ఇదే సమయంలో మేధావులు, వామ పక్ష ప్రజాతంత్ర శక్తులకు చెందిన వారు వ్యవసాయ రంగ పరిరక్షణకు సంబంధించి గొంతెత్తడం శుభసూచికం.

## అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం భేష్

### చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధుల ప్రశంస
### సిపిఐ కేరళ కార్యాలయం సందర్శన



**తిరువనంతపురం:** అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం భేష్ అంటూ చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) ప్రతినిధుల ప్రశంసించారు. కేరళ, తిరువనంతపురంలోని సిపిఐ కేంద్ర కార్యాలయం, ఎంఎన్ మెమోరియల్‌ను చైనా ప్రతినిధులు సందర్శించారు. కమ్యూనిస్టు పార్టీలతో స్నేహాన్ని పెంచుకునే ఉద్దేశంతో వారు ఈ పర్యటన చేపట్టారు. ప్రతినిధులు హె మెంగ్, జౌ గ్యుహే, గువా డాంగ్‌డాంగ్‌కు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.ప్రకాశ్ బాబు, మంత్రి జిఆర్ అనిల్ స్వాగతం పలికారు. భూ సంస్కరణలు, అక్షరాస్యత, ప్రజా పంపిణీ వ్యవస్థ, వ్యవసాయంలో పురోగతి, గృహాల నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాల్లో సాధించిన విజయాలను చైనా ప్రతినిధులకు వివరించారు. కేరళ రాజకీయ చరిత్ర, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని చైనా ప్రతినిధులు చెప్పారు. తమ అధ్యక్షుడు జిన్‌పింగ్ రాసిన పుస్తకాన్ని ప్రకాశ్ బాబుకు అందజేశారు. చైనా ప్రతినిధులను ప్రకాశ్ బాబు, అనిల్ సన్మానించారు.

## పోటాపోటీ ర్యాలీలు
**(మొదటి పేజీ తరువాయి)**

కేసులు నమోదు చేశారు. అమెరికాలోని ఉతాహ్ యూనివర్సిటీలో ట్రంప్ సన్నిహితుడు, మితవాద నాయకులు ఛార్లీ కిర్క్ హత్య ఘటన తర్వాత బ్రిటన్‌లో ఈ భారీ ర్యాలీ జరిగింది. బ్రిటన్‌లో మతఛాందన వాద నాయకుడు, ఇస్లాం వ్యతిరేక బ్రిటీష్ ప్రచారకుడు టామీ రాబిన్సన్ (స్టీఫెన్ క్రిస్టోఫర్ యాక్సీ లెన్నాన్) నాయకత్వంలో ఈ చరిత్రాత్మక ర్యాలీ జరిగింది. బ్రిటన్‌లోని మితవాద నాయకులలో టామీ రాబిన్సన్ ఎంతో ప్రముఖుడు. బ్రిటన్ ఫాసిస్టు రాజకీయపార్టీ బ్రిటీష్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) నాయకుడుగా 2004లో కెరీర్ ప్రారంభించిన రాబిన్సన్ తనను తాను స్వతంత్ర జర్నలిస్టుగా చెప్పుకుంటాడు. ఛార్లీ కిర్క్ హత్య తర్వాత రాబిన్సన్ ఈ ర్యాలీ నిర్వహించాడు. ఇతడి వలసనిర్మూలన,ఇస్లాం వ్యతిరేక వైఖరిని ప్రతిఘటిస్తూ జాతి వివక్షను వ్యతిరేకిస్తూ, స్టాండ్ అప్ టు రేసిజం (ఎస్‌యుటిఆర్) పేరుతో ఐదువేలమంది ప్రజదర్శకులు పోటీ ర్యాలీ నిర్వహించారు. యునైటెడ్ కింగ్డన్–స్టాండ్ అప్ టూ రేసిజం ర్యాలీలు రెండూ దాదాపు దగ్గర దగ్గరకు చేరుకునే పరిస్థితుల్లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి.

## యువతరానికి బూర్గుల గొప్ప మార్గదర్శి

### మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు సేవలు అమోఘమని, యువతరానికి ఆయన గొప్ప మార్గదర్శి అని మంత్రి పొన్నం ప్రభా క ర్, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమా ర్‌గౌడ్ అన్నారు. ఆయన చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తూ ప్రజాసేవకు కట్టు బడి ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి హైదరాబాద్ లిబర్టీ క్రాస్ రోడ్‌లోని బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బూర్గుల రామకృష్ణారావు సిఎంగా చెరగని ముద్ర వేశారని కొనియడారు. ఆయన గొప్ప సామాజిక సంస్కర్త అన్నారు. వారి దూరదృష్టి ఇప్పటికీ మనందరికీ ఆదర్శమన్నారు. భవిష్యత్ తరాలకు బూర్గుల స్ఫూర్తి దాయక నేతగా నిలిచారన్నారు.

## బెగ్గర్స్ హోమ్స్‌ను సంస్కరించండి
**(మొదటి పేజీ తరువాయి)**

పెంచి స్వయంసమృద్ధి చేకూర్చాలని, తర్వాత వారి జీవన భరోసాతో బయటకు విడుదల చేయాలని తెలిపింది. స్వచ్ఛంధ సంస్థలకు, ప్రైవేటుసంస్థలకు శిక్షణ విషయంలో భాగస్వామ్యం ఇవ్వాలని తెలిపింది. రాష్ట్ర స్థాయిలో న్యాయవాదులు ఈ హోమ్స్‌లో ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యటనలు జరిపి తనిఖీలు చేయాలని, వారికున్న న్యాయపరమైన హక్కుల గురించి వారికి వివరించాలని తెలిపింది. రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఈ హోమ్స్‌లో పర్యటించేందుకు న్యాయవాదుల బృందాలను ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. పిల్లలు ఉండే సంక్షేమ కేంద్రాలలో ప్రత్యేక సదుపాయాలు సమకూర్చాలని తెలిపింది. వారి సంరక్షణ, వారి విద్య,గోప్యతలకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే యాచక సంరక్షణ నిలయాలు కేవలం విచక్షణపూర్వకంగా ఏర్పాటు చేసే దాతృత్వ కేంద్రాలుగా ఉండకూడదని, ఈ కేంద్రాలు రాజ్యాంగ నైతిక విలువలను అనివార్యంగా ప్రతిబింబించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రాలలో ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు బెగ్గర్స్ హోమ్స్‌లో ఈ మార్గదర్శకాలకు, రాజ్యాంగ నైతిక విలువలకు అనుగుణంగా అవసరమైన వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆదేశించింది. యాచకుల జీవితాలకు భరోసా ఇవ్వాలని, వారి మర్యాద,గౌరవాలకు భంగం కలగకుండా చూడాలని ఆదేశించింది. సమాజంలో అత్యంత సున్నితమైన ఈ వర్గం మర్యాదపూర్వకమైన జీవితం గడిపేందుకు పూర్తి భరోసా ఇవ్వాలని మార్గదర్శకాల్లో తెలియజేసింది. బెగ్గర్స్ హోమ్స్‌లో మానవత్వాన్ని కాపాడేందుకు అనువైన పరిస్థితులు కల్పించడంలో విఫలం కావడం కేవలం దుష్పరిపాలన మాత్రమే కాదని, రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని ధర్మాసనం హెచ్చరిక చేసింది.''కూటికి లేకుండా బాధపడే నిరుపేదలకు భరోసా ఇవ్వడం రాజ్యాంగంలో నిర్దేశించిన జీవించే మౌలికహక్కు, ఇది నిశ్చయార్థకమైనది, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలే నిస్సందేహంగా వీటిని నిర్వహించాలి, అందువల్ల ఇది రాజ్యాంగ విశ్వసనీయతను కాపాడటమే తప్ప ఏదో విచక్షణాపూర్వకంగా చేసే దాతృత్వం కాదు, అందువల్ల ప్రభుత్వ యంత్రాంగం ఈ కేంద్రాల నిర్వహణలో రాజ్యాంగ నైతిక విలువలను ప్రతిబింబించాలి, స్వేచ్ఛ, వ్యక్తిగత గోప్యత, శారీరక, భౌతిక స్వయంప్రతిపత్తితోపాటు మర్యాదపూర్వకంగా జీవించే పరిస్థితులు యాచకులకు కల్పించాలి'' అని ధర్మాసనం మార్గదర్శకాలలో వివరించింది. ''ఈ యాచక కేంద్రాలలో నెలవారీ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయాలి, అర్హులైన వైద్యాధికారుల బృందం ఈ పరీక్షలు నిర్వహించాలి, వ్యాధులు ప్రబలకుండా గస్తీ నిర్వహించాలి, వ్యాధులు ప్రబలడానికి ముందుగానే జాగ్రత్తలు తీసుకుని వారికి సమాచారం తెలియజేయాలి, అందుకు తగిన వ్యవస్థ ఉండాలి, నీటిద్వారా వ్యాపించే వ్యాధులు, గాలి ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవడం, వారికి తగిన సమాచారం చెప్పడంతోపాటు వాని నివారణకు ప్రత్యేకమైన చర్యలు అమలు చేయాలి, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలు కనీస పరిశుభ్రతా పరిస్థితులు, పరిశు భ్రతా ప్రమాణాలను కేంద్రాలలో పాటించాలి, ఇందుకు తగిన ప్రామాణికతలను నిర్దేశించాలి, మరుగుదొడ్ల పరిశుభ్రత ఎంతో ముఖ్యం, వాటిని ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలి, డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థ సక్రమంగా పనిచేస్తోందోలేదో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి, నిత్యం కీటకసంహార నియంత్రణ చర్యలను బెగ్గర్స్‌హోమ్స్‌లో తీసుకోవాలి, ప్రతి బెగ్గర్స్ హోమ్‌కు ఒక ఆసుపత్రిని అనుసంధానంగా ఉంచాలి'' అని సుప్రీం ధర్మాసనం మార్గదర్శకాల్లో వివరించింది. మూడోపక్షం ద్వారా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి బెగ్గర్స్ హోమ్స్‌లో స్వతంత్ర తనిఖీలు జరిపించి నివేదికలు తీసుకోవాని ప్రభుత్వాలకు ఆదేశించింది. ఈ కేంద్రాలనుండి విడుదల చేసిన యాచకులకు పునరావాసాన్ని కూడా పర్యవేక్షించాలని తెలిపింది.

## దారుణం...
**(మొదటి పేజీ తరువాయి)**

చోటుచేసుకుంది.. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని బండ్లగూడ పరిధిలో శనివారం జరిగింది. బాలుడి మృతదేహం కోసం పోలీసులు మూసీలో గాలిస్తున్నారు. ఏసీపీ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం, బండ్లగూడ నూరినగర్కు చెందిన మహ్మద్ అక్బర్(35), సనాబేగం దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. తండ్రి అక్బర్ కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. సనాబేగం నిలోఫర్ ఆసుపత్రిలో కేర్ చేస్తోంది. చిన్న కుమారుడు మహ్మద్ అనాస్(3) తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనిపై భార్యభర్తల మధ్య ఎక్కువగా గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో తండ్రి కన్నబిడ్డను చంపాలని నిర్ణయించుకొని పథకం రచించాడు.శుక్రవారం రాత్రి భార్య విధులకు వెళ్లాక తెల్లవారుజామున అనాస్ తలపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేశాడు. ఆ తర్వాత సంచిలో మృతదేహాన్ని కుక్కి బ్రై తీసుకెళ్లాడు. అలా నయాపూల్ బ్రిడ్జి మీద నుంచి మూసీలోకి మృతదేహాన్ని విసిరాడు. అక్కడి నుంచి ఇంటికి వచ్చేసి, ఉదయం కాగానే పోలీస్ స్టేషన్కు వెళ్లి తన బిడ్డ కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. బంధువులు తీసుకెళ్లి మళ్లీ తన ఇంటి దగ్గర దింపినట్లు ఫోన్ చేసి చెప్పారని, అప్పటి నుంచి తన కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు చెప్పాడు.

**సిసిటివి కెమెరాలో చిక్కిన అక్బర్..**

పోలీసులకు అక్బర్‌పై అనుమానం కలిగింది. దీంతో అతని సెల్‌ఫోన్‌ను పరిశీలించారు. తన ఫోన్లో ఆ సమయానికి ఎలాంటి కాల్స్ రాలేదు. ఇంటి సమీపంలోని సిసిటివి కెమెరాలను పరిశీలించారు. తెల్లవారుజామున అక్బర్ సంచితో వెళ్తున్నట్లు కనిపించింది. దీంతో అతడిపై అనుమానం ఇంకా పెరిగింది. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరం అంగీకరించాడు. మూసీ నదిలో ఎక్కడ మృతదేహాన్ని విసిరేశాడో తెలిపాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముమ్మర దర్యాప్తులో భాగంగా శనివారం రాత్రి పోలీసులు మూసీలో గాలించినా బాలుడి మృతదేహం మాత్రం లభించలేదు. సమయం మించిపోవడంతో చీకట్లో వెతకడాన్ని పోలీసులు నిలిపివేశారు. మళ్లీ ఆదివారం ఉదయం నుంచి నయాపూల్ వద్ద మూసీలో డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

**కుటుంబ కలహాలతో భార్య గొంతుకోసిన భర్త**

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్య గొంతు కోశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన మహాలక్ష్మి (19), వేణుగోపాల్‌కు పెద్దల సమక్షంలో గతేడాది ఆగస్టులో వివాహం జరిగింది. తాగుడుకు బానిసగా మారి భార్య బంగారు నగలను అమ్ముకున్నాడు. కొంత బంగారాన్ని ఆమె పుట్టింట్లో దాచగా.. వాటిని తెమ్మని భార్యను వేధిస్తున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు వేణుగోపాల్ కు కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అయినా అతడి తీరు మారలేదు. ఆదివారం బంధువుల ఇంట్లో గృహ ప్రవేశానికి వెళదామని భార్య కోరగా ఆమెతో గొడవపడ్డాడు. కోపంతో బ్లేడు తీసుకొని ఆమె గొంతు కోశాడు. గమనించిన స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతోంది. నిందితుడు వేణుగోపాల్‌ను నాగోల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com